


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 92 | సోమవారం | 02-03-2026 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## డూ ఆర్ డై మ్యాచ్‌లో భారత్ పంజా

క్లాస్ ఆఫ్ సెంచరీతో చెలరేగిన శాంసన్

రికార్డు చేదనతో సెమీస్‌లోకి దూసుకెళ్లిన ఇండియా

09



## తెలుగువారు అప్రమత్తంగా ఉండాలి

భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధం కొనసాగుతున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భద్రతా తరువాయి 12లో



మరో 15 మంది

## మావోయిస్టులు లొంగుబాటు

**మహాసముంద్ :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోసారి లొంగిపోయారు. స్పెషల్ జోనల్ కమిటీ స్థాయి సభ్యుడు వికాస్ సహా 15 మంది నక్సలైట్లు ఆదివారం మహాసముంద్ జిల్లాలో భద్రతా సిబ్బంది లొంగిపోయారని ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ తెలిపారు. పోలీసుల తెలిపిన ప్రకారం తొమ్మిది మంది మహిళలు సహా లొంగిపోయిన కార్యకర్తలు బలంగిర్–బర్‌గఢ్–మహాసముంద్ మావోయిస్టుల విభాగానికి చెందినవారు ఉన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులో చురుకుగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానంలో ఈ అభివృద్ధిని ఒక ముఖ్యమైన దశగా తరువాయి 12లో







మొజ్తాబా హుస్సేనీ

# అలీ ఖమేనీ దారుణ హత్య

- ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో మరో 40 మంది అగ్రనేతలు మరణం
- దాడుల్లో 200పైగా పౌరులు మృతి
- వారసుడు ఖమేనీ కుమారుడు మొజ్తాబా

**టెహ్రాన్:** ఇజ్రాయెల్–అమెరికా ఉమ్మడి దాడుల్లో ఇరాన్ సర్వాధినేత అయెతుల్లా అలీ ఖమేనీ (86) దారుణహత్యకు గురయ్యారు. ఆయనతోపాటు ఆయన రక్షణమంత్రి, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రధానాధిపతి సహా దాదాపు 40 మంది అగ్రశ్రేణి సైనికాధికారులు,కమాండర్లు, మత నాయకులు గగనతల దాడుల్లో హతులయ్యారు. ఆయన కుమారుడు మొజ్తాబా హుస్సేనీ ఖమేనీ (57) 'సర్వోన్నత నాయకుడుగా బాధ్యతలు తీసుకుంటారు. అప్పటివరకూ దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ నాయకత్వంలో త్రిసభ్య కమిటీ తాత్కాలిక పాలనా బాధ్యతలు నిర్వహిస్తుంది. ఖమేనీ హత్యతో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌తోపాటు ఆరు అరబ్ గల్ఫ్ దేశాలలో 27 అమెరికా స్థావరాలు,కేంద్రాలపై భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇజ్రాయెల్‌లో పదిమంది మరణించగా ఇతర ప్రాంతాల్లో మరొకరు మరణించారు. ఇరాన్ దళాలు రెడ్ ఫ్లాగ్‌ను అందనంత ఎత్తులో ఎగురవేసిఅమెరికా–ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశాయి. ఈ దాడుల్లో ఆయన కుటుంబ సభ్యులు కూడా మరణించారు. ఖమేనీ అల్లుడు, కుమార్తె, ఆయన కోడలు, మనవరాలు హతులయ్యారు. తమ ప్రియమైన నాయకుడు, కీలకమైన సైనిక జనరల్స్,మంత్రివర్గ సభ్యులు దాడుల్లో మరణించారు, "ఒక మహోన్నతమైన నాయకుణ్ణి దేశం కోల్పోయింది" అని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ అధికారికంగా ప్రకటించింది. దాడుల్లో తరువాయి 2లో







### ముగ్గురు సభ్యులతో తాత్కాలిక నాయకత్వం

ఇరాన్ సర్వాధినేత ఖమేనీ హత్యను ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ మహానేరంగా పేర్కొన్నారు. శత్రువులు అంతకు అంత మూల్యం చెల్లించేట్టు చేస్తామని ప్రకటించారు. దేశంలో తలెత్తిన ఈ ఇబ్బందులను అధిగమించడానికి ఇరాన్ ప్రజలు ఐక్యంగా ఉంటారని అన్నారు. ఇది ఇస్లామిక్ రిపబ్లిక్‌కు కష్టకాలం, అత్యంత అస్థిరతా సమయం, ఇజ్రాయెల్, అమెరికా గుండెలు మండిస్తాం, వారి కీలక సైనిక కేంద్రాలను నాశనం చేస్తాం'' అన్నారు. దారుణమైన ఉగ్రవాద పిశాచ గణాల చేతుల్లో ఖమేనీ తరువాయి 2లో

పశ్చిమాసియాలో 27 స్థావరాలపై

# ఇరాన్ భీకర దాడులు

టెల్‌అవీవ్‌లో ఇజ్రాయెల్ సైనికస్థావరంపై దాడి

అనేకచోట్ల పేలుళ్ళు : దాడుల్లో మొత్తం 12 మంది మృతి

దెబ్బతిన్న దుబాయ్, అబుదాభి విమానాశ్రయాలు

స్తంభించిన వేలాది విమాన రాకపోకలు

02





### తక్షణం యుద్ధం ఆపండి

చైనా విజ్ఞప్తి



### ఖమేనీ హత్య మానవ నైతికత ఉల్లంఘన

రష్యా అధ్యక్షుడు పుతిన్ విమర్శ

### క్రూరత్వానికి నిజ స్వరూపం

అమెరికా– ఇజ్రాయిల్ మైత్రిపై సిపిఐ

ఖామేనీ హత్యకు ఖండన



## అమాంతం పెరిగిన విద్యుత్ డిమాండ్

ఎన్‌పిడిసిఎల్ చరిత్రలోనే గరిష్టంగా 6267 మెగావాట్లు నమోదు

సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్/హనుమకొండ

తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పిడిసిఎల్ ) చరిత్రలోనే రాష్ట్రంలో ఆదివారం విద్యుత్ డిమాండ్ అత్యధిక గరిష్టంగా 6267 మెగావాట్లు నమోదయింది. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినప్పటికీ సరఫరాలో అంతరాయం రాకుండా అందించేందుకు సమాయత్తంగా ఉన్నామని ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుత వేసవికాలంలో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, అందుకు సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని, తరువాయి 12లో

పేలుడు పదార్థాల తయారీ యూనిట్‌లో

# భారీ పేలుడు

18 మంది మృతి 24 మందికి గాయాలు

నాగ్‌పూర్‌లో ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో కంపెనీలో ఘటన



**నాగ్‌పూర్ :** భారత్‌లోని మరో పేలుడు పదార్థాల తయారీ యూనిట్‌లో భారీ పేలుడు సంభవించింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో ఆదివారం ఉదయం జరిగిన పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో జరిగిన శక్తివంతమైన పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 18 మంది మరణించగా, 24 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. శనివారం ఆంధ్రప్రదేశ్ కాకినాడ జిల్లాలోని క్రాకర్ యూనిట్‌లో జరిగిన పేలుడులో 21 మంది మరణించిన విషయం తెలిసిందే. మరుసటి రోజే నాగ్‌పూర్‌లో భారీ పేలుడు జరగడంతో దేశ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. కటోల్ తహసీల్ రౌల్‌గావ్‌లోని మైనింగ్, పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ సంస్థ అయిన ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఈ పేలుడు సంభవించిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. 18 మంది మరణించగా, మరో 24 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల గుర్తింపును నిర్ధారించడానికి డిఎన్‌ఎ పరీక్ష కోసం కుటుంబ సభ్యుల నమూనాలను తీసుకుంటున్నారు. బాధితుల కుటుంబ సభ్యులు తమ ప్రియమైనవారి సమాచారం కోసం జిల్లా ప్రధాన కార్యాలయం నుండి 50 కి.మీ దూరంలో ఉన్న ఫ్యాక్టరీ ఆవరణకు చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తునకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఆదేశించారు. పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పిఇఎస్ఒ), డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ సెక్యూరిటీ (డిఐఎస్ఎస్) అధికారులతో పాటు జాతీయ విపత్తు తరువాయి 12లో

## దేవాలయాలు, టూరిజం, కల్చర్‌తో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

సంగీత నాటక అకాడమీకి ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడాలు, రాష్ట్రంలోని పురాతన ఆలయాలను కలుపుతూ పర్యాటకం, సంస్కృతిని మేళవిస్తూ ఒక ప్రత్యేక 'యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని సంగీత నాటక అకాడమీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఆత్మ కళలు అని, ఆ కళలు, సంస్కృతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన రామదాసు జయంతి ఉత్సవాలలో డిప్యూటీ సిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నేల గర్వించదగ్గ గొప్ప వాగ్గేయకారుడు, భద్రాచల రామదాసు అని కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని కళాకారులకు, సాంస్కృతిక వైభవానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను రాష్ట్ర అభివృద్ధి గురించి సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలతో ప్రజలకు వివరించారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.ఆ కళారూపాల్లో ప్రజలు పాల్గొనడమే కాదు ప్రజలు స్పందించిన తీరు తనకు వ్యక్తిగతంగా తెలిసిన వ్యక్తిగా భవిష్యత్తులో సంగీత నాటక అకాడమీ విరివిగా కార్యక్రమాలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ తరువాయి 12లో

తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్

## నూతన కమిటీ

అధ్యక్షుడిగా ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.నర్సింహులు

ప్రజాపక్షం/హైదరాబాద్





తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర నాలుగవ మహాసభల్లో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎండి యూసుఫ్, ప్రధానకార్యదర్శిగా ఎం. నరసింహులు ఎన్నికైయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎం లక్ష్మీ బాయి , ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం ఉపాధ్యక్షులుగా భోగి ఉపేందర్, సిర్రా దేవేందర్, రామా రాజేష్ కన్నా, ఎస్ కిష్టమ్మ కార్యదర్శులుగా తరువాయి 2లో

## వెలుగుమట్ల పేదలకు 15 నాటికి నివాస స్థలాలు

ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం

పేదల వద్ద వసూలు చేసిన సొమ్మును రికవరీ చేస్తాం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/ఖమ్మం



వెలుగుమట్ల భూ నిర్వాసితులలో అర్హులైన వారిని గుర్తించి మార్చి 15 నాటికి నివాస స్థలాలు కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెలుగుమట్ల భూ నిర్వాసితుల సర్వే తరువాయి 2లో

## ఆక్రమించింది ఎంత... మట్టి తరలించిందెంత?

భూదాన్ భూములపై వాస్తవాలు ఏమిటి?

పేదల పాలిట శాపమైన అధికారుల నిర్లక్ష్యం

పేదలు ఆక్రమించింది ఆరు ఎకరాలే



ప్రజాపక్షం/ ఖమ్మం

ఖమ్మం భూదాన్ భూముల్లో ఏర్పాటు చేసుకున్న నివాసాల కూల్చివేత, పేదలను బయటకు పంపిన తీరు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజకీయ దుమారాన్ని లేపింది. ఇదే సమయంలో పేదలను అక్కడి నుంచి బయటకు పంపి రూ.250 కోట్ల భూమిని స్వాధీన పర్చుకున్నట్లు అధికారులు ప్రకటించారు. అసలు పేదలు అక్రమించిన భూదాన్ భూమి ఎంత అన్నదే ఇప్పుడు అందరి మదిని తొలుస్తున్నది. కొందరు 60 ఎకరాలని, మరికొందరు 30 ఎకరాలని ఇష్టాను సారంగా ప్రచారం చేస్తున్నారు. చాలా మందికి స్పష్టత లేదు. అధికారులు మాత్రం పేదలను అక్కడి నుంచి బయటకు పంపడం ద్వారా రూ. 250 కోట్ల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 ఎకరాల భూదాన్ భూమి ఎటు వెళ్లిందని ఎవరు ఆక్రమించుకున్నారని తరువాయి 12లో

# ముగిసిన ఖమేనీ శకం

40 రోజులు సంతాప దినాలు

ఇరాన్ వీధుల్లో వేలాదిమంది నివాళులు



**టెహ్రాన్:** ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌ను 37 సంవత్సరాలపాటు అవిచ్ఛిన్నంగా శాసించి, మత రాజ్య పునాదులను పటిష్టం చేసిన ఇరాన్ సర్వాధినేత అలీ ఖమేనీ (86) శకం ముగిసింది. ఖమేనీ మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రకటించింది. దీంతో ప్రపంచంలో ఒక దేశ నాయకుడి సుదీర్ఘ పాలన ముగిసింది. దేశంలో 40 రోజులు సంతాప దినాలు పాటిస్తామని, ఏడు రోజుల పాటు ప్రభుత్వ సంస్థలను పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని మెహర్ న్యూస్ తెలియజేసింది. 1979లో ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాన్ రిపబ్లిక్ ఆవిర్భవించినప్పటినుండీ ఆ దేశానికి ఇద్దరే ఇద్దరు సర్వాధినేతలుగా కొనసాగారు. వీరిలో శక్తిమంతమైన నాయకుడుగా ఎదిగిన అలీ ఖమేనీదే సుదీర్ఘ పరిపాలన. ఆయన లేని ఇరాన్ ప్రభుత్వం ఎలా ఉంటుందో ఆ దేశ యువకులకు తెలియదు. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్, జ్యుడీషియరీ ప్రధానాధిపతి, గార్డియన్ కౌన్సిల్, జ్యూరిస్టులు 88 మంది సమావేశమై కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేశారు. తమ ప్రియతమ నాయకుడు మరణించాడని తెలిసిన తర్వాత వేలాదిమంది ప్రజలు ఇరాన్ వ్యాప్తంగా వీధుల్లోకి వచ్చారు. టెహ్రాన్‌లోని ఎంఘెలాబ్ స్క్వేర్ వద్ద వేలాదిమంది గుమిగూడి ప్రార్థనలు చేశారు. గుండెలు బాదుకుంటూ ఖమేనీకి అంతిమ నివాళులు అర్పించారు. ఖమేనీ మా దేవుడు, ఆ మార్గంలో ప్రయాణం చేస్తాం అంటూ నినాదాలు చేశారు. అనేకమంది గుండెలు బాదుకుంటూ కన్నీళ్ళు పెట్టుకుంటున్న దృశ్యాలను అంతర్జాతీయ మీడియా ప్రసారం చేసింది. టెహ్రాన్ వీధుల్లో అనేకచోట్ల బహిరంగ సంతాపసభలు నిర్వహించారు. వేలాదిమంది మహిళలు వీధుల్లోకి వచ్చారు. కాగా ఇరాన్‌లోని రజావీ ఖోరాసన్ రాష్ట్రంలోని మష్హాద్‌లో ఉన్న షియా ముస్లింలకు చెందిన ఎనిమిదవ ఇమామ్ అలీ అల్–రిదా సమాధి భవనంపై ఇరాన్ ప్రజలు సంతాపసూచకంగా నల్ల జెండా ఎగురవేశారు.

కాగా ఖమేనీ మరణంపై ఇరాన్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. ఇరాన్‌లోని కొన్ని ప్రాంతాలలో ప్రజలు, మహిళలు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకుంటున్నారు. కిరాన్ వీధుల్లో ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా సహా పలు దేశాలలో ఉన్న యూదులు వీధుల్లోకి వెళ్ళి సంబరాలు చేసుకుంటున్నారు. మరికొందరు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. లాస్ ఏంజెల్స్‌లో ఇజ్రాయెల్ పౌరులు సంబరాలు చేసుకున్నారు.

**ఇదీ ఖమేనీ జీవన ప్రస్థానం**

1939 ఏప్రిల్ 19వ తేదీన అలీ ఖమేనీ ఇరాక్‌లోని నజాఫ్‌లో జన్మించారు. ఎనిమిదిమంది సంతానం మధ్య రెండో కుమారుడుగా ఎదిగిన ఖమేనీ సోదరుల్లో ఇద్దరు మతాధికారులు కాగా మరొకరు పత్రికా సంపాదకుడు. ఖమేనీ తండ్రి అజర్‌బైజాన్, తల్లి పర్షియన్. వారు ఖమేనీ ప్రాంతానికి వలసవెళ్ళారు. మత విద్య నేర్చుకున్నాడు. అనేకమంది మార్గదర్శకులవద్ద ఎంతో వజ్ఞానం గడించారు. తర్వాత 1958లో ప్రస్తుత ఇరాన్‌లోని కోమ్‌లో స్థిరపడ్డారు. రహొల్లా ఖమేనీ ఆయన గురువు. ఎదిగాక మత పాండిత్యంలోకంటే రాజకీయాలలో ఆయన ఎక్కువ ఆసక్తి చూపించారు. నాటి ఇరాన్ రాజు రెజా పహ్లవీ పాలనకు వ్యతిరేకంగా నిసన ప్రదర్శనల్లో పాల్గొనేవాడు. అనేక సార్లు అరెస్టయి శిక్ష అనుభవించాడు. ఇరాన్ విప్లవంలో కీలకపాత్ర పోషించాడు. 1979లో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆవిర్భవించినప్పటినుండీ అనేక పదవులు నిర్వహిస్తూ ఒక్కొక్కమెట్టూ ఎదిగాడు. ఇరాన్ మాజీ అధ్యక్షుడు రఫ్సంజానీ అలీ ఖమేనీ ఆయన ఎదుగుదలకు కారకుడు. హసన్ రహౌనీ ప్రధానమంత్రిగా ఉండగా అలీ ఖమేనీ రక్షణశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. 1981లోమసీదులో ప్రసంగిస్తుండగా బాంబు పేలుడులో హత్యాయత్నం నుండి బయటపడి చాలాకాలానికి కోలుకున్నారు. 1981లో ఇరాన్ అధ్యక్షుడు మహ్మద్ రజాయ్ మరణించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఖమేనీ అధ్యక్షుడిగా విజయం సాధించారు. అలా ఒక మతాధికారి, రాజకీయ నేత ఇరాన్ దేశాధినేత అయ్యారు. 1985లో రెండోసారి గెలిచాడు. తర్వాత నుండి అమెరికా వ్యతిరేకత ప్రారంభమైంది. ఆయన పాలనలో ప్రజలు అణచివేతకు గురయ్యారు. తర్వాత ప్రజలు తిరుగుబాటును ఆయన హింసాత్మకంగా అణచివేశాడు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌ను శక్తిమంతంగా తీర్చిదిద్దారు. 1989లో ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయొతుల్లా ఖమేనీ తన వారసుడుగా అలీ ఖమేనీని ప్రకటించారు. అప్పటి నుండీ సర్వాధినేతగా కొనసాగుతూ వచ్చారు. దేశాన్ని ఛాందస మత వ్యవస్థగా మార్చుచేశారు.

# పశ్చిమాసియాలో 30 స్థావరాలపై భీకర దాడులు



టెల్అవీవ్‌లో ఇజ్రాయెల్ సైనికస్థావరంపై దాడి

ముగ్గురు అమెరికన్ సైనికులు మృతి

దాడుల్లో మొత్తం 15 మంది మృతి

దెబ్బతిన్న దుబాయ్, అబుదాభి విమానాశ్రయాలు

స్తంభించిన వేలాది విమాన రాకపోకలు

**టెహ్రాన్:** ఖమేనీ మరణానంతరం అమెరికా–ఇజ్రాయెల్‌లపై ఇరాన్‌కు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. యుద్ధం రెండోరోజు ఆదివారం ఉదయం నుండీ పశ్చిమాసియాలో ఆరు అరబ్ దేశాలలో ఉన్న 30 అమెరికా స్థావరాలు, కీలక లక్ష్యాలపై గురిపెట్టి క్షిపణి దాడులు చేసింది. అనేకచోట్ల పేలుళ్ళు సంభవించాయి. అమెరికన్ ఎయిర్‌క్రాఫ్ట్‌పై చేసిన దాడుల్లో ముగ్గురు అమెరికన్ సైనికులు మరణించారు, మరో ఐదుగురు గాయపడ్డారు. అయితే అబ్రహాం లింకన్ నౌకకు ఎలాంటి నష్టం జరగలేదని పెంటగాన్ చెప్పింది. దోహాలో ఏకంగా 11 చోట్ల పేలుళ్ళు జరిగాయని ఖతార్ ప్రభుత్వం ధృవీకరించింది. ముఖ్యంగా ఇజ్రాయెల్ రాజధాని నగరం టెల్అవీవ్‌లో ఉన్న ప్రధాన సైనిక స్థావరంపై క్షిపణి దాడులు చేసింది. జెరూసలెం జిల్లా బెయిట్ షెమెష్‌లో జరిగిన క్షిపణి దాడిలో పది మంది మరణించారు. టెల్అవివ్‌పై చేసిన దాడుల్లో ఒక మహిళ మరణించింది. టెల్అవివ్ నగరంలో ఇరాన్ దాడి, భీతావహ దృశ్యాలను ఇజ్రాయెల్ మీడియా ప్రసారం చేసింది. టెల్అవివ్‌లో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో 25మంది స్వల్పగాయాలతో తప్పించుకున్నారు. హోర్ముజ్ జలసంధి వద్ద సముద్ర జలాల్లో ఒమన్‌కు చెందిన ఒక చమురు నౌకపై ఇరాన్ క్షిపణి దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు గాయపడ్డారు. దాడి సమయంలో ఓడలో 15 మంది భారతీయ కార్మికులు ఉన్నారు. ఇజ్రాయెల్ రాజధాని టెల్అవివ్‌లో ప్రతిపక్ష నాయకుడు, మాజీ ప్రధానమంత్రి యైర్ లాపిడ్ రాయిటర్స్ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇస్తుండగా దాడులు జరిగాయి. దీంతో ఆయన భయంతో ఇంటర్వ్యూ ఆపేసి బయటకు పరుగు తీశారు. బాంబ్ దాడుల రక్షణ కేంద్రంలోకి వెళ్ళి తలదాచుకున్నారు. ఇజ్రాయెల్ సహా పశ్చిమాసియాలో ఆరువిడత క్షిపణి దాడులు కొనసాగిస్తున్నట్లు ఇస్లామిక్ రిపబ్లికన్ గార్డ్స్ (ఐఆర్‌జిసి) ప్రకటించింది.

బహ్రైన్ సహా దుబాయ్, కువైత్, అబుదాభి సహా పలు విమానాశ్రయాలపై దాడులు చేసింది. విమానాశ్రయాల రన్‌వేలు దెబ్బతిన్నాయి. అబుదాభిలో ఒకరు మరణించగా ఏడుగురు గాయపడ్డారు. మొత్తంగా ఈ దాడుల్లో 11 మంది గాయపడ్డారు. ఆసియా దేశానికి చెందిన ఒక కార్మికుడు మరణించినట్లు యుఎఇ రక్షణమంత్రి చెప్పారు. కువైత్‌లో విమానాశ్రయం రన్‌వే తీవ్రంగా దెబ్బతింది. అబుదాభిలోని జాయేద్ ఇంటర్నేషన్ ఏర్‌పోర్ట్‌పై దాడులను అధికారులు ధృవీకరించారు. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే వేలాదిమంది రాకపోకలు సాగించే దుబాయ్ విమానాశ్రయంపై ఇరాన్ చేసిన క్షిపణి దాడుల్లో నలుగురు ఏర్‌పోర్ట్ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వేలాది విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. వేలమంది ప్రయాణికులు ఎటూపాలుపోక విమానాశ్రయాల్లో స్తంభించిపోయారు. వారంతా ఎటూపాలుపోక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పశ్చిమాసియాకు బయట నుండి కూడా అనేక దేశాలు విమానాలు నడపకుండా రాకపోకలు నిలిపివేశాయి. కరోనా మహమ్మారి తర్వాత ఈ స్థాయిలో విమానాలు దుబాయ్‌లో స్తంభించిపోవడం మళ్ళీ ఇదే. ఈ దాడులతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

క్షిపణులను నీటి ప్రవాహాలా ప్రయోగిస్తోంది. ఇరాక్, కువైత్, బహ్రైన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లపై ప్రధానంగా భీకర దాడులు కొనసాగించింది. ఇరాక్‌లోని ఎర్బిల్ విమానాశ్రయంలో అనేక పేలుళ్ళు సంభవించాయి. ఇరాక్‌లో విమానాశ్రయం సమీపంలో ఉన్న అమెరికా సైనిక దళాలు తిష్టవేసి ఉన్న భవంతులపై దాడులు చేసింది. పలువిమానాశ్రయాలు, అమెరికా స్థావరాలు లక్ష్యంగా క్షిపణి ప్రయోగాలు చేసింది. దుబాయ్‌లో ప్రసిద్ధి చెందిన బుర్జ్ ఖలీఫా మీదుగా ఇరాన్ క్షిపణులు ప్రయాణిస్తున్న దృశ్యాలను మీడియా ప్రసారం చేసింది. ఇంతకు ఇంత ప్రతీయారం తీర్చుకోకుండా వదిలిపెట్టేదిలేదని ప్రకటించింది. గతంకంటే విభిన్న వ్యూహంతో, కఠిన ప్రతీకార దాడులు చేస్తామని ఐఆర్‌జిసి ప్రకటించింది. తమ ప్రతీకారం మహోద్ధృతంగా ఉంటుందని, గతంలో ఎన్నడూ చూడని విధంగా దాడులు చేస్తామని ప్రకటించిన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పశ్చిమాసియా వ్యాప్తంగా అమెరికా–ఇజ్రాయెల్ మిత్రకూటమి దేశాలపై భారీస్థాయిలో క్షిపణి ప్రయోగాలతో విరుచుకుపడింది. ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్‌ను దాడులకు సమీపించడంతో రాజధాని టెహ్రాన్ సహా పలు ప్రాంతాల్లో సైరన్ల మోత మోగిపోయింది. టెల్అవీవ్‌ను అనేక క్షిపణులు తాకాయి. ఇరాన్ ఆగ్రహాన్ని ముందుగానే గ్రహించిన ఇజ్రాయెల్ ముందస్తు జాగ్రత్తలు పాటిస్తోంది. క్షిపణుల తాకిడి తీవ్ర తగ్గించేందుకు సెంట్రల్ ఇజ్రాయెల్ సహా ఎక్కడికక్కడ అలారమ్‌లు, సైరన్‌లను మోగిస్తోంది. ఇరాన్‌తో ఒకవైపు సంప్రదింపుల కొనసాగింపు మధ్యలో ఉండగానే ఆశ్చర్యకరంగా, అత్యంత రహస్యంగా ముందస్తుప్రణాళిక చేసి ఇరాన్ సర్వాధినేతను, అగ్రనాయకత్వాన్ని నిర్మూలించడంతో ప్రపంచరాజకీయ విశ్లేషకులు, అధ్యయన సంస్థలు తీవ్ర దిగ్భ్రాంత వ్యక్తం చేస్తున్నాయి. రాబోయేకాలంలో అమెరికాకు అభద్రత పొంచి ఉందని హెచ్చరికలు చేస్తున్నాయి.

**దాడులు చేస్తే ఘోరాలు చూస్తారు..**

**ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**

సర్వాధినేతను కోల్పోయి ఆగ్రహం–ఆవేదనతో రగలిపోతున్న ఇరాన్ మంత్రివర్గం ఊహించనిస్థాయిలో ఉద్ధృత దాడులు ,ప్రతీకారం తీర్చుకోకుండా అమెరికాను ఊరికే వదిలిపెట్టబోమని ప్రకటించడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరిగి మరో ప్రకటన చేశారు. ఇరాన్ పాలకులు, ఇరాన్ సైనిక కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేశాం, ఇప్పుడు ఇరాన్ క్షిపణి పరిశ్రమను దెబ్బతీయడంపై దృష్టి కేంద్రీకరించాం, క్షిపణి వ్యవస్థలను దెబ్బతీస్తాం, ఇరాన్ ప్రజలు, ఇరాన్ సైన్యం కూడా మా సహాయంకోసం అర్థిస్తోంది. ఇప్పుడు ఇరాన్‌లో మిగిలిన ఉన్న పాలకులు భయంకరమైన దాడులు చేస్తామని ప్రకటనలు చేస్తున్నారు, వారు అలా దాడులు చేయకపోవడమే మంచిది, వారు అలాంటి దాడులు మానుకోవాలి, ఒకవేళ కాదని దాడులు కొనసాగిస్తే గతంలో ఎన్నడూ చూడనివిధంగా అమెరికా నుండి ఘోరమైన దాడులను చవిచూడాల్సి వస్తుంది, మా దళాలతో అణచివేస్తాం, ఈ విషయం తెలుసుకున్నందుకు కృతజ్ఞతలు, ఇరాన్ రివల్యూషనరీ గార్డులు కూడా ఇరాన్‌లో ఉన్న ప్రజాస్వామ్యవాదులతో చేతులు కలపాలి, అప్పుడు అందరం కలిసి ఇరాన్‌ను ఎంతో గొప్పగా పునర్నిర్మిద్దాం'' అని ట్రంప్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## కరాచీలో అమెరికా కాన్సొలేట్ భవనం ధ్వంసం

ఘర్షణల్లో తొమ్మిది మంది మృతి

12 మందికి గాయాలు

**కరాచీ:** దాడుల్లో అలీ ఖమేనీ, మరో 40 మంది ఇరాన్ మంత్రులు, ఉన్నతస్థాయి కమాండర్లు,సైనిక అధికారుల మరణించడంతో పాకిస్థాన్‌లో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దక్షిణ సింధ్ రాష్ట్రం కరాచీ నగరంలో ఉన్న అమెరికా కాన్సొలేట్ భవనంపై వందలమంది షియా పాకిస్థానీయులు దాడి చేశారు. మారణాయుధాలతో కిటికీలు, ఫర్నేచర్‌ను ధ్వంసం చేశారు. కాన్సొలేట్ భవనాన్ని అగ్నికి ఆహుతి చేసేందుకు ప్రయత్నం చేశారు. నిప్పు పెట్టేందుకు కాగడాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కాన్సొలేట్ భవనం వెలుపల పోలీసులు–ప్రదర్శకుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో తొమ్మిదిమంది మరణించారు. మరో 12 మంది గాయపడ్డారు. ఘర్షణల్లో గాయపడినవారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించినట్లు సింధ్ ప్రభుత్వ ప్రతినిధి హసన్ ఉల్ హసీబ్ చెప్పారు. వీరిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉంది. ఐతే మొదట కాల్పులకు ఎవరు పాల్పడ్డారనే విషయం ఇంకా స్పష్టం కాలేదు. అనేకమందిమారణాయుధాలు తీసుకువచ్చారు. కొందరు కాల్పుల గాయాలతో, మరికొందరు లాఠీ గాయాలతో తీవ్ర పరిస్థితుల్లో చికిత్స పొందుతున్నారు. మై కొలాచీ రోడ్డులో కాన్సొలేట్ భవనం ఆవరణలోకి వెళ్ళేందుకు అనేకమంది ప్రయత్నం చేసినప్పుడు ఘర్షణలు రేగాయి. కరాచీ పాలకులు తక్షణ చర్యలుగా కాన్సొలేట్ భవనంవైపు వెళ్ళే మార్గాలను మూసివేశారు. ప్రదర్శకులను అదుపుచేసేందుకు ప్రయత్నం చేశారు. .

బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ చిత్తశుద్ధి ఉంటే...

# పార్లమెంటులో ప్రవేట్ బిల్లు పెట్టాలి

రాహుల్ పర్యటన నేపథ్యంలో

జాజుల శ్రీనివాస్‌గౌడ్ బహిరంగ లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించేలా కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రానున్న బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. రేపు రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా రాహుల్ గాంధీకి బిసి డిమాండ్లపై శ్రీనివాస్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగనన జరిగి, జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి చట్టబద్ధంగా దక్కాలన్న రాహుల్ గాంధీ నినాదాన్ని, ఆచరణలో చూపించడానికి తెలంగాణ రాష్ట్రాన్ని సామాజిక న్యాయానికి ఒక మోడల్ గా రాహుల్ గాంధీ చేయాలని ఆయన కోరారు. అతి త్వరలో భర్తీ చేయబోయే రెండు రాజ్యసభ స్థానాలలో ఒకటి బిసికి, రెండవది ఎస్‌సిఎస్‌టిలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రానికి సంబంధం లేని వారిని, ఇప్పటికే తమ జనాభా దామాషా కంటే ప్రాతినిధ్యం ఎక్కువగా రాజకీయంగా ఉన్న అగ్రకులాలకు అవకాశం ఇవ్వకుండా బిసిలకే ఇవ్వాలని ఆయన కోరారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పోస్టులలో, ప్రభుత్వ కాంట్రాక్టులలో, రాష్ట్ర బడ్జెట్‌లో, అన్ని స్థాయిలోనూ తెలంగాణలో జరిగిన కులగనన ఆధారంగా బిసిలకు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## 15 నాటికి నివాస స్థలాలు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తయిందని 747 మందిని గుర్తించడం జరిగిందని వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు గతంలో లబ్ధి పొందిన వారు ఉన్నారని ఆయన తెలిపారు. ఖమ్మం పరిసర ప్రాంతాలకు సంబంధించిన వారితో పాటు పరిసర నియోజక వర్గాలకు చెందిన వారు ఉన్నారు. ఈ ప్రభుత్వం ఏ పేద వానికి అన్యాయం చేయదని ఆయన స్పష్టం చేశారు. వెలుగుమట్ల ఘటనలో అధికారులు తప్పు చేస్తే తప్పక శిక్షిస్తామని పేదవారికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం చేయమన్నారు. వెలుగుమట్ల తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వభూముల్లో పేద ప్రజలు నివాసం ఉంటే అర్హులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పేదవాని విషయంలో రాజకీయాలు తగవని ఆయన విపక్షాలకు హితవు పలికారు. కొంత మంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని ముఖ్యంగా మంత్రులు ఈ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు అర్థరహితమని ఆయన తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం మాత్రమే ఆరోపణలు చేస్తున్నారని పేదవారిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కేటాయించిన తర్వాత త్రాగునీరు, విద్యుత్, అంగన్‌వాడీ తదితర మౌలిక వసతులు కల్పించడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తామన్నారు. పేదల వద్ద నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేశారని ఆ డబ్బును రికవరీ చేసి పేదలకే అప్పగిస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉన్నదని ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలకు అన్యాయం జరగనివ్వరాదని ముఖ్యమంత్రి ఆదేశించారని ఆ ఆదేశాలకు అనుగుణంగానే ఈ ప్రభుత్వం నడుచుకుంటుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక తీరుగా లేనప్పుడు మరో తీరుగా వ్యవహరించ లేమన్నారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలు శవాల మీద చిల్లర ఏరుకునే చందంగా వ్యవహరిస్తున్నాయని కొన్ని పత్రికలు ఇష్టానుసారంగా రాశాయని ఆయన తెలిపారు. తప్పు జరిగితే శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, అడిషనల్ కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ (మొదటి పేజీ తరువాయి)

పల్లా దేవేందర్ రెడ్డి, వై ఓమయ్య, ఏ.పార్వతి, పి.సురేష్, గన్నారపు రమేష్ కోశాధికారిగా జయలక్ష్మి లతోపాటు 27 మందిని కార్యవర్గ సభ్యులుగా, 61 మందిని కౌన్సిల్ సభ్యులుగా 8 మందిని ఆహ్వానితులుగా ఈ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మహా సభలు విజయవంతమయ్యాయని, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎం నరసింహలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలో 470 మంది ప్రతినిధులు పాల్గొని అనేక సమస్యల పైన దాదాపు 40 మంది చర్చలలో పాల్గొని వివిధ సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని ఇందుకుభవిష్యత్ పోరాటాలు నిర్వహించాలని మహాసభ తీర్మానాలను ఆమోదించినట్లు వారు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు కనీస హక్కులన్ని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి) రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టు కార్మికులు ఎలాంటి కనీస వేతనాలు అమలు గాని,, కార్మిక చట్టాలు అమలకు నోచుకోకుండా, నిత్యం శ్రమదోపిడికి గురి అవుతున్నారన్నారు. రాబోవు కాలంలో రూ. 26,000 వేల కనీస వేతనం, కార్మిక చట్టాల అమలు, పండగ, జాతీయ, ఆర్జిత సెలవులు అమలుకు, కనీస బోనస్ , రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనం ఔట్ సోర్సింగ్ కార్మికులకు అమలు అయ్యే విధంగా పోరాటాలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

## తాత్కాలిక నాయకత్వం

(మొదటి పేజీ తరువాయి)

బలిదానమయ్యారు అని ప్రకటించారు. దేశంలో కీలకమైన నాయకత్వం ఆకస్మికంగా అంతర్థానం కావడంతో ఈ పరివర్తన దశలో ముగ్గురు సభ్యులతో తాత్కాలిక నాయకత్వాన్ని ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. దేశాధ్యక్షుడు పెజెష్కియన్, మతాధిపతి, శక్తిమంతమైన రాజ్యాంగ సంరక్షణ మండలి సభ్యుడు అలి రెజా అరాఫి (67), న్యాయవ్యవస్థ ప్రధానాధిపతి ఘొలం హొస్సేన్ మెహసెనీ ఎజీలు తాత్కాలికంగా పరిపాలన చేస్తారు. గార్డియన్ కౌన్సిల్‌లో ఉన్న 88 మంది సభ్యుల్లో నిపుణుడు అలి రెజా ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు రుహొల్లా ఖమేనీ కుమారుడు. రుహొల్లా ఖమేనీ, నిన్న హత్యకు గురైనఅలీ ఖమేనీ ఇద్దరు స్నేహితులు. ఈ ముగ్గురు సభ్యుల బృందం దేశ తాత్కాలిక నాయకత్వ బాధ్యతలను తీసుకుంది. ఖమేనీ సజీవంగా ఉన్న సమయంలోనే ఆయన కుమారుణ్ణి తదుపరి వారసుడుగా ప్రకటించాలని పాక్షిక నిర్ణయం జరిగింది. ఖమేనీ లేనిపక్షంలో అతడికే బాధ్యతలు ఇవ్వాలని నిర్ణయం జరిగింది. కానీ కొత్త నాయకుణ్ణి ఎన్నుకునేవరకూ, 40 రోజులు సంతాప దినాలు, తదుపరి పరిణామాలు సర్దుబాటయ్యేవరకూ కొత్త నాయకత్వాన్ని ఎన్నుకునే విషయం అపరిష్కృతంగా ఉంటుంది.

## దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)



ఇరాన్ రక్షణమంత్రి అజిజ్ నాసిర్జాదే (62), ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మహ్మద్ పక్పూర్ (65), ఖమేనీ సలహాదారు అలీ షంఖానీ, చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ అబ్దొల్ రహీం మౌసావీ మరణించారు. దక్షిణ ఇరాన్‌లోని పాఠశాలపై జరిగిన క్షిపణి దాడిలో 85 మంది బాలికలు మరణించారు. మరో 60మంది గాయపడ్డారు. అనేక ప్రాంతాలలో దేశంని ఇరవై రాష్ట్రాలలో జరిగిన గగనతల క్షిపణి దాడుల్లో మొత్తం 200మందికిపైగా ప్రజలు మరణించారు. ఖమేనీ తన నివాసంలో మంత్రివర్గ సభ్యులు, సైనికాధికారులు, ఇతర ప్రముఖులతో తెల్లవారుజామున కీలక సమావేశం నిర్వహిస్తున్నారని గూఢచారి వర్గాల ద్వారా సమాచారం అందడంతో అదనుచూసి ఇజ్రాయెల్–అమెరికా శక్తిమంతమైన యుద్ధ విమానాలు గురితప్పకుండా క్షిపణి దాడులు చేసి ఖమేనీ నివాసాన్ని నామరూపాలు లేకుండానే లమట్టం చేశాయి. ఈ దాడుల తర్వాత ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ఒక ప్రకటన చేస్తూ ఖమేనీ మరణించారని చెప్పడానికి అనేక సంకేతాలు కనిపిస్తున్నాయని అన్నారు. దీంతో ఇరాన్ మీడియా శనివారం సాయంత్రం నుండే ప్రకటనలు ఇవ్వడం ప్రారంభించింది. ఇరాన్‌లో కూడా వదంతులు వ్యాపించడం ప్రారంభమైంది. ఐతే ఇవన్నీ ఇజ్రాయెల్ మీడియా చేస్తున్న వందంతులని, నాకు తెలిసినంత వరకూ మా నాయకుడు ఇంకా సజీవంగానే ఉన్నారని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఎన్‌బిసికి ఇచ్చిన లైవ్ ఇంటర్వ్యూలో ప్రకటించారు.

**లక్ష్యం పూర్తయ్యేవరకూ దాడులు: ట్రంప్**

అలీ ఖమేనీ మరణించారని ట్రంప్ ప్రకటించారు. ఖచ్చితమైన భారీ దాడులు, లక్ష్యసాధనకు అవసరమైన దాడులు వారం అంతటా జరుగుతాయి, లేదా లక్ష్యం పూర్తయ్యేవరకూ నిరంతరాయంగా కొనసాగుతాయని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ప్రకటన చేశారు. ఆయన మరణంతో పశ్చిమాసియాలో జరుగుతున్న ఘర్షణల విస్తృతిలో ఒక అతిపెద్ద మేలి మలుపు సంభవించిందని, ఘర్షణలు తగ్గిపోతాయని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 'ప్రపంచ చరిత్రలోనే అత్యంత దుర్మార్గులలో ఒకడైన ఖమేనీ మరణించాడు' అని పేర్కొన్నారు. ఆయన నిర్మూలనతో ఇరాన్ రాజ్య చరిత్రలో బాధితులకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. అమెరికా–ఇజ్రాయెల్ చేసిన ఉమ్మడి దాడుల్లో శనివారం తెల్లవారుజామున ఖమేనీ మరణించారని, ఈ మరణంతో ఇరాన్ ప్రజలు తిరిగి తమ దేశాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఇదే ఏకైక అతి పెద్ద అవకాశమన్నారు. ఆయన మరణంతో కేవలం ఇరాన్ ప్రజలకు మాత్రమే కాకుండా, యావత్ అమెరికన్ ప్రజలకు కూడా న్యాయం జరిగిందన్నారు. 'ఆయన మన అధునాతన ట్రాకింగ్ వ్యవస్థల నుండి తప్పించుకోలేకపోయాడు, ఆయనతోపాటు ఆయన దగ్గర పనిచేస్తున్నవారు కూడా అక్కడ ఉండీ చేయగలిగింది ఏమీలేదు' అని ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ రాశారు. అదేవిధంగా అమెరికా మితిమీరిన విజయాలు సాధిస్తోందని కూడా ట్రప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇన్ని మితిమీరిన గొప్ప విజయాలు కూడా న్యాయ సమ్మతం కాదని పేర్కొన్నారు.

**ట్రంప్‌ను రెచ్చగొట్టిన ఇజ్రాయెల్, సౌదీ**

కాగా వాషింగ్టన్ పోస్ట్ పత్రిక అనేక వార్తలు ప్రచురిస్తూ, ఇరాన్ వల్ల ఇక తక్షణ ప్రమాదం లేదని పేర్కొంది. ఖమేనీ మరణం వెనుక ట్రంప్ తప్పిదం ఏమీలేదని చెప్పేందుకు వాషింగ్టన్ పోస్టు పత్రిక ప్రయత్నం చేసింది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ, సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ ట్రంప్‌ను పదే పదే రెచ్చగొట్టారని, ఈ కారణంగానే ట్రంప్ ఇజ్రాయెల్‌పై దాడులు చేసి ఖమేనీని హతమార్చేందుకు ప్రణాళిక చేశారని రాసుకొచ్చింది. గడచిన ఆరునెలలుగా ఈ ప్రక్రియ వేగవంతమైందని, ట్రంప్‌పై ఒత్తిడి పెరిగిందని రాసింది. గతనెలలో యువరాజు బిన్ సల్మాన్ అనేకసార్లు ట్రంప్‌కు ఫోన్‌చేసి మాట్లాడారని తెలిపింది.

## తక్షణం యుద్ధం ఆపండి: చైనా విజ్ఞప్తి

**బీజింగ్:** పశ్చిమ ఆసియాలో తక్షణం యుద్ధం ఆపాలని అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలకు విజ్ఞప్తి చేసింది. వెంటనే శత్రుత్వాలకు స్వస్తిచెప్పి దౌత్యమార్గాల్లో సమస్యల పరిష్కారానికి సిద్ధం కావాలని కోరింది. పశ్చిమాసియాపై చైనా వైఖరిని చైనా విదేశీ వ్యవహారాలమంత్రి వాంగ్ యీ స్పష్టం చేశారు. తక్షణం సైనిక కార్యకలాపాలను నిలిపివేయాలి, వెంటనే చర్చలకు తిరిగి రావాలి, ఏకపక్ష చర్యలను ఉమ్మడిగా అందరూ వ్యతిరేకించాలి అనే మూడు అంశాలను యుద్ధ పరిష్కారానికి వాంగ్ యీ మార్గాలుగా సూచించారు. చైనా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో సభ్యుడు కూడా అయిన వాంగ్ యీ రష్యా విదేశీమంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో ఆదివారం ఫోన్ సంభాషణ సందర్భంగా ఈ విషయాలను ప్రస్తావించారు.

## మానవ నైతికత ఉల్లంఘన

రష్యా అధ్యక్షుడు పుతిన్ విమర్శ

**మాస్కో:** ఇరాన్ సర్వాధినేత అయొతొల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులను హత్య చేయడం పూర్తిగా అంతర్జాతీయ చట్టాలను, అంతర్జాతీయ నిబంధనలను ఉ ల్లంఘించడమేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ విమర్శించారు. పశ్చిమాసియాలో జరుగుతున్న వరుస పరిణామాలపై ఆదివారం ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ హ త్యలన్నీ మానవ నైతికత ఉల్లంఘనే అన్నారు. ఈ హత్యలను నిరసిస్తూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌కు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ మేరకు ఆయనకు ఒక సందేశం పంపించారు. ఇరాన్ ప్రజలకు హృదయ పూర్వక సానుభూతి తెలియజేస్తున్నానని, వారికి తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాననీ పేర్కొన్నారు.

## క్రూరత్వానికి నిజ స్వరూపం

అమెరికాఇజ్రాయిల్ మైత్రిపై సిపిఐ

ఖామేనీ హత్యకు ఖండన

**న్యూఢిల్లీ:** ఇరాన్ అధినేత ఖామేనీని ప్రత్యక్ష సైనిక చర్య ద్వారా హత్య చేయడం చాలా తీవ్రమైనప్రమాదకరమైన పరిణామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. మహిళల హక్కులు, ప్రజాస్వామ్యం, పౌర స్వేచ్ఛల విషయంలో వామపక్షాలు తరచూ ఖామేనీ పరిపాలనను విమర్శించేవి కానీ, రాజకీయపరమైన అభిప్రాయ బేధాలు ఎప్పుడు కూడా ఓ సార్వభౌమ దేశాధినేత లక్షిత హత్యను సమర్థించలేవని డి.రాజా స్పష్టంచేశారు. ఇలాంటి చర్యలను ఆమోదిస్తే అంతర్జాతీయ చట్టానికి, సార్వభౌమత్వం షరతులకు అర్థం ఉండదన్నారు. ఏడు దశాబ్దాలుగా ప్రపంచంలో యుద్ధాలు ఘర్షణలకు మూల కారణం అమెరికానే అని డి.రాజా విమర్శించారు. వియత్నాం, గౌటెమాలా, చిలీ, నికారుగ్వా, పనామా, అఫ్ఘానిస్థాన్, లిబియా, ఇరాక్, సిరియా పరిస్థితులను గుర్తుచేశారు. జోక్యం చేసుకోవడం, అధికారాన్ని మార్చడం, గందరగోళం/గొడవలు సృష్టించడం అనే విధానంతో ఆ దేశం ముందుకెళుతుందన్నారు. మినాబ్‌లోని బాలికల ప్రాథమిక పాఠశాలపై బాంబు దాడి చేసి 150 మంది పసిపిల్లల ప్రాణాలు తీయడాన్ని బట్టి అమెరికా జోక్యం చేసుకుంటే ఏమవుతందో స్పష్టమైందని డి.రాజా వ్యాఖ్యానించారు. తాజా పరిణామాలపై ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇరాన్ మన దేశానికి మిత్రదేశమని, రెండు దేశాలు అనేక ఒడిదుడుకులను నిలద్రొక్కుకున్నాయని డి.రాజా గుర్తుచేశారు. కశ్మీర్ విషయంలో ఇరాన్ భారత్‌కు మద్దతిచ్చిందని, ఓఐసీ సమత్యులతను కాపాడిందని తెలిపారు. చాబహర్ పోర్టులో భారత్ వ్యూహాత్మక పెట్టుబడి... పాకిస్థాన్ మీదుగా సెంట్రల్ ఆసియా, అఫ్గాన్ ప్రవేశానికి కీలకమని, ఇరాన్‌లో అస్థిర పరిస్థితులతో దీనికిప్పుడు విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. అమెరికాఇజ్రాయిల్ ఎదుట ఇలా లొంగిపోయే ధోరణి కొనసాగితే... గ్లోబల్ సౌత్‌లో భారత్ కష్టపడి సాధించుకున్న పేరు మంట గలుస్తుందని డి.రాజా ఆందోళన వ్యక్తంచేశారు. ఒకప్పుడు నాన్‌అలైన్మెంట్‌ను ఏలిన దేశం... ఇప్పుడు సార్వభౌమత్వాన్ని బలవంతంగా అణచివేస్తుంటే మౌనంగా ఉండటం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని డి.రాజా స్పష్టంచేశారు.

## నేడు రాష్ట్రానికి రాహుల్‌గాంధీ

(డిసిసి) అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొననున్న రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరుగుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎఐసిసి అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరు కానున్నారు. సోమవారం ఉదయం జరిగే ఈ కార్యక్రమంలో రాహుల్‌గాంధీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఉదయం 9.30 గంటలకు రాహుల్ గాంధీకి సిఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలకనున్నారు. అనంతరం రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి శంషాబాద్ నుంచి నేరుగా వికారాబాద్‌కు వెళతారు. తెలంగాణ, ఎపి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై తిరిగి సిఎం సాయంత్రం హైదరాబాద్ చేరుకుంటారు.

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు గర్హణీయం

ఇస్కఫ్ అధ్యక్షుడు, సిపిఐ మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల సంయుక్త దాడులు గర్హణీయమని ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్, ఫ్రెండ్‌షిప్ (ఇస్కఫ్) అధ్యక్షుడు, సిపిఐ మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా పేర్కొన్నారు. ఈ దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. భారత ప్రభుత్వం అమెరికా – ఇజ్రాయెల్ చర్యలను ఖండించాలని, ఇంకా ఇరాన్‌లో ఉన్న భారతీయుల భద్రతకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దాడికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన సమావేశాలు నిర్వహించనున్నట్లు అజీజ్ పాషా ప్రకటించారు. జెనీవా చర్చలు విఫలమయ్యాయనే పేరుతో ఇరాన్‌పై జరిగిన ఈ దాడికి పాల్పడడంతో అమాయక ప్రజలు, బాలికలు, విద్యార్థులు సహా సుమారు 700 మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్ సానుకూలంగా వ్యవహరించినప్పటికీ, 150 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడం యుద్ధోన్మాదానికి నిదర్శనమని అజీజ్‌పాషా విమర్శించారు. గత ఏడాది ఇరాన్ యురేనియం శుద్ధి కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసినట్లు ప్రకటించినా అమెరికా ఇప్పుడు మళ్లీ అదే అంశాన్ని ప్రస్తావించడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ఇతర దేశాల నాయకులు తమ మాట వినకపోతే సహించలేని ధోరణితో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యప్రాచ్యంలో అమెరికా దాదాపు 40వేల వరకు సైనికులను వివిధ స్థావరాల్లో మోహరించడం ప్రపంచ శాంతికి ముప్పుగా పరిగణించిందన్నారు. ప్రపంచ చమురు సరఫరాలో మూడో వంతు, భారత్‌కు వచ్చే చమురు సరఫరాలో కీలకమైన హార్ముజ్ జల సంధి ప్రాంతం యుద్ధ పరిస్థితుల వల్ల ప్రమాదంలో పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

## అమెరికా,ఇజ్రాయెల్ దాడిని ఖండించిన సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై నిర్వహించిన దాడిని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. పశ్చిమ ఆసియాలో ఆధిపత్యం కోసం ఈ దాడులు జరుగుతున్నాయని, ఇది అంతర్జాతీయ శాంతికి ముప్పుగా మారిందని ఆ పార్టీ పేర్కొంది. ఇరాన్‌పై జరిగిన దాడుల్లో పలువురు నిరపరాధ పౌరులు, విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేసింది. యుద్ధాన్ని తక్షణమే నిలిపివేసి, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. భారత ప్రభుత్వం అమెరికా–ఇజ్రాయెల్‌తో ఉన్న రాజకీయ, వాణిజ్య సంబంధాలను పునర్ సమీక్షించాలని, శాంతి పరిరక్షణ వైఖరిని అవలంబించాలని ఇందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే ప్రపంచ దేశాలు జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపాలని, శాంతి చర్చలకు మార్గం సుగమం చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

## ఈనెల 3వ తేదీ నుంచి పలు జిల్లాల్లో పెరగనున్న ఎండల తీవ్రత

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఎండల తీవ్రత అంతకు అంతా పెరుగుతోంది. చలికాలం ఇలా ముగిసిందో లేదో అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతుండగా మార్చి నెల ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉష్ణోగ్రతలు పెరుగనున్నాయని వాతావరణ శాఖ వెల్లడించారు. ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగనున్నాయని ప్రధానంగా పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉండనున్నాయని హెచ్చరించారు. ప్రధానంగా ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జనగామ, ఖమ్మం, కొమురం భీమ్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం 36 నుంచి 37 డిగ్రీలుగా నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు 3 తేదీ తర్వాత 40 డిగ్రీలకు పెరుగనున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అదేవిధంగా హైదరాబాద్ నగరంలో సైతం ఉష్ణోగ్రతలు 36 నుంచి నుంచి 38 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది.

## బిఆర్‌ఎస్ హయంలోనే భారీగా భూ కబ్జాలు : మెట్టు సాయికుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, మాజీ మంత్రి కె.టి. రామారావుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారం కోల్పోయిన తర్వాత కెటిఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని, గత పదేళ్లలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ స్థాయిలో భూకబ్జాలు జరిగాయని ఆరోపించారు. దేవాలయ భూములు, వైకుంఠ దానాలు అనే తేడా లేకుండా ఆక్రమణలు జరిగాయని, ప్రజలు ఇప్పుడు ఆ విషయాలన్నింటినీ గుర్తుపెట్టుకున్నారని ఆయన అన్నారు. ఎంత ప్రయత్నించినా గతంలో జరిగిన అన్యాయాలను ప్రజలు మరిచిపోరని వ్యాఖ్యానించారు.కెటిఆర్‌తో పాటు మాజీ మంత్రి టి. హరీష్ రావు పై కూడా ఆయన విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అలాంటి నీచ రాజకీయాలు చేయదని, ఇద్దరూ కలిసినా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్థాయికి సరిపోరని అన్నారు. గత 10 ఏళ్లలో ప్రభుత్వం భూములు వందల ఎకరాల మేర ఆక్రమించబడ్డాయని, ఆ కాలంలో జరిగిన తప్పులపై విచారణ జరిగితే నిజాలు బయట పడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలను మోసం చేసే రాజకీయాల కంటే ప్రజా సమస్యలపై పనిచేయాలని సూచించారు. మాజీ పాలకుల పాపాలు వెలుగులోకి వస్తే అవి చాలా పెద్దవిగా కనిపిస్తాయని, ప్రజలు ఇప్పుడు నమ్మే పరిస్థితి లేదని మెట్టు సాయి కుమార్ తెలిపారు.

### సమాచార లోపంతోనే...

## శారదా పీఠం భూములపై గందరగోళం

మఠాన్ని అడ్డు పెట్టుకొని మాపై ప్రతిపక్షాల దుష్ప్రచారం
పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా ప్రభుత్వం
మంత్రి శ్రీధర్‌బాబు






ప్రజాపక్షం/హైదరాబాద్ : కోకాపేట్‌లోని శ్రీ శారదా పీఠం భూముల వ్యవహారంలో సమాచార లోపం వల్లే గందరగోళం తలెత్తిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఆ భూములు పీఠానికే చెందుతాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున అన్నిరకాలుగా అండగా ఉంటామన్నారు. ఆదివారం కోకాపేట్‌లోని శ్రీ శారదా పీఠాన్ని సందర్శించి... అక్కడి రాజశ్యామల అమ్మవారి ఆలయం, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామీజీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తోందని అన్నారు. మా ప్రభుత్వానికి భేషజాలు లేవని, తప్పులు దొర్లితే ఎప్పటికప్పుడు సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అసలు విషయం తెలిసిన వెంటనే శారదా పీఠం భూముల విషయంలో జరిగిన పొరపాటును వెంటనే సరిదిద్దుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మఠాన్ని అడ్డుపెట్టుకొని కొందరు బిజెపి, బిఆర్‌ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

తమ రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మాది బుల్డోజర్ సంస్కృతి కాదని, కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడటం చూసి ఓర్వలేకే కొందరు మాపై కావాలనే బురద చల్లుతున్నారని విమర్శించారు. బాపు ఘాట్ అభివృద్ధి విషయంలో ప్రజాభీష్టం మేరకే ముందుకెళ్తామని, తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని స్థానికులకు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు.

**రక్తదానం ప్రాణదానంతో సమానం**

ఆపదలో ఉన్నవారికి చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నేటితరం యువత సామాజిక స్పృహతో రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి (మార్చి 2న)ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ .... రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర ఆపరేషన్ల సమయంలో రక్తం సకాలంలో అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా తలసేమియా వంటి వ్యాధులతో బాధపడే చిన్న పిల్లలకు ప్రతి నెలా రక్తం ఎక్కించడం వారి జీవనాధారంగా మారిందన్నారు.

ఇలాంటి తరుణంలో మనమిచ్చే ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను నిలబెడుతుందన్నారు. రక్తం ఇచ్చేటప్పుడు ఎవరూ కులం, మతం, ప్రాంతం చూడరని.. ఇది మనుషులందరినీ కలిపే గొప్ప మానవత్వమన్నారు. అపోహలు వీడి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.

## ఆర్‌టిసిపై తప్పుడు ప్రచారాలు ఆపాలి

లేకపోతే చట్టపరమైన చర్యలు
మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్: రోడ్డు రవాణా శాఖ,ఆర్‌టిసిపై తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఆర్‌టిసి నియామకాలకు, ఆర్‌టిసికి నేరుగా సంబంధం లేదని, నియామక ప్రక్రియ పోలీసు రిక్రూట్మెంట్ సెల్ పరిధిలో జరుగుతుందని స్పష్టం చేశారు. డ్రైవర్ పోస్టుకు 6 అడుగుల ఎత్తు తప్పనిసరి అన్న ప్రచారం పూర్తిగా అసత్యమని, కనీస ఎత్తు 5.3 అడుగులు (160 సెం.మి.) మాత్రమేనని తెలిపారు. టికెట్ యాప్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు లేవని, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**గల్ఫ్ ఉద్రిక్తతల నేపథ్యంలో తెలంగాణవాసుల భద్రతపై ఆందోళన**

ఇరాన్‌పై ఇజ్రాయిల్ మరియు అమెరికా దాడుల ప్రభావంతో గల్ఫ్ ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న భారతీయులు, ముఖ్యంగా తెలంగాణ ప్రజల భద్రతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని మంత్రి పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో పెద్ద సంఖ్యలో తెలంగాణవాసులు ఉన్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో వారు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్కడ ఉన్న తెలంగాణ ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తెలంగాణ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వెంటనే రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మిసైల్ దాడుల భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందకుండా జాగ్రత్తగా ఉండాలని మంత్రి తెలిపారు. అవసరమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రమాద ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ వాసులను స్వదేశానికి రప్పించే చర్యలు కూడా చేపడతామని వెల్లడించారు.

## నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం : ఎఐవైఎఫ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఆదివారం ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హిమాయత్ నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్ లో రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ మన దేశంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరుగుతుండగా, ఆశించిన స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగల భర్తీ లేకపోగా, ప్రైవేట్ రంగంలోను లేఆఫ్ పేరుతో ఉద్యోగులను తొలగిస్తుండడం యువతను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ చేపడుతున్న నియామకలే అతి తక్కువగా ఉండడం, నియామకాల్లో తారతమ్యాలు, కోర్టుల స్టేలు, రాజకీయ ప్రతిస్పందనలు మరింత కల్లోలం సృష్టిస్తున్నాయన్నారు. రాబోయే 1020ఏళ్లలో మనం తీవ్ర సంక్షోభాన్ని, సామాజిక అసమతుల్యతను ఎదుర్కొవల్సిన పరిస్థితి రానుందన్నారు. సమస్యను నివారించడానికి ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియామక ప్రక్రియలు వేగవంతం చేయాలని, నిరుద్యోగ యువతకు నిరంతరం ధైర్యం ఇచ్చేవిధంగా ముందుకు రావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రైవేట్ రంగానికి నిబంధనలు విధించాలని, ఉద్యోగుల తొలగింపుల విషయంలో కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమి




షన్ (టిజిపిఎస్‌సి) ఇప్పటికీ సంపూర్ణ జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం తీవ్ర అన్యాయం అని, ప్రభుత్వ శాఖల్లో లక్షల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, వాటి భర్తీకి సంబంధించి స్పష్టమైన కాలపట్టిక ఇవ్వకపోవడం వల్ల యువతలో అయోమయం, ఆందోళన పెరుగుతోందన్నారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం అని, ఈనెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు చేయాలని ఎఐవైఎఫ్ డిమాండ్ చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మొగిలి లక్ష్మణ్,కొంకుల రాజేష్, ఎత్తం మహేష్, కళ్యాణ్, ప్రవీణ్, నర్సింహా, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో భూదాన భూముల్లోనే పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జాన్ వెస్లీ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఖమ్మం పట్టణంలో పేదల ఇళ్ల కూల్చివేత పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకొని, అదే భూదాన భూముల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విజ్ఞప్తి చేశారు. అప్పటీ వరకు బాధితులకు సరైన భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డికి జాన్ వెస్లీ లేఖ రాశారు. ఖమ్మం కార్పొరేషన్, వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో గత 12 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న సుమారు 700 మంది పేదల ఇళ్లను పోలీసు, రెవెన్యూ సిబ్బంది కలిసి కూల్చివేయడం అన్యాయం అన్నారు. అవి భూదాన యజ్ఞ బోర్డుకు చెందిన భూములు. 2014లోనే ఈ బోర్డు చైర్మన్ రాజేందర్‌రెడ్డి అక్కడి పేదలకు ఇంటి స్థలం కోసం 100 గజాల చొప్పున మంజూరు చేసినట్లు తెలిసిందన్నారు. అవి విలువైన భూములనే పేరుతో పేదలను అక్కడి నుండి తొలగించటం సరైంది కాదని పేర్కొన్నారు.. ఆ ప్రాంత మంతా యుద్ధంలోనో, భారీ భూ కంపంలోనో నాశనమైనట్లు బీభత్సంగా ఉందని, ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉండి బుల్డోజర్ సంస్కతిని వ్యతిరేకిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధంగా పేదల పట్ల అమానుషంగా వ్యవహరించటం దారుణమైన విషయమన్నారు. అలాగే వారికి తాత్కాలిక ఆశ్రయం కల్పించిన అంబేద్కర్ భవన్, టిటిడిసిలలో కూడా, సరైన వసతి, భోజన ఏర్పాట్లు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేదని దీంతో వారు అనారోగ్యం భారిన పడుతున్నారని చెప్పారు. అందువల్ల వెంటనే సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని, ప్రస్తుతం సరైన భోజనం, వసతి సౌకర్యాలు కల్పించి, వారికి అదే భూదాన భూముల్లో పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని జాన్ వెస్లీ కోరారు.

## నార్ముల్ డెయిరీకి ఎన్‌డిడిబి భరోసా

రూ.47 కోట్ల నష్టాల నుంచి విముక్తి దిశగా అడుగులు!
గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ప్రధాన కార్యాలయంలో మంత్రి వాకిటి, ఎంపి చామల, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కీలక భేటీ
డెయిరీ పునరుద్ధరణకు ఎన్‌డిడిబి సానుకూలత.. సంయుక్త నిర్వహణకు గ్రీన్ సిగ్నల్



ప్రజాపక్షం/యాదాద్రి : తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న నార్ముల్ డెయిరీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా గుజరాత్‌లోని ఆనంద్‌లో ఉన్న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం కీలక సమీక్షా సమావేశం జరిగింది. భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవతో నిర్వహించిన ఈ సమావేశం నార్ముల్ డెయిరీ భవిష్యత్తును మార్చే దిశగా అడుగులు వేసింది. సుమారు రూ.47 కోట్ల భారీ నష్టాల్లో కురుకుపోయిన డెయిరీని గట్టెక్కించేందుకు మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపి చామల, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పట్టుబట్టడంతో, ఎన్డీడిబి చైర్మన్ డా.మీనేష్ సి.షా సానుకూలంగా స్పందించారు. నార్ముల్ డెయిరీ కార్యకలాపాలను చేయడానికి లేదా సంయుక్తంగా నిర్వహించడానికి ఎన్డీడిబి అంగీకరించింది.

**బకాయిలు చెల్లించడానికి చైర్మన్ హామీ**

ఈ సందర్భంగా డెయిరీ యూనియన్ ఎదుర్కొంటున్న ఆర్థిక, పరిపాలనా సమస్యలను ప్రజాప్రతినిధులు ఎన్‌డిడిబి బృందానికి వివరించారు. ముఖ్యంగా బ్యాంకులకు ఉన్న బకాయిలు, పాడి రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ నిధులను వెంటనే క్లియర్ చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్‌డిడిబి తన వ్యూహాత్మక, సాంకేతిక సహకారాన్ని అందించి, డెయిరీని మళ్లీ లాభాల బాటలోకి మళ్ళిస్తుందని చైర్మన్ హామీ ఇచ్చారు.

**రైతు ప్రయోజనాలే మా లక్ష్యం : ఎంపి చామల, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'నష్టాల్లో ఉన్న నార్ముల్ డెయిరీని వదిలేయకుండా, వేలాది మంది పాడి రైతుల జీవనాధారాన్ని కాపాడాలనే పట్టుదలతో గుజరాత్‌కు వచ్చి ఎన్‌డిడిబి పెద్దలను కలిశాం. మా విన్నపానికి వారు సానుకూలంగా స్పందించడం సంతోషకరం. రాబోయే కొద్ది వారాల్లోనే క్షేత్రస్థాయిలో మార్పులు కనిపిస్తాయి. తెలంగాణ సహకార డెయిరీ రంగాన్ని బలోపేతం చేసి రైతులకు అండగా ఉంటాం' అని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ జి.మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు తెలంగాణ ప్రభుత్వం అండ

న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం
పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క




ప్రజాపక్షం/హైదరాబాద్ : న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకు అండగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తుందని, న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందుంటానని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని ఖైరతాబాద్‌లోని ఇంజనీర్స్ ఇండియా భవనంలో ఐఎల్ పిఎ జాతీయ అధ్యక్షురాలు సుజాత చౌదంటే అధ్యక్షతన శనివారం మహిళా న్యాయవాదుల రాష్ట్ర సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవనిలో సగమైన మహిళలు అవకాశాల్లో సగం సాధించలేకపోతున్నారని, 70 ఏండ్ల స్వాతంత్ర భారత దేశంలో మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉందని ఫాతిమాను జడ్జిగా నియమించిన సందర్భంలో కూడా విమర్శలు చేశారని అన్నారు. ఉన్నత విద్యార్హత, ఉత్తీర్ణతలు ఎన్ని ఉన్నా కులం, మతం, జెండర్ పేరుతో అవకాశాలకు దూరమవుతున్నారని అన్నారు. ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ న్యాయవ్యవస్థలో మహిళలు రాణిస్తున్నప్పటికీ చట్టపరమైన అవకాశాలు లేకపోవడంతోపాటు పురుషాధిక్య సమాజంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల అభివృద్ధి జరగడం లేదని అన్నారు. ప్రజా ఉద్యమాలతో జీవితం ప్రారంభించి న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించిన తాను నేడు చట్టసభల్లోకి ప్రవేశించి ఒక గౌరవప్రదమైన మంత్రి పదవిలో కొనసాగుతున్నానని అన్నారు. కొంతమంది రాజ్యాంగ వ్యతిరేకశక్తులు న్యాయ వ్యవస్థను తగ్గించి మాట్లాడుతున్నారని, ఆ విధానం మంచిది కాదని రాజ్యాంగం వల్లనే నాలాంటి వాళ్ళు ఈ స్థాయికి ఎదిగారని అన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ తిరుమలదేవి మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు న్యాయవాద వృత్తిలో రాణించాలంటే కుటుంబంతో పాటు సమాజం సహకారం అందించాలని, వచ్చిన అవకాశాలను కూడా ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని అన్నారు.

వినియోగదారుల రాష్ట్ర కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ జి రాధారాణి మాట్లాడుతూ మహిళా సమాజం న్యాయవాద విద్యలో ప్రావీణ్యం సాధిస్తూ, వృత్తిలో మెలుకువలు అభివృద్ధి చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారత న్యాయ వ్యవస్థలో పితృస్వామ్య సమాజ ఆధిపత్యం కొనసాగుతుండటంతో చాలా అవకాశాలు కోల్పోతున్నారని ఐక్యతతో అవకాశాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎల్ పిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ న్యాయాన్ని కాపాడే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, న్యాయవాదుల రక్షణ కోసం 1990లోనే అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కన్వెన్షన్‌లో భారతదేశం కూడా పాల్గొన్నదని 35 ఏండ్ల తర్వాత కూడా భారత్‌లో న్యాయవధ రక్షణ చట్టం తీసుకురాకపోవడం దుర్మార్గమని అన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణతో పాటు దేశంలో న్యాయవాద రక్షణ చట్టం కోసం ఐఎల్‌పిఎ దేశ వ్యాప్త ఉద్యమం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ రిటైర్డ్ అధికారి పి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఉన్నత న్యాయ స్థానాల్లో మహిళలతో పాటు బహుజన న్యాయవాదులకు, న్యాయమూర్తులకు తీరని అన్యాయం జరుగుతుందని, ఈ వివక్షను ఎదుర్కోవడానికి మహిళా న్యాయవాదులు, బహుజన న్యాయవాదులు ఐక్యతతో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఐఎల్ పిఎ జాతీయ అధ్యక్షురాలు సుజాత చౌదంటే మాట్లాడుతూ తెలంగాణ మహిళా న్యాయవాదుల చైతన్యం గొప్పగా ఉందని, తరతరాల మహిళా వివక్షకు కారణమైన మనుధర్మ శాస్త్రం స్థానంలో అంబేద్కర్ అద్భుతమైన భారత రాజ్యాంగం అందించినప్పటికీ దాన్ని అమలుపరిచే భారత పాలకుల వల్ల మహిళలు అణచివేతకు గురవుతున్నారని, ఆ క్రమంలోనే మహిళా న్యాయవాదుల హక్కులు హరించివేయబడుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎల్‌పిఎ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జె.శాంసన్, గౌరవ అధ్యక్షులు పొన్నం దేవరాజ్ గౌడ్, ఉపాధ్యక్షులు టి.లక్ష్మి దేవి, తీగల జీవన్ గౌడ్, పూస మల్లేష్, కృష్ణారెడ్డి, పొడిచేసి శ్రీనివాస్, తౌడబోయిన రేణుక, హుస్న ఖాన్, ఎం సుమలత, ఆంధ్రప్రదేశ్ ఐ ఎల్ పి ఎ నాయకులు నూకతోటి రవి కుమార్, తెలంగాణ రాష్ట్ర ఐ ఎల్ పి ఎ నాయకులు చిల్ల రాజేంద్ర ప్రసాద్, గాంగేగేయుడు, డాక్టర్ తిప్పన్న డాంగే, కె సురేష్, భుజంగరావు, లతా ఆదోని, టి.హేమలత, జన్ను పద్మ, కెరీత్ కుమారి, గీతావనజాక్షి, మనీశ్వరి, జ్యోతి గరిగ, సామ హేమలత, ఎస్తేరు, స్వర్ణలత, సమత, పరశురాజ్, వి తిరుపతి, గుగులోతు బద్రు తదితరులు పాల్గొన్నారు.



## విపత్తుల సమయంలో యువత పాత్ర ఎంతో ప్రాధాన్యం

రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యదర్శి దాన కిషోర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విపత్తుల సమయంలో సమయోచిత స్పందన అత్యంత ముఖ్యమని, సమన్వయం , ముందస్తు జాగ్రత్తలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో శిక్షణ పొందిన యువత పాత్ర ఎంతో ప్రాధాన్యమని రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యదర్శి, గవర్నర్ కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన '99 రోజుల కార్యాచరణ'లో భాగంగా అన్ని జిల్లాలో మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తామన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయల పరిధిలోని రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్, విపత్తు నిర్వహణ సంయుక్త ఆధ్వర్యంలో ఒయులో ఆదివారం జరిగిన 'యువ ఆపద మిత్ర' శిక్షణ కార్యక్రమాన్ని దానకిషోర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు సమగ్ర శిక్షణ అందించి, ఎటువంటి అత్యవసర పరిస్థితులోనైనా ధైర్యంగా, సమర్ధవంతంగా ఎదుర్కొనే విధంగా వారిని తీర్చిదిద్ధాలని సూచించారు. భవిష్యత్ శిక్షణ కార్యక్రమాలను వైఎంఎస్,ఎన్‌ఎస్‌ఎస్,రెడ్ క్రాస్ సొంసైటీ సంయుక్తగా నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి గవర్నర్‌ను ఆహ్వానిస్తామన్నారు. యువతకు ముందస్తు సన్నద్ధత, ప్రాథమిక రక్షణ నైపుణ్యాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన సమగ్ర అవగాహన కల్పించడమే శిక్షణ కార్యక్రమ ఉద్దేశమన్నారు.

## 'సిపిడి ఆన్‌లైన్' సేవలను ప్రారంభించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్యుల నిరంతర వృత్తి అభివృద్ధి (సిపిడి) కార్యక్రమాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టిజిఎంసి) ఆన్‌లైన్ సిపిడి సేవలను ప్రారంభించింది. టిజిఎంసి గుర్తింపు పొందిన వైద్య సంఘాల సిపిడి దరఖాస్తులు, అనుమతులు, ధ్రువపత్రాల జారీ ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో అమలు చేస్తున్నామని టిజిఎంసి ఆదివారం ప్రకటించింది. ఆన్‌లైన్ విధానం ద్వారా తక్షణ ప్రాసెసింగ్‌కు అవకాశం ఉంటుందని, తద్వారా పరిపాలనా భారం తగ్గనుందని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే వైద్యులకు,' సిపిడి డిజిటల్ సర్టిఫికెట్ల'ను వారి వారి ఈ మెయిల్‌కు నేరుగాపంపిస్తారని, తద్వారా పారదర్శకత, భద్రత, పేపర్‌లెస్ విధానం అమలులోనికి వస్తుందని టిజిఎంసి తెలిపింది. లైవ్ ఫోటో క్యాప్చర్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టామని, అలాగే సిపిడి క్రెడిట్ జారీ చేసే ముందు టిజిఎంసి పోర్టల్ నుంచి వైద్యుల అధికారిక రిజిస్ట్రేషన్ వివరాలను రియల్‌టైమ్‌లో సేకరించి ఆటోమేటిక్‌గా ధృవీకరించే విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొంది. ఈ సమగ్ర డిజిటల్ వ్యవస్థ ద్వారా సిపిడి మార్గదర్శకాల అమలు మరింత క్రమబద్ధంగా, బాధ్యతాయుతంగా అమలవుతుందని, సాంకేతిక ఆధారిత పరిపాలనతో వైద్య వృత్తి ప్రమాణాలను బలోపేతం చేయడం, నిరంతర అభ్యాసాన్ని ప్రోత్సహించడం తమ లక్ష్యమని టిజిఎంసి స్పష్టం చేసింది. మరిన్ని వివరాలకు టిజిఎంసి అధికారిక పోర్టల్‌ను సందర్శించాలని వైద్య సంఘాలకు సూచించింది.

## అటల్ గొప్ప ప్రజాస్వామ్య వాది




మాతృభాషలో మాట్లాడండి

క్రమశిక్షణే ఉన్నతికి సోపానం

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మాజీ ప్రధాని వాజ్‌పేయి ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని అతి గొప్ప ప్రజాస్వామ్యవాది, దేశభక్తుడు, కవి, రచయిత అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు తెలిపారు. అణు పరీక్షలను నిర్వహించిన ధీశాలి అన్నారు. ఆదివా రం ఖమ్మంలో జరిగిన వాజ్‌పేయి శత జయంతి పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ పదవుల కోసం వాజ్‌పేయి ఎప్పుడు రాజీ పడలేదని ఓటమిని సైతం హుందాగా స్వీకరించిన ధీశాలి అన్నారు. స్వచ్ఛమైన మనస్సుతో దేశసేవ చేయాలని ఆకాంక్షించిన వాజ్‌పేయి స్వర్ణ చతుర్భుజి రహదారుల నిర్మాణాన్ని సమాచార ప్రచార రంగంలో గొప్ప మార్పుకు నాంది పలికారన్నారు. ప్రపంచ దేశాల ఆంక్షలను లెక్కచేయకుండా ప్రోక్రాన్ అణు పరీక్షలను నిర్వహించి ప్రజల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించారన్నారు. శ్యాంప్రకాష్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా వాజ్‌పేయి పనిచేశారని ఆయన పాలన దక్షిత, నిస్వార్థ సేవ నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. రాజకీయ పార్టీలకు గతంలో ఒక నిర్దిష్ట విధానం, సిద్ధాంతం ఉండేదని ఇప్పుడు సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చారన్నారు. అవకాశవాదంతో పార్టీలు మారుతున్నారని కులం కంటే గుణం మిన్న అన్న విషయాన్ని ఇప్పటి నేతలు గుర్తించాలన్నారు. కులం, మతం, ధనం, నేర చరిత్ర కాకుండా వ్యక్తిత్వం, సామర్థ్యం, యోగ్యత, ప్రవర్తన చూసి ఓట్లు వేయాలని ప్రజలకు వెంకయ్య నాయుడు సూచించారు. వివాదాలకు ఇచ్చిన ప్రాధాన్యత మీడియా మేలు చేసే అంశాలకు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విలువలతో కూడిన రాజకీయాలే సమాజ ఉన్నతికి దోహదపడతాయన్నారు. మాతృభాషలో మాట్లాడటమే సరైనదని పర భాష పదంతో అమ్మను పిలవడం సరైంది కాదన్నారు. అమ్మ, నాన్న అని పిలవడంలో ఉన్న కమ్మదనం ఆంగ్ల పదాల్లో లేదని ఆయన తెలిపారు. హిందూత్వం అంటే ఒక ఇరుకైన మతం కాదని విశాలమైన సంస్కృతి అన్నారు. క్రమశిక్షణ కారణంగానే తాను రైతు కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగానని, వ్యవస్థ అందించిన ప్రోత్సాహం కూడా మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, మందడపు ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, కసిరెడ్డి వెంకటాప్పారెడ్డి, కామినేని శ్రీనివాస్, దేవకి భాస్కర్‌రావు, ఎన్. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'సిఎం ప్రజావాణి' 'దరఖాస్తుల'కు 74శాతం పరిష్కారం



మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నం..

'ప్రజావాణి' ఇన్‌చార్జ్‌గా రెండేళ్లు పూర్తి చేసుకున్న డాక్టర్ చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'సిఎం ప్రజావాణి'కి వచ్చే దరఖాస్తులలో సుమారు 74 శాతం సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. సమస్యలను ఆయా శాఖల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ కు తరలివస్తున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి 'సిఎం ప్రజావాణి' ఇన్‌చార్జ్‌గా బాధ్యతులు తీసుకుని ఆదివారంతో రెండేళ్ల పూర్తయింది. సిఎం ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంతో ప్రజల నుంచి భారీ స్పందన వస్తోందని, ప్రజావాణి పట్ల ప్రజలలో భరోస ఏర్పడిందని డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు.
వారంలో మంగళ, శుక్రవారాలలో రెండు రోజుల పాటు నిర్వహించే ప్రజావాణికి సుమారు వేయి మంది నుంచి దరఖాస్తులు అందుతున్నాయి. రెండు సంవత్సరాల ఒక నెల క్రితం ప్రారంభమైన 'సిఎం ప్రజావాణి'లో ఇప్పటి వరకు 24 సెషన్స్‌ను పూర్తి చేశారు. రెండేళ్ల కాలంలో మొత్తం 1,12, 245 దరఖాస్తులు స్వీకరించగా, ఇందులో 64, 558 దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని, 47, 935 దరఖాస్తులను (సమస్యలను) పరిష్కరించారు. మిగిలిన 47, 687 దరఖాస్తులు ప్రభుత్వ పథకాలు, విధానపరమైన ప్రభుత్వ నిర్ణయాలు, ఉద్యోగాలకు సంబంధించినవి ఉన్నాయి. ఈసమస్యలను కూడా పరిష్కరించాలని 'సిఎం ప్రజావాణి' సంబంధిత శాఖలకు సిఫార్సు చేసింది. సిఎం ప్రజావాణి విజయవంతం కావడంతో ఈ కార్యమాన్ని పరిశీలించేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐఎఎస్., గ్రూప్ 1 అధికారులు తెలంగాణ రాష్ట్రానికి వచ్చారు.
వివిధ జిల్లాల నుంచి తమ సమస్యలను చెప్పుకునేందుకు హైదరాబాద్‌లోని సిఎం ప్రజావాణికి వచ్చే ప్రజలతో చిన్నారెడ్డి స్వయంగా మాట్లాడి, జిల్లా స్థాయి, శాఖల మధ్య సమన్వయం, ఇతర సాంకేతిక కారణాలు తదితర అంశాలకు చెందిన వాటిపై ఆయన అప్పటికప్పుడు ఆయా ఉన్నాతాధికారులతో ఫోన్లో మాట్లాడుతున్నారు. ఇలా కొన్ని సమస్యలు అప్పటికప్పుడే పరిష్కారానికి నోచుకున్నాయి. మరి కొన్ని సందర్భాలలో ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని తిరిగి ఉద్యోగంలోనికి తీసుకునే అంశంలో కూడా చిన్నారెడ్డి చొరవ తీసుకున్నారు. గల్ఫ్ లోని ఏడు దేశాలు సహా ఇతర దేశాలలో ఉన్న తెలంగాణకు ప్రజల సమస్యల పరిష్కారానికి సిఎం ప్రవాసి ప్రజావాణి కేంద్రాన్ని కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

**'సిఎం ప్రజావాణి'లో మౌలిక వసతులు...**

'సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు రాసి ఇచ్చేందుకు హెల్ప్ డెస్క్, ప్రతి శాఖ నుంచి అధికారులతో ప్రత్యేక డెస్కులు, వైద్య సహాయం కోసం మెడికల్ క్యాంపు, వృద్ధులు దివ్యాంగుల రవాణా కోసం బ్యాటరీ బగ్గి, వీల్ చైర్స్, అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్, ప్రజలకు మంచినీటి సౌకర్యం, జిహెచ్.ఎం.సి. ఆర్థిక సహకారంతో హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా ఐదు రూపాయల భోజనం వంటి సౌకర్యాలను ' సిఎం ప్రజావాణి' కల్పించారు. సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ కూడా సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

**పాస్‌బుక్ నుంచి గల్ఫ్ సమస్యల వరకు పరిష్కరించాం: చిన్నారెడ్డి**

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలను కూడా పరిష్కరించామని డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ గ్రూపుల పరీక్షలు, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ రిక్రూట్‌మెంట్ లలో జాప్యం, రైతు, వ్యవసాయ, విద్యుత్ సంబంధిత సమస్యలు, ప్రజల ఆరోగ్య సమస్యలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ళు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలు, ఆర్‌టిసి కార్మికులు, గల్ఫ్ కార్మికుల లాంటి అనేక సమస్యలను ప్రజావాణి ద్వారా పరిష్కారమవుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో సమస్యల పరిష్కార శాతాన్ని మరింత పెంచేందుకు అన్ని చర్యలూ తీసుకోనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.

## సబర్మతి తీరాన తెలంగాణ బృందం సందడి

మూసీ పునరుజ్జీవనానికి సరికొత్త ప్రణాళికలు!



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** గుజరాత్ రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక సబర్మతి రివర్ ఫ్రంట్‌ను తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ బృందంలో రాష్ట్ర పశుసంవర్ధక & మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా వారు పట్టణ అభివృద్ధి, పర్యాటకం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా సౌకర్యాల మెరుగుదల కోసం అక్కడ అమలు చేస్తున్న వినూత్న నమూనాలను నిశితంగా అధ్యయనం చేశారు.
నదీ తీర ప్రాంతాన్ని కేవలం పర్యాటక కేంద్రంగానే కాకుండా, ప్రజల విశ్రాంతి, వినోదం, క్రీడల కోసం ఏ విధంగా తీర్చిదిద్దారో ప్రతినిధి బృందం పరిశీలించింది. సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అహ్మదాబాద్ నగర అందాన్ని పెంచడమే కాకుండా, పర్యావరణ హితంగా రూపొందడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలోని మూసీ నది వంటి ప్రాంతాలను పునరుజ్జీవింపజేసే క్రమంలో, సబర్మతి వద్ద అమలు చేసిన ఉత్తమ పద్ధతులను స్వీకరించే అవకాశం ఉందని ఈ సందర్భంగా నేతలు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మన రాష్ట్రంలో కూడా ఇలాంటి అభివృద్ధి పనుల ద్వారా నదీ తీర ప్రాంతాలను ప్రజా ప్రయోజనార్థం మార్చవచ్చని వారు పేర్కొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ డిమాండ్ న్యాయమైనదే : కోదండరామ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు డిమాండ్ న్యాయమైనదేనని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రో॥ కోదండరామ్ తెలిపారు. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదుగుతారని ఆయన తెలిపారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఖమ్మంలోని టిటిడిసి భవనంలో ఆదివారం బిసి సదస్సు నిర్వహించారు. సదస్సులో కోదండరామ్ మాట్లాడు తూ భారత రాజ్యాంగం ప్రతిపాదించినటువంటి ప్రజాస్వామ్యం, ప్రాతినిథ్య ప్రజాస్వామ్యం కానీ మెజార్టీ వర్గాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో పా తుకుపోయిన కారణంగా అసమానతలు పెరుగుతున్నాయన్నారు. న్యాయ సమ్మతమైన ప్రాతినిధ్యాన్ని బిసి వర్గాలు పొందలేకపోయాయని కోదండ రామ్ తెలిపారు. అన్యాయాన్ని సరిదిద్దే బాధ్యతను రాజ్యాంగం పాలకులకు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్‌ను తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కోదండరామ్ డిమాండ్ చేశారు. బిసి సదస్సు అనంతరం కోదండరామ్ భూదాన్ భూ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూల్చివేయండి

ఇరాన్ ప్రజలకు మాజీ రాజకుమారుడు పహ్లవీ పిలుపు



**వాషింగ్టన్:** ఆయొతొల్లా అలీ ఖమేనీ మరణంతో కథ ముగిసిపోలేదని, ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూల్చివేయాలని ఇరాన్ ప్రజలకు రెజా పహ్లవీ పిలుపు ఇచ్చారు. ఇరాన్ సామ్రాజ్య చివరి అధిపతి మహ్మద్ రెజా పహ్లవీ కుమారుడు,మాజీ రాజకుమారుడు రెజా పహ్లవీ ఎక్స్ వేదికగా ఆదివారం పై విధంగా పోస్టింగ్ పెట్టారు. ప్రజలు తమ నిర్ణయాత్మకమైన ఉనికి చాటుకోవడానికి ఇరాన్ వీధుల్లోకి వచ్చి పోరాడాలని కోరారు. ఇరాన్‌లో ఇస్లామిక్ రిపబ్లిక్ పీడకలను త్వరగా ముగించాలని, నేరస్థులైన పాలకులను రక్షించకుండా, మహోన్నతమైన ఇరాన్ రాజ్యాన్ని సంరక్షించుకోవడానికి ప్రజలు తమ ఆయుధాలను ఉపయోగించాలని కోరారు. ఇరాన్ అధికారులు లొంగిపోవాలని, గొప్పరాజ్యమైన ఇరాన్‌ను కాపాడేందుకు సైన్యం, చట్టబద్ధ వ్యవస్థలు తమ ఆయుధాలను ఉపయోగించాలని కోరారు. నేరమయంగా మారిన రిపబ్లిక్ భూతాన్ని వీలైనంత తొందరగా అంతం చేయాలన్నారు. ఇరాన్ నుండి పారిపోయి అమెరికాలో రహస్యంగా తలదాచుకున్నా రెజా పహ్లవీ (66) ఇటీవల ఇరాన్‌లో ప్రవాసం నుండే హింసను రెచ్చగొట్టిన ప్రతిపక్ష నాయకుడుగా పేరు తెచ్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో జరిగిన ప్రదర్శనల్లో ప్రజలు ఆయన పేరుతో నినాదాలు చేశారు. ఖమేనీ స్థానంలో ఆయనను కూర్చోబెట్టాలని అమెరికా ఆలోచనలు, అధికారం వచ్చి తన ఒడిలో వాలుతుందని కలలు కంటున్న తరుణంలో పహ్లవీ నుండి ఈ రెచ్చగొట్టే వ్యాఖ్యలు వెలువడ్డాయి. 1979లో ఆయన తండ్రి మహ్మద్ పహ్లవీ ఇస్లామిక్ విప్లవంలో పదవీచ్యుడయ్యారు.

## అమెరికా వ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు

ట్రంప్ నియంతగా మారుతున్నారంటూ వైట్‌హౌస్ వద్ద నిరసన




**వాషింగ్టన్:** ఇరాన్‌పై దాడులను వ్యతిరేకిస్తూ అమెరికాలో యుద్ధ వ్యతరేక ప్రదర్శనలు జరిగాయి. వామపక్ష సమూహాలు సహా పలు ప్రగతిశీల సంస్థలు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. అదే విధంగా స్కాట్‌లాండ్‌లో కూడా నిరసన ప్రదర్శలు జరిగాయి. అక్కడ ఘర్షణలు కూడా చెలరేగాయి. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్‌లో అక్రమ యుద్ధం భయంకరమైన వినాశనం సృష్టించిందన్నారు. అమెరికా కాంగ్రెస్‌ను తక్షణం ఏర్పాటు చేసి యుద్ధంపై చర్చించాలని ప్రతిపక్ష డెమోక్రటిక్ చట్ట సభ్యులు డిమాండ్ చేశారు. ఇరాన్ సర్వాధినేత అయొతొల్లా అలీ ఖమేనీని దాడుల్లో హత్యచేసినట్లు వార్త వెలువడిన తర్వాత అమెరికాలో పలుచోట్ల ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ప్రదర్శకులు వాషింగ్టన్ డి.సి, న్యూయార్క్, అట్లాంటా, బాల్టిమోర్, బోస్టన్, చికాగో, సిన్సినాటి, డెన్వర్, లాస్‌వేగాస్, లాస్ ఏంజెల్స్, మియామి, మిన్నెపొలిస్ తదితర ప్రాంతాలలో ప్రదర్శకులు గుమిగూడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఎలాంటి కవ్వింపు చర్యలూ లేని, ఇరాన్‌పై అక్రమ దాడి యుద్ధ చర్యే... అని నినాదాలు చేశారు. అనూహ్యమైన మరణాలు, అనూహ్యమైన నష్టాలు ఇరాన్‌లో సంభవించాయని విమర్శించారు. వైట్‌హౌస్ ఎదురుగా ప్రదర్శకులు గుమిగూడి యుద్ధ వ్యతిరేక నినాదాలు చేశారు. న్యూయార్క్‌లో టైమ్స్ స్క్వేర్ ఎదురుగా కూడా నిరసన ప్రదర్శనలు జరిపారు. నో వార్... నో బాంబ్స్... నో వార్ ఆన్ ఇరాన్... బోర్డ్ ఆఫ్ పీస్ ఎందుకు? దాని పనేమిటి? అని ప్రశ్నిస్తూ ప్రదర్శకులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఆన్సర్ కూటమి, నేషనల్ ఇరానియన్ అమెరికన్ కౌన్సిల్, 50501, అమెరికన్ ముస్లిం ఫర్ పాలస్తినా, పీపుల్స్ ఫోరం పాలస్తినా యూత్ మూమెంట్, డెమోక్రటిక్ సోషలిస్ట్ అమెరికా, కోడ్ పింక్, బ్లాక్ అలయెన్స్ ఫర్ పీస్‌వంటి అనేక సంస్థలు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. 'ఈ యుద్ధానికి అమెరికా కాంగ్రెస్ అనుమతి ఇవ్వలేదు, అనుమతి లేకుండా యుద్ధం చేస్తున్నారు, ట్రంప్ ఎవరి సలహా, ఆమోదం లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు, ఈ చర్యలతో ఆయన ఒక నియంతగా తయారవుతున్నారు, ఆయన అమెరికాను ఒక ఫాసిస్టు దేశంగా మారుస్తున్నారు' అని ప్రదర్శకులలో ఒకరైన స్యూ జాన్సన్ విమర్శించారు. ఐసిఇ పాచిక పారలేదు కాబట్టి ఆయన పశ్చిమాసియాను కదలిద్దామనుకున్నాడని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ అనుమతి లేకుండా ఏ అధ్యక్షుడు ఏమీ చేయలేడు, ఏ దేశానికి వెళ్ళి ఎవ్వరినీ కిడ్నాప్ చేయలేడు అని ఆమె విమర్శించారు.

## కోచ్ ఫ్యాక్టరీలో 'స్థానిక' డిమాండ్

80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

భూ నిర్వాసితులకు తొలి ప్రాధాన్యం అవసరం

కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు జేఏసీ యత్నం

ఆందోళనకు సిద్ధమవుతున్న రాజకీయ పక్షాలు



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ జిల్లా ప్రజల చిరకాలం వాంఛ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న వేళ ఉద్యోగాల్లో స్థానికులకు తొలి ప్రా న్యం కల్పించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. దశాబ్దాల పోరాటం ఫలితంగా ఏర్పాటైన ఈ ఫ్యాక్టరీలో స్థానికులకు 80శాతం ఉద్యోగావకాశాలు కల్పించినపుడే సరైన సామాజిక న్యాయం చేసినట్టు అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వెనుకబడిన గ్రామీణ ప్రాంతాలు కాజీపేట చుట్టూ ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీ కోసం దేవాదాయ భూములతోపాటు పలువురు రైతులు తమ భూమిని అప్పగించారు. దేవాదాయ భూముల్లో కౌలు రైతులుగా పని చేసిన వారు తమ ఉపాధిని పణంగా పెట్టి ఈ ఫ్యాక్టరీకి భూములిచ్చేందుకు అంగీకరించారు. ఈ నేపథ్యంలో భూ నిర్వాసితులకు ఈ ఫ్యాక్టరీలో ఉద్యోగావకాశం కల్పించాలని, స్థానిక యువతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. తెలంగాణలో ప్రత్యేకించి వరంగల్ జిల్లా విప్లవోద్యమానికి పెట్టింది పేరు. ఉపాధి అవకాశాలు సన్నగిల్లిన క్రమంలో దశాబ్దాల క్రితం స్థానిక యువత అటువైపుగా పయనించిన నేపథ్యం కూడా ఉంది. ఈ కోణంలో ఆలోచించినా రానున్న రోజుల్లో నిరుద్యోగం స్థానిక యువత పాలిట శాపంగా మారకుండా కేంద్రం ఈ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కాజీపేట, కడిపికొండ, మడికొండ, భట్టుపల్లి, అయోధ్యపురం, సోమిడి తదితర అనేక గ్రామాలు ఈ చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడి యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నది.

**కోచ్‌తో దశాబ్దాల కల నెరవేరే వేళ**

తొలి తెలంగాణ ఉద్యమం నుంచి ప్రారంభమైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ తదుపరి 1980 దశకంలో ప్రభుత్వ ప్రతిపాదనల్లోకి చేరి అమలు దశలో అనేక అడ్డంకులు నెలకొన్నాయి. కాజీపేట ప్రాంతానికి మంజూరైన కోచ్ ఫ్యాక్టరీలు వివిధ ప్రభుత్వాల హయాంలలో ఇతర ప్రాంతాలకు తరలి వెళ్ళి, ఇక్కడి ప్రాంతవాసుల ఆశలను నీరుగారుస్తూ వచ్చాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోచ్ ఫ్యాక్టరీ స్థానంలో కేవలం వాగన్ పిరియాడికల్ ఓవర్‌హాలింగ్ (పిఒహెచ్) వర్క్‌షాప్ ఏర్పాటుగా మార్చింది. ఈ నిర్ణయంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రధాని మోదీ ఆధ్వరంలో శంకుస్థాపన జరుగడంతో మిశ్రమ స్పందన లభించింది. ఏదో ఒక ఫ్యాక్టరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారనే అభిప్రాయం వ్యక్తమైన నేపథ్యంలో రాజకీయ పక్షాల నుంచి పెరిగిన ఒత్తిడికి కేంద్రం తలొగ్గి పీవోహెచ్‌ను కోచ్ నిర్మాణ ఫ్యాక్టరీగా మార్చారు. దీంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమైంది. ఫ్యాక్టరీ నిర్మాణ పనులు చివరి దశకు చేరిన నేపథ్యంలో స్థానికులకు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగం స్థానిక హక్కు అనే నినాదం ఊపందుకుంది.

**ప్రారంభోత్సవానికి ముందు స్థానికుల డిమాండ్**

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం దశాబ్దాల పోరాటం.. కలలు ఫలితాన్నివ్వబోతున్న వేళ.. ఇందులో స్థానికులకే 80 శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలనే డిమాండ్ ఊపందుకుంటున్నది. ఇదే డిమాండ్‌తో శనివారం బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అలాగే కోచ్ ఫ్యాక్టరీ పూర్తి కావస్తున్న సందర్భంగా దీని కోసం పోరాడిన జెఎసి, ఇతర సంస్థలు, రాజకీయ పార్టీలు ఒక్కరొక్కరుగా గొంతెత్తుతున్నారు. స్థానికులకు ఉద్యోగావకాశం కల్పించినపుడు సరైన న్యాయం జరుగుతోందంటున్నారు. అందుకోసం స్థానికులకే 80శాతం ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ డిమాండ్ న్యాయమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 10 నుంచి 15 వేల మందికి ఉపాధి లభిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ ఫ్యాక్టరీపై ఆశతో అనేక మంది ఇంజినీరింగ్, డిప్లొమో, ఐటీఐ, ఏటీసీల్లో చదువులు పూర్తి చేసిన నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

**మార్చి 8న జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష**

'మన పిల్లలకు మన ఉద్యోగాలు' అనే డిమాండ్‌తో ఇటీవల జెఎసి ఆధ్వర్యంలో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. దీనిపై అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు, ప్రతిపక్ష బిఆర్‌ఎస్, బిజెపి స్థానిక నాయకులు, వివిధ ప్రజాసంఘాలు, రైల్వే ఉద్యోగ,కార్మిక కుటుంబాలు ఇదే డిమాండ్ చేస్తున్నారు. కేంద్రం, రైల్వే శాఖ సామాజిక న్యాయానికి కట్టుబడి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మరో ఆందోళన కొనసాగిస్తామంటూ స్పష్టం చేస్తున్నారు. ఈ సమస్యపై జెఎసి ఇప్పటికే రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించింది. ఈ సమస్యపై మార్చి 8వ తేదీన కోచ్ ఫ్యాక్టరీ వద్ద నిరసన దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు నిరసనకు సిద్ధమవుతున్నాయి.

## ఖమేనీ మృతి పట్ల

# భారత్ వ్యాప్తంగా నిరసనలు

### అనేక చోట్ల వారంపాటు సంతాప దినాలుగా పాటించాలని ప్రకటన



**న్యూఢిల్లీ:** అమెరికా–ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మృతికి వ్యతిరేకంగా ఆదివారం భారత్‌లోని కశ్మీర్ నుండి కర్ణాటక వరకు వివిధ ప్రాంతాలలో షియాలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. ఖమనీ మృతిపట్ల సంతాప తెలిపారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్–అమెరికా సంయుక్త దాడి సందర్భంగా శనివారం టెహ్రాన్‌లో జరిగిన వైమానిక దాడిలో ఖమేనీ మరణించారు. ఆదివారం ఇరాన్ రాష్ట్ర మీడియా ఇదే విషయాన్ని ధృవీకరించింది, భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. సంతాప సభలు నిర్వహించారు. సుమారు 15 లక్షల మంది షియాలు ఉన్న కశ్మీర్‌లో లాల్ చౌక్, సైదా కదల్, బుడ్గామ్, బండిపోరా, అనంత్‌నాగ్, పుల్వామాలో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయని ఒక అధికారి తెలిపారు. అమెరికా వ్యతిరేక, ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలు చేస్తూ నిరసనకారులు ఛాతీపై కొట్టుకుంటూ కనిపించారు. ఇరాన్‌లో జరుగుతున్న పరిణామాలపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విస్తృత నిరసనల మధ్య ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న విద్యార్థులు సహా జమ్ముకశ్మీర్ నివాసితుల భద్రత, శ్రేయస్సును నిర్ధారించడానికి తన ప్రభుత్వం కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సన్నిహిత సమన్వయంలో ఉందని అబ్దుల్లా అన్నారు. ఖమేనీ హత్యపై తీవ్ర వేదన వ్యక్తం చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, పరిస్థితిని సున్నితంగా, విచక్షణతో చూడాలని, సంతాపం ప్రకటించాలనుకునే వారు గౌరవంగా అలా చేయగలిగేలా చూడాలని అధికారులను కోరారు. ఖమేనీ హత్య పట్ల కశ్మీర్ ప్రధాన పూజారి మిర్వైజ్ ఉమర్ ఫరూఖ్ తాను తీవ్ర విచారం చేశారు. 'ముస్లిం ప్రపంచాన్ని కుదిపేసిన ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా సయ్యద్ అలీ ఖమేనీని దారుణంగా హత్య చేయడం పట్ల తీవ్ర విచారం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాను. ఈ క్రూరత్వాన్ని, ఇరాన్‌పై కొనసాగుతున్న దురాక్రమణను, అలాగే మినాబ్‌లో అమాయక బాలికలపై జరిగిన హత్యాకాండను జమ్ముకశ్మీర్ ప్రజలు సమష్టిగా ఖండిస్తున్నారు' అని మిర్వైజ్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనేక ముస్లిం సంస్థలు, పలు రోజుల పాటు సంతాప దినాన్ని ప్రకటించాయి. ఇరాన్ నాయకుడి జ్ఞాపకార్థం సోమవారం కూడా తమ నిరసనలను కొనసాగించనున్నాయి. ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో, బారా ఇమాంబారా మసీదు సమీపంలో డజన్ల కొద్దీ ప్రజలు గుమిగూడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. మహిళలు ఇరాన్ నాయకుడి ఫోటోకు పట్టుకుని కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. ఆల్ ఇండియా షియా పర్సనల్ లా బోర్డ్ జనరల్ సెక్రటరీ మౌలానా యాసూబ్ అబ్బాస్ సోమవారం జరిగే నిరసన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు దిష్టిబొమ్మలను దహనం చేస్తామని ప్రకటించారు. షియా సమాజం మూడు రోజుల సంతాప దినాలు ప్రకటించింది. ఈ సమయంలో ప్రజలు నల్లని దుస్తులు ధరించి, ఇళ్ల వద్ద నల్ల జెండాలు ఎగురవేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని అబ్బాస్ తెలిపారు. ముస్లిం జనాభా తక్కువగా ఉన్న పంజాబ్‌లోని లూథియానాలో నిరసనలు, దిష్టిబొమ్మలను దహనం చేశారు. నిరసనకు నాయకత్వం వహించిన షాహి ఇమామ్ మౌలానా మొహమ్మద్ ఉస్మాన్ రెహ్మానీ లుధియాన్వి, కేంద్ర ప్రభుత్వం వారం రోజుల జాతీయ సంతాప దినాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఖమేనీని గొప్ప అమరవీరుడిగా అభివర్ణిస్తూ, అతని హత్యను తీవ్రంగా ఖండిస్తూ, ఇటువంటి సవాళ్లకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఐక్యంగా ఉండాలని రెహ్మానీ కోరారు. ఖమేనీ హత్యకు సంబంధించి అజ్మీర్‌లోని షియా సమాజం కూడా మూడు రోజుల సంతాప దినాలు ప్రకటించింది. దొరైలోని దర్గా, అజ్మీర్‌లోని తారాఘర్‌లో కూడా సంతాప సమావేశాలు ఏర్పాటు చేశారు. న్యూఢిల్లీ, బీహార్, జార్ఖండ్, తెలంగాణలో కూడా తీవ్ర దిగ్భ్రాంతి, నినాదాలు చేశారు. నిరసనకారులు ఖమేనీ పోస్టర్‌లను పట్టుకుని, అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యలకు వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

# మోదీ విదేశాంగ విధానం విఫలం

### భారత్ భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోంది : కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ :** మోదీ సర్కారు విదేశాంగ విధానం విఫలమవుతుందని, దీంతో మన దేశం భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం, భారతదేశ విలువలు, సూత్రాలు, ప్రయోజనాలకు ద్రోహం చేయడమేనని పేర్కొంది. ఇరాన్‌పై దాడికి అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్న వేళ, ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించి ప్రధాని మోదీ పెద్ద తప్పు చేశారని మండిపడింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజుల తర్వాత ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేశాయని ఆయన గుర్తుచేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్ పార్లమెంటు (నెస్సెట్)లో ప్రధాని మోదీ ప్రసంగించి, పిరికితనంతో నైతికతకు నీళ్లు వదిలిన విషయాన్ని యావత్ ప్రపంచానికి చాటుకున్నారని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు.

**ప్రధాని సారథ్యంలోని చీర్ లీడర్లకు అర్థం కావట్లేదు**

'తనను తాను విశ్వగురువుగా ప్రకటించుకున్న ప్రధాని మోదీ గురించి ఇప్పుడు అందరికీ పూర్తిగా తెలిసిపోయింది. ప్రధాని మోదీ అనుసరించిన విదేశాంగ విధానం పైనా అందరికీ క్లారిటీ వచ్చేసింది. కానీ ప్రధాని సారథ్యంలోని కొందరు చీర్ లీడర్లకు ఇదేమీ అర్థం కావడం లేదు. ఇరాన్‌లోని కీలక వ్యక్తుల హత్యల కోసం ఇజ్రాయెల్, అమెరికా నిర్వహించిన దాడులపై మోదీ సర్కారు స్పందించకపోవడం అనేది భారతదేశ విలువలు, సూత్రాలు, ప్రయోజనాలకు ద్రోహం చేయడమే' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మౌనం ఎందుకు?**

'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్‌తో రొమాన్స్‌లో ఉన్నారు. అందుకే ఆయన పదేపదే పాక్‌పై ప్రశంసల వర్షాన్ని కురిపిస్తున్నారు. చివరకు విద్వేష వ్యాఖ్యలతో జమ్ముకశ్మీరులోని పహల్గాంలో 2025 ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరగడానికి కారకుడైన పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను కూడా ట్రంప్ ఆకాశానికి ఎత్తుతున్నారు. తాజాగా అఫ్ఘనిస్థాన్‌పై పాక్ దాడులనూ అమెరికా అధ్యక్షుడు సపోర్ట్ చేశారు. దిగుమతి సుంకాలను పెంచుతానని బెదిరించి భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను 2025 మే 10న ఆపింది తానే అని ఇప్పటివరకు వందల సార్లు ట్రంప్ చెప్పుకున్నారు. కానీ భారత ప్రధాని మోదీ పూర్తిగా మౌనాన్ని వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ ఆగిందనే విషయంపై తొలుత అమెరికానే ప్రకటన చేసింది. 2025 మే 10న సాయంత్రం 5.37 గంటలకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో దీనిపై ప్రకటన చేశారు' అని జైరాం రమేశ్ తెలిపారు.

**ట్రంప్‌పై మోదీ ఒత్తిడి చేసి ఉంటారు**

'ప్రధాని మోదీ విన్నపం మేరకు భారత్ అమెరికా ట్రేడ్ డీల్‌ను ఖరారు చేశానని 2026 ఫిబ్రవరి 2న ట్రంప్ ప్రకటించారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న కీలక అంశాల నుంచి ప్రజల చూపును మళ్లించడానికే మోదీజీ ఈ ప్రయత్నం చేసి ఉంటారు. ట్రంప్ ప్రకటన చేసిన 18 రోజుల తర్వాత అమెరికా ప్రభుత్వ సుంకాల పాలసీని తప్పుపడుతూ సాక్షాత్తూ అక్కడి సుప్రీంకోర్టే తీర్పును ఇచ్చింది. ఏకపక్షంగా ప్రపంచ దేశాలపై సుంకాలను బాదడం రాజ్యాంగ వ్యతిరేకమని ట్రంప్ సర్కారుకు మొట్టికాయలు వేసింది. ట్రంప్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ఇలాంటి తీర్పు వస్తుందని అన్ని దేశాలూ ముందే అంచనావేశాయి. కానీ తన సొంత రాజకీయ సమీకరణాల కోసం భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే ఖరారు చేయమని ట్రంప్‌పై ప్రధాని మోదీ ఒత్తిడి చేసి ఉంటారు. భారత్ అమెరికా ట్రేడ్ డీల్ ఏకపక్షంగా ఉందని అందరికీ తెలిసిపోయింది. అమెరికా వస్తు, ఉత్పత్తుల కోసం భారత మార్కెట్‌ను తెరుస్తామని మోదీ సర్కారు పెద్దపెద్ద హామీలు ఇచ్చింది. కానీ అమెరికా వైపు నుంచి భారత్‌కు అలాంటి హామీలేం లభించలేదు. ఈ ట్రేడ్ డీల్‌కు ప్రతిగా రష్యా నుంచి చమురును కొనడాన్ని ఆపేస్తామని భారత్ హామీ ఇచ్చిందని అమెరికా అంటోంది.దీనిపైనా ఇప్పటిదాకా మోదీ సర్కారు దేశ ప్రజలకు స్పష్టతను ఇవ్వలేదు' అని జైరాం రమేశ్ చెప్పారు.

## నేడు అంతర్జాతీయ అణుసంస్థ అత్యవసర సమావేశం

**వియన్నా:** పశ్చిమ ఆసియాలో యుద్ధ సంక్షోభంపై ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) సోమవారం (మార్చి 2) అత్యవసర సమావేశం నిర్వహిస్తోంది. ఈ విధంగా ఐఎఇఎ సమావేశం నిర్వహించడం ఒక అసాధారణ సంఘటన. వియన్నా కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఒక ప్రకటన చేస్తూ సభ్యదేశాలపై రష్యా తదితర దేశాలు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అమెరికా–ఇజ్రాయెల్ చేసిన ఉమ్మడి దాడుల్లో అలీ ఖమేనీ మరణించిన తర్వాత ఐఎఇఎ ప్రధానాధిపతి రాఫెల్ గ్రాస్సీకి రాసిన లేఖలో ఇరాన్ కూడా ఇదే విధమైన అభ్యర్థన చేసింది. ఈ విజ్ఞప్తుల మేరకు ఐఎఇఎ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అసాధారణ సమావేశం ఏర్పాటు చేసినట్లు గ్రాస్సీ పేర్కొన్నారు. 35 దేశాలకు ఈ బోర్డు ప్రాతినిధ్యం వహిస్తుంది. పశ్చిమ ఆసియాలో పరిణామాలను చాలా నిశితంగా గమనిస్తున్నామని, ఇరాన్‌లో అణు కార్యక్రమాన్ని చాలా క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని గ్రాస్సీ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ వ్యవస్థలో అంతర్భాగంగా 1957లో ఆవిర్భవించిన ఐఎఇఎ ప్రపంచ దేశాలు అణు పదార్థాన్ని శాంతియుత ప్రయోజనాలకే మాత్రమే ఉపయోగించడం, అణు భద్రతాచర్యలను పర్యవేక్షణ చేస్తుంది. అణ్వాయుధాలను తయారు చేయకుండా అరికట్టడం, నియంత్రణ చర్యలు తీసుకోవడం ఐఎఇఎ బాధ్యతలు. వియన్నా కేంద్రంగా ఈ సంస్థ బాధ్యతలు నిర్వహిస్తుంది.

## భద్రతామండలిలో ఇరాన్‌తో అమెరికా–ఇజ్రాయెల్ ఘర్షణ

### దాడులకు ఐక్యరాజ్యసమితి ఖండన

**న్యూయార్క్:** భద్రతామండలి సమావేశంలో ఇరాన్‌తో అమెరికా–ఇజ్రాయెల్‌కు చెందిన ప్రతినిధులు ఘర్షణకు దిగారు. ఇరాన్‌పై దాడుల రోజునే ఈ ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ వారికి హెచ్చరిక జారీ చేశారు. దాడులను తీవ్రంగా ఖండించారు. తక్షణం సైనిక దాడులు అపాలని డిమాండ్ చేశారు. పశ్చిమ ఆసియాలో అడ్డూ అదుపూ లేకుండా అనేక సంఘటనలు వరుసగా జరుగుతున్నాయని, ఇప్పుడు సైనిక చర్యవల్ల ఈ ప్రాంతంలో తీవ్రమైన అపాయాలు, సమస్యలు పెరుగుతున్నాయని వారిని హెచ్చరించారు. ఈ విధంగా పశ్చిమ ఆసియాలో దాడులు అంతర్జాతీయ భద్రతకు, ప్రపంచశాంతికి తీవ్ర ప్రమాదకరమని ఆయన అన్నారు. "ఈనాడు మనం కళ్ళతో చూస్తున్నాం, విరామం లేకుండా కొనసాగుతున్న ఘటనలవల్ల అంతర్జాతీయ శాంతికి, భద్రతకు తీవ్రమైన ప్రమాదం వాటిల్లింది, ఇప్పుడు సైనిక దాడులతో పశ్చిమ ఆసియా ప్రపంచంలోనే అత్యంత హింసాత్మకమైనప్రాంతంగా మారింది,ఎవ్వరూ నియంత్రించలేకపోతున్నం తస్థాయిలో ఈ హింస కొనసాగుతోంది'' అని గుటెర్రెస్ భద్రతామండలి సమావేశంలో అన్నారు. ఇజ్రాయెల్–అమెరికా రెండూ ఇరాన్‌పై ఉమ్మడి దాడి ప్రారంభించిన కొద్ది గంటల తర్వాత భద్రతామండలి సమావేశం జరిగింది. అమెరికా–ఇజ్రాయెల్ చేసిన దాడులను ఐక్యరాజ్యసమితి ఖండించింది. అదేవిధంగా ఇరాన్ కూడా సామూహికంగా పశ్చిమాసియా అంతటా బహ్రైన్,ఇరాక్, జోర్డాన్,కువైత్, ఖతార్, సౌదీ అరేబియా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల సార్వభౌమాధికారాలను ఉల్లంఘించి దాడులు చేసిందని గుటెర్రెస్ విమర్శించారు.

# ఉదయ్ భాను చిబ్‌ను విడుదల చేయాలి

### యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్
### శాంతియుతంగా సత్యాగ్రహం




**న్యూఢిల్లీ :** ఎఐ సమ్మిట్ సందర్భంగా నిర్ధనగ్న నిరసనకు సంబంధించి అరెస్టయిన తమ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, ఇతర సభ్యులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆదివారం శాంతియుత సత్యాగ్రహం నిర్వహించింది. జీవించే హక్కు, స్వేచ్ఛ భారత రాజ్యాంగం ఆత్మ అంటూ మేజిస్ట్రేట్ కోర్టు చిబ్ విడుదలకు ఆదేశించింది. అయితే కొన్ని గంటల తర్వాత, ఢిల్లీ కోర్టు అతనికి మంజూరు చేసిన బెయిల్‌పై స్టే జారీ చేసింది. కాగా, పరిపాలనాపరమైన ఒత్తిడి వచ్చినప్పుడు, న్యాయం కూడా తడబడటం ప్రారంభమవుతుందని యూత్ కాంగ్రెస్ ఆరోపించింది. 'న్యాయబద్ధంగా గెలుస్తున్నప్పటికీ, మళ్లీ మళ్లీ పాలనగా పరంగా ఓడిపోతున్నాము. అందుకే మా సత్యాగ్రహం కొనసాగుతుంది. అందులో దానిలో భాగంగా ఈ సమస్యలను లేవనెత్తుతాము' అని ఐవైసి మీడియా బృందం సభ్యుడు రజా అహ్మద్ అన్నారు. అనేక మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులను కూడా నిరసనలో పాల్గొనాలని ఆహ్వానించారు. శనివారం తెల్లవారుజామున ఉదయ్ భానుకు బెయిల్ మంజూరు అయిందని, బెయిల్ బాండ్ ఇప్పటికే సమర్పించామని, కానీ తరువాత, వారిని బాండ్ వెరిఫికేషన్ కోసం ఒక రోజు కస్టడీకి పంపినట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఆ తర్వాత, సాయంత్రం నాటికి, బెయిల్ బాండ్ రద్దు చేయబడిందని, వారిని ఐదు రోజుల రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారన్నారు. మీడియాలో అప్పటికే వార్తలు వచ్చిన గంట తర్వాత అధికారిక ప్రకటన వచ్చిందని అని అహ్మద్ పేర్కొన్నారు. శనివారం చిబ్‌కు బెయిల్ మంజూరు అయిన కొన్ని గంటల తర్వాత, ఢిల్లీ పోలీసుల విజ్ఞప్తి మేరకు అదనపు సెషన్స్ జడ్జి అమిత్ బన్సల్ ఆ ఉత్తర్వును నిలిపివేసి, మార్చి 6న ఈ విషయాన్ని తదుపరి విచారణను వాయిదా వేశారు.

## పోలీసుల కళ్లుగప్పి నిందితుడు పరారీ

**మహరాజ్‌గంజ్:** ఉత్తర్ ప్రదేశ్ లోని మహరాజ్ గంజ్ లో పోలీస్ విచారణ లో ఉన్న నిందితుడు పరారయ్యాడు. మైనర్ బాలికపై అత్యాచారం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో అరెస్టయిన కుషినగర్ జిల్లాకు చెందిన కిషన్ సాహ్ని(22) అనే నిందితుడు పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. శనివారం కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తుండగా మూత్రవిసర్జనకు అని చెప్పి వాహనం దిగి పారిపోయాడని అధికారులు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ ఉదయ్ భన్ కుష్వాహా, హోంగార్డ్ నందకిషోర్‌పై కేసు నమోదుచేశామని, తప్పించుకున్న నిందితుడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# బిజెపిని గద్దె దించేందుకు కౌంట్‌డౌన్ షురూ

- ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హెచ్చరిక
- ఎక్సైజ్ పాలసీ కేసులో తనను ఇరికించడానికి ప్రధాని, అమిత్ షా కుట్ర పన్నారని ఆరోపణ
- ప్రధాని అందరికీ భయపడుతున్నారు, ఇది ఆయన పాలనకు ముగింపు సంకేతమని వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాపై ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర విమర్శలు చేశారు. అధికారం నుండి బిజెపి తొలగించేందుకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని పేర్కొన్నారు. మద్యం పాలసీ కేసులో ఢిల్లీ కోర్టు రెండు రోజుల క్రితం ఆయనను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో శుక్రవారం ట్రయల్ కోర్టు కేజ్రీవాల్, ఆయన డిప్యూటీ మనీష్ సిసోడియా, మరో 21 మందికి ఉపశమనం కల్పించింది. ఈ సందర్భంగా సిబిఐపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, ఆదివారం జంతర్ మంతర్ వద్ద ఆప్ నిర్వహించిన ర్యాలీలో కేజ్రీవాల్ పాల్గొని ప్రసంగిస్తూ ఎక్సైజ్ పాలసీ కేసులో తనను ఇరికించడానికి ప్రధాని, అమిత్ షా కుట్ర పన్నారని ఆరోపించారు. ఇటీవలి చారిత్రక తీర్పులో కోర్టు తనను 'కట్టర్ ఇమందార్' (కఠినమైన నిజాయితీపరుడు) అని నిరూపించిందన్నారు. అనేక రాష్ట్రాల పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ ప్రధానమంత్రి అందరికీ భయపడుతున్నారని, ఒక నిరంకుశుడు భయపడినప్పుడు అది అతని పాలన ముగింపునకు సంకేతమన్నారు. 'సోనమ్ వాంగ్‌చుక్‌ను జైలుకు పంపారు, ఆమె గొప్ప శాస్త్రవేత్త, పిల్లల విద్య కోసం పనిచేశారు. మహిళా ఎంపిలు తనపై దాడి చేస్తారని భయపడి మోదీ జీ ఒక్క రోజు కూడా పార్లమెంటుకు వెళ్లలేదు. ట్రంప్‌నకు కూడా ఆయన భయపడుతున్నారు' అని కేజ్రీవాల్ అన్నారు. దేశంలో 12 సంవత్సరాల బిజెపి పాలనలో అన్ని రంగాలు నాశనమయ్యాయని, రోడ్లు, ఆరోగ్య సంరక్షణ, విద్య, పారిశుద్ధ్యం వంటి వాటి పరిస్థితి దారుణంగా ఉందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి మండిపడ్డారు. ప్రధాని 'వికసిత్ భారత్' దార్శనికతను విమర్శిస్తూ, ప్రజలు 'రహ్నే లయక్ భారత్' (జీవించదగిన భారతదేశం) కోరుకుంటున్నారని, మోదీ ప్రసంగించిన 'పరీక్ష పే చర్చ' కార్యక్రమాన్ని కూడా విమర్శించారు. ఆయన 'డ్రామా'ను ఆపాలని, పరీక్షలలో పేపర్ లీకేజీలను నివారించడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కేజ్రీవాల్ ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వాన్ని కూడా విమర్శిస్తూ, ఆ పార్టీ సంవత్సరం పాలనలో నగరాన్ని నాశనం చేసిందని, రోడ్లు చెడిపోయాయని, నీటి సరఫరా కలుషితమైందని, వాయు కాలుష్యం కారణంగా ప్రజలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. ప్రధానమంత్రికి దేశంతో సంబంధం లేదని, ఓటర్ల జాబితాల్లో కుట్రలు, తారుమారు ద్వారా మాత్రమే ఆయన అధికారం కోసం ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. 'మోదీ జీ, మీరు అధికారం కోసం పని చేయడం కొనసాగించవచ్చు, నేను దేశం కోసం పని చేస్తూనే ఉంటాను' అని కేజ్రీవాల్ అన్నారు. 'నేను ఐఐటి నుండి మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాను. అమెరికాకు వెళ్ళగలిగేవాడిని, కానీ అందరూ విదేశాలకు వెళితే, దేశాన్ని ఎవరు చూసుకుంటారు అని నేను అనుకున్నాను? నేను ఆదాయపు పన్ను కమిషనర్‌గా పనిచేసినప్పుడు, ప్రజలు నా నిజాయితీపై ప్రమాణం చేసేవారు' అని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 4, 2011న జంతర్ మంతర్ వద్ద సమావేశమైన ప్రజలు గర్జించారని, దీంత ఓకాంగ్రెస్ అధికారం నుండి తుడిచిపెట్టుకుపోయిందని ఆప్ అధినేత గుర్తు చేశారు. ఆప్ ర్యాలీ ఒక చారిత్రాత్మక రోజుగా నిలిచిందని, బిజెపి అధికారం నుండి తొలగించేదంపకు కూడా కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ఆయన చెప్పుకొచ్చారు. ఇంకా ఈ సభలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, మనీష్ సిసోడియా, అతిషి, సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ సహా అనేక మంది సీనియర్ పార్టీ నాయకులు కూడా జంతర్ మంతర్‌లో జరిగిన సభలో ప్రసంగించారు.

## ఢిల్లీలోని ఓ కుటుంబానికి పుదుచ్చేరిని

# ఎటిఎంలా మార్చిన కాంగ్రెస్

### ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపణ



**పుదుచ్చేరి/మధురై :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆదివారం తమిళనాడు, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో పర్యటించారు. పుదుచ్చేరిలో రూ.2,700 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించిన తర్వాత ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో పుదుచ్చేరి రాజకీయ అస్థిరత, అవినీతితో నిండి పోయిందని, ఈ ప్రాంతం ఢిల్లీలోని ఒక కుటుంబానికి ఎటిఎం లాంటిదని ఆరోపించారు. తమిళనాడులో అధికాకర పార్టీ డిఎంకెపై విమర్శలు చేస్తూ ద్రవిడ పార్టీ పాలించే తమిళనాడులో జరుగుతున్న కుంభకోణాల జాబితాను ప్రజలు చూస్తున్నారన్నారు. పుదుచ్చేరిలో గత కాంగ్రెస్ పాలనలో రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేయలేదని, జీతాలు ఆలస్యమయ్యాయని, గూండాలు, మాదకద్రవ్యాల మాఫియాలు వార్డులను పాలించాయని ఆరోపించారు. ఢిల్లీలో ఉన్న ఒక కుటుంబానికి కాంగ్రెస్ పుదుచ్చేరిని ఎటిఎంగా మార్చిందని దుయ్యబట్టారు. పుదుచ్చేరి అభివృద్ధి ప్రయాణంలో కాంగ్రెస్, డిఎంకె 'స్పీడ బ్రేకర్'గా మారాయన్నారు. ఇప్పుడు అవే శక్తులు మళ్ళీ అధికారం కోసం తహతహలాడుతున్నాయని, ఈ యుటిలో నెలలో రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. 2047 నాటికి, పుదుచ్చేరి అభివృద్ధి చెందిన కేంద్రపాలిత ప్రాంతంగా మారాలని, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఈ లక్ష్య సాధనలో ప్రజలతో కలిసి ఉటుందని మోదీ అన్నారు. 'పుదుచ్చేరి వైద్య పర్యాటక కేంద్రంగా మారగలదని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఇప్పటికే తొమ్మిది వైద్య కళాశాలలు ఉన్నాయి' అని ఆయన అన్నారు. కేంద్రం, యుటి ఒకే దృక్పథంతో పనిచేసినందున పుదుచ్చేరి మంచి పాలన, అభివృద్ధిని చూసిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మాత్రమే ఉద్దేశించిన మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయం పథకం కింద పుదుచ్చేరిని చేర్చిందని, ఈ చర్య రోడ్లు సహా మెరుగైన మౌలిక సదుపాయాల ద్వారా యుటి ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని మోదీ అన్నారు. రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి ఎన్ రంగసామి, పుదుచ్చేరి రాష్ట్ర హోదా కోసం డిమాండ్‌ను అంగీకరించాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ పుదుచ్చేరి రాష్ట్ర హోదా కోసం నిరంతరం విజ్ఞప్తి చేస్తోందని, తీర్మానాల ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని ఆయన అన్నారు. పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇవ్వాలని 13 సార్లు అసెంబ్లీలో తీర్మానాలు ఆమోదం పొందాయని, వీటిని కేంద్రానికి కూడా పంపామని రంగసామి గుర్తు చేశారు. రాష్ట్ర హోదా డిమాండ్ పుదుచ్చేరి ప్రజల ఆకాంక్ష అని అన్నారు.

**తమిళనాడులో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ప్రారంభించిన మోదీ**

అభివృద్ధి చెందిన భారత్ కోసం అభివృద్ధి చెందిన తమిళనాడే కేంద్ర ప్రభుత్వ 'సమష్టి లక్ష్యం' అని ప్రధాని మోదీ అన్నారు. సమ్మిళిత అభివృద్ధి, రాష్ట్ర పురోగతిని ప్రారంభించడానికి కేంద్రం పూర్తిగా కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. రూ.4,400 కోట్లకు పైగా విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాత మోదీ ప్రసంగించారు. సమ్మిళిత అభివృద్ధి, రాష్ట్ర పురోగతిని ప్రారంభించడానికి కేంద్రం పూర్తిగా కట్టుబడి ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తమిళనాడుకు గొప్ప చరిత్ర ఉందని, ఆదిచనల్లూర్ వంటి చారిత్రాత్మక ప్రదేశాలను ప్రపంచ వారసత్వ గమ్య స్థానాలుగా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. తమిళనాడు ప్రజలకు ప్రయోజనం చేకూర్చే 9 వందే భారత్ రైళ్లు, 9 అమృత్ భారత్ రైళ్లు ప్రయోజనకరంగా ఉన్నాయని పేర్కొంటూ, వాటి కోచ్‌లు ఐసిఎఫ్‌లో తయారు చేసినట్లు ఆయన చెప్పారు.

# ఈ వారంలో కేరళలో ఎన్నికల కమిషన్ పర్యటన




**న్యూఢిల్లీ :** వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతను అంచనా వేయడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల కమిషన్ ఈ వారం కేరళను సందర్శించనుంది. ఈనెల 5వ తేదీన రాత్రి కమిషన్ కేరళకు చేరుకునే అవకాశం ఉందని, 6, 7 తేదీలలో అధికారిక పర్యటనను ప్రారంభించనున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. కేరళతో పాటు, అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ సన్నద్ధతను అంచనా వేయడానికి ఎన్నికల కమిషన్ (ఇసి) ఇప్పటికే అసోం, తమిళనాడు, పుదుచ్చేరిలను సందర్శించింది. ఏప్రిల్ 14న వచ్చే బిహు పండుగను దృష్టిలో ఉంచుకుని ఈశాన్య రాష్ట్రానికి ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి ఖరారు చేస్తుందని సిఇసి కుమార్ గువాహటిలో విలేకరులతో అన్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే ముందు ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలను ఇసి సందర్శించడం ఆనవాయితీ. మే, జూన్‌లలో ఐదు అసెంబ్లీల పదవీకాలం వేర్వేరు తేదీల్లో ముగుస్తుంది. పుదుచ్చేరి అసెంబ్లీ ఐదేళ్ల పదవీ కాలం జూన్ 15న ముగియనుండగా, అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీల పదవీకాలం వరుసగా మే 20, 23, 10, 7 తేదీలతో ముగుస్తాయి. గతంలో పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు గరిష్ఠంగా ఎనిమిది దశల్లో జరిగాయి. అసోంలో, రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలో ఒకే దశలో ఎన్నికలు జరిగాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల జాబితా తర్వాత ఎన్నికలు జరగనున్న అన్ని రాష్ట్రాలు తమ తుది ఓటర్ల జాబితాను ప్రచురించాయి.

# 225 అంతర్జాతీయ విమానాలు రద్దు

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా భారతీయ విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం పడింది. ఇరాన్, గల్ఫ్ ప్రాంతంలో వైమానిక హద్దులు మూసివేయడం వల్ల విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముంబయి, దిల్లీ విమానాశ్రయాల్లో కలిపి దాదాపు 225 అంతర్జాతీయ విమానాలు రద్దయ్యాయి. పార్కింగ్ స్థలం కొరత కారణంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విమానాలను అనుమతించకూడదని అధికారులు నిర్ణయించారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయంలో 100 విమానాలు రద్దు అయ్యాయి. ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో 125 విమానాలు రద్దు అయ్యాయి. సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖ అంచనా ప్రకారం, ఆదివారం మరో 200 అంతర్జాతీయ విమానాలు రద్దయ్యే అవకాశం ఉంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా విమానాలు గల్ఫ్ దేశాల మీదుగా వెళ్లకుండా దారి మళ్లిస్తున్నారు. ఈ కారణంగా ప్రయాణ సమయం పెరగుతోంది. దీని వల్ల టిక్కెట్ల ధరలు పెరిగే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారు.

# బాధ్యతను ప్రశ్నించిన రాజకీయ నవల 'ఫ్రాంకెన్‌స్టైన్'

కాలాతీత రచన

మరోసారి 'ఫ్రాంకెన్‌స్టైన్' తెరపైకి వచ్చింది. కొత్త టెక్నాలజీ, ఆధునిక విజువల్స్, విమర్శకుల ప్రశంసలు, అవార్డుల అంచనాలు అన్నీ కలిసి వచ్చినా, ఈ కొత్త చిత్రం మేరీ షెల్లీ రాసిన అసలు నవలతో ఉన్న సంబంధం చాలా స్వల్పం. ఈ సినిమాలు ఎక్కువగా రాక్షసుడి భయానక రూపానికే పరిమితం అవుతాయి; కానీ మేరీ షెల్లీ రచించిన 'ఫ్రాంకెన్‌స్టైన్' (ది మోడర్న్ ప్రొమెథెయస్) అనేది రాక్షస కథ కాదు. నిజానికి అది ఒక రాజకీయ నవల. శాస్త్రం...అధికారం...బాధ్యత...సమాజం మధ్య ఉన్న ప్రమాదకరమైన సంబంధాలపై రాసిన తీవ్రమైన ఆలోచనాత్మక రచన. మేరీ గాడ్విన్ షెల్లీ మరణించి 175 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, ఈ నవలని మళ్లీ చదవడం అంటే కేవలం సాహిత్య స్మరణ మాత్రమేకాదు, మన సమకాలీన ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం. 1816లో, కేవలం పద్దెనిమిదేళ్ల వయసులో మేరీ షెల్లీ ఈ నవల ఆలోచనకు బీజం వేసింది. రెండు సంవత్సరాల తర్వాత, 1818లో ఇది ప్రచురితమైంది. ఈ కాలం బ్రిటన్ చరిత్రలో అత్యంత సంక్షుభితమైన రాజకీయ దశ. నెపోలియన్ యుద్ధాల అనంతరం బ్రిటన్ తీవ్ర రాజకీయ సంరక్షణవాదంలోకి జారిపోయింది. ఫ్రెంచ్ విప్లవం తెచ్చిన సమానత్వ, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య ఆలోచనలు ఇంగ్లీష్ ఛానల్ దాటివచ్చి సమాజాన్ని కుదిపేస్తాయేమో అన్న భయం అధికార వర్గాలను వెంటాడింది. ఈ భయమే ఒక అణచివేత వాతావరణాన్ని సృష్టించింది. విప్లవ భావజాలం, మత భేదాభిప్రాయాలు, శాస్త్రంలో కొత్త ఆలోచనలు అన్నీ 'సామాజిక స్థిరత్వానికి ముప్పు'గా ముద్రపడ్డాయి. ప్రత్యేకించి జీవితం అంటే ఏమిటి? అనే ప్రశ్నను శాస్త్రీయంగా పరిశీలించిన సిద్ధాంతాలు తీవ్రమైన విమర్శలకు గురయ్యాయి. జీవితం దేవుడి ప్రత్యక్ష సృష్టి కాదు, శరీరం, అనుభూతి, అనుభవాల సమ్మేళనం అన్న భౌతికవాద ఆలోచనలు, అలాగే ఆది పరిణామ సిద్ధాంతాలు సంప్రదాయ మతవ్యవస్థలకు ప్రమాదకరంగా కనిపించాయి. 'క్వార్టర్లీ రివ్యూ' వంటి పత్రికలు ఈ ఆలోచనలను చర్చి లేదా మతానికి వ్యతిరేకమని, సమాజాన్ని కూల్చివేసే భావజాలమని ఖండించాయి. జీవితం స్వభావంపై జరిగే చర్చలే రాజకీయంగా అనుమానాస్పదంగా మారాయి. దైవదూషణ కేసులు, సెన్సార్ డిమాండ్లు మళ్లీ ఊపందుకున్నాయి. అదే సమయంలో ఆర్థిక కష్టాలు, పారిశ్రామిక మార్పులు, రాజకీయ సంస్కరణల కోసం జరిగిన లడైట్ తిరుగుబాట్లు (1811–1819) ఉద్యమాలు ప్రజల అసంతృప్తిని మరింత పెంచాయి. ఈ నేపథ్యం తెలియకుంటే, 'ఫ్రాంకెన్‌స్టైన్' అర్థం కాదు. అలాగే మేరీ షెల్లీ కుటుంబ నేపథ్యం లేకుండా కూడా ఈ నవలని పూర్తిగా అర్థం చేసుకోలేం. ఆమె తండ్రి విలియం గాడ్విన్, 1790 దశకంలో, ఇంగ్లాండ్‌లో అత్యంత ప్రభావశీలమైన విప్లవాత్మక తాత్వికుడు. ఆమె తల్లి మేరీ వోల్‌స్టోన్‌క్రాఫ్ట్ మహిళా హక్కుల ఉద్యమానికి పునాది వేసిన ఆలోచనకర్త. సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయే 'ఎ విండికేషన్ ఆఫ్ రైట్స్ ఆఫ్ ఉమెన్' (1792) రచయిత్రి. మేరీ వోల్‌స్టోన్‌క్రాఫ్ట్ తన కుమార్తె జన్మించిన కొద్ది రోజులకే మరణించినా, ఆమె ఆలోచనా వారసత్వం మేరీ షెల్లీ రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. కారణం, లింగ సమానత్వం, మానవ పరిపూర్ణత, సామాజిక సంస్కరణ వంటి ఆలోచనలన్నీ మేరీ పెరిగిన ఇంట్లో ఒక భాగం.. సంభాషణలలో కీలక అంశం. 'ఫ్రాంకెన్‌స్టైన్' ఈ వారసత్వాన్నే కొనసాగిస్తుంది. ఈ నవల సమకాలీన శాస్త్రాన్ని తీవ్రంగా పరిగణలోకి తీసుకుంటుంది. జీవితం దైవచర్య కాదు, భౌతిక ప్రక్రియల ఫలితం అన్న భావనను ధైర్యంగా ముందుకు తెస్తుంది. మానవ అభివృద్ధి అనుభూతి, వాతావరణం, అనుభవం వల్ల రూపుదిద్దుకుంటుందన్న ఆలోచనను స్వీకరిస్తుంది. ఇది అప్పటి బ్రిటన్‌లో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న భౌతికవాద ఆలోచనలతో స్పష్టంగా నిలబడుతుంది. పెర్సీ బిష్ షెల్లీ, లార్డ్ బైరన్‌తో కలిసి మేరీ షెల్లీ ఖండాంతర యూరప్‌లో ప్రవాస జీవితం గడపడం కూడా ఈ ఒత్తిడిని ప్రతిబింబిస్తుంది. పెర్సీ షెల్లీ యొక్క నాస్తికత్వం, రాజకీయ రాడికలిజం బ్రిటన్‌ను అతనికి శత్రుత్వభూమిగా మార్చాయి. 1816లో బ్రిటన్ విడిచిన మేరీ, పెర్సీ షెల్లీలు తిరిగి స్వదేశానికి రాలేదు. స్విట్జర్లాండ్ తరువాత ఇటలీ నుంచి బ్రిటిష్ అణచివేతను వీక్షించారు. ఈ ప్రవాసంలోనే పెర్సీ షెల్లీ, బైరన్ తమ అత్యంత విప్లవాత్మక రచనలు చేశారు. అదే సమయంలో మేరీ షెల్లీ 'ఫ్రాంకెన్‌స్టైన్'ను రాసింది. 1816 వేసవిలో జెనీవా సరస్సు ఒడ్డున ఈ నవల ఆవిర్భవించింది. పెర్సీ షెల్లీ, లార్డ్ బైరన్, క్లేర్ క్లెర్మాంట్, బైరన్ వ్యక్తిగత వైద్యుడు జాన్ విలియం పోలీడోరి ... ఈ చిన్న వలయంలోని మేధో సంభాషణలే దీనికి పునాది. ఆ సంవత్సరం వేసవి లేని సంవత్సరంగా ప్రసిద్ధి. అగ్నిపర్వత విస్ఫోటనాల వల్ల వాతావరణం మారి ఎడతెరిపి లేకుండా వర్షాలు. దీర్ఘమైన రాత్రులు ఇంట్లోనే గడపాల్సి వచ్చింది. తాత్విక చర్చలు, ప్రకృతి శాస్త్రం, జీవితం స్వభావంపై సంభాషణలు సాగాయి. జర్మన్ గాథిక్ కథల సంకలనం 'ఫ్రాంకెన్‌స్టైన్' చదివిన తర్వాత, 'ప్రతి ఒక్కరూ భూతాలపై ఒక కథ రాయాలి' అంటూ లార్డ్ బైరన్ ఒక సాహిత్య పోటీ ప్రతిపాదించాడు. ఈ సవాల్ నుంచే రెండు గొప్ప రచనలు పుట్టాయి. మేరీ షెల్లీ 'ఫ్రాంకెన్‌స్టైన్', పోలిడోరి 'ది వాంపైర్' వంటి పుస్తకాలు వెలుగుచూశాయి. పోలిడోరి సృష్టించిన లార్డ్ రుత్వెన్ ఆధునిక సాహిత్యంలో అరిస్టోక్రాటిక్ వ్యాంపైర్ ప్రతీకగా నిలిచాడు. అతడు రక్తాన్ని పీల్చే సామంతుడిగా రూపుదిద్దుకుని, బ్రామ్ స్టోకర్ డ్రాకులాకు మార్గం వేసాడు. ఇది కూడా రాజకీయ ఉపమానాలతో నిండి ఉంది. కానీ మేరీ షెల్లీ భూతకథ పరిమితులను దాటి, శాస్త్రం, అధికారం, బాధ్యత, సామాజిక వెలివేతపై లోతైన తాత్విక నవలగా 'ఫ్రాంకెన్‌స్టైన్'ను మలిచింది. ఈ నవల ప్రపంచ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధ కథలలో ఒకటి. విక్టర్ 'ఫ్రాంకెన్‌స్టైన్' అనే యువ శాస్త్రవేత్త జీవితం పరిమితులను దాటాలన్న తపనతో మృత శరీర భాగాలనుంచి ఒక జీవిని సృష్టిస్తాడు. ఆ జీవి ప్రాణం పోసుకున్న క్షణమే విక్టర్ దానిని తిరస్కరిస్తాడు. బాధ్యతను వదిలేసి పారిపోతాడు.




ఆ జీవి మొదట సహజంగా దయగలది. భాష నేర్చుకుంటుంది, సాహిత్యం చదువుతుంది, మానవ ప్రవర్తనను అర్థం చేసుకుంటుంది. మనుషుల్ని కలవడానికి సన్నద్ధమవుతుంది. కానీ ప్రతిసారీ ఎదురయ్యేది తిరస్కారం, హింస, ద్వేషమే. చివరకు ఈ నిరంతర నిర్లక్ష్యమే దానిని ప్రతీకార మార్గంలోకి నెడుతుంది. జెనీవా, ఇంగోల్‌స్టాడ్ ప్రాంతాలు రాజకీయంగా విరుద్ధ ధ్రువాలుగా నిలుస్తాయి. జెనీవా ఒకవైపు కఠిన కాల్వినిస్టు సంప్రదాయానికి ప్రతీక, మరోవైపు జాన్ జాక్ రూసో వంటి విప్లవాత్మక ఆలోచనలకు పుట్టినిల్లు. ఇది పౌర బాధ్యత, కుటుంబ కర్తవ్యాల మధ్య నలిగిపోయిన విప్లవ సామర్థ్యానికి రూపకం. ఇంగోల్‌స్టాడ్ మాత్రం చీలికకు సంకేతం. బ్రిటిష్ సంరక్షణవాద దృష్టిలో ఈ నగరం అడమ్ వైషాప్ట్ స్థాపించిన ఇల్యూమినాటి ఆర్డర్‌తో విడదీయరాని సంబంధం ఉంది. జాకొబిన్–నాస్తిక కుట్రకు కేంద్రంగా చిత్రీకరించారు. విక్టర్ తన ప్రయోగశాలను ఇక్కడే స్థాపించడం యాదృచ్ఛికం కాదు. అతడి వ్యక్తిగత ప్రయోగం రాజకీయంగా సంచలనమవుతుంది. రహస్యత్వం, ఒంటరితనం, సంస్థలను దాటవేయడం వంటి అంశాలను అప్పట్లో విప్లవాత్మక కుట్రల లక్షణాలుగా భావించేవారు. కాగా, షెల్లీ విక్టర్ వైఫల్యాన్ని జ్ఞానం అన్వేషణలో మాత్రమేగాక, బాధ్యతను వదిలేయడంలోనూ చూపిస్తుంది. 1818 సంచికలో అద్భుతమైన మలుపు ఉంటుంది. నిజమైన ఆలోచనకర్త, నైతిక విశ్లేషకుడు విక్టర్ కాదు, అతడు సృష్టించిన జీవే. విక్టర్ అస్థిరుడు, భావోద్వేగంగా అపరిపక్వుడు, బాధ్యత లేని దేవుడిలా ప్రవర్తిస్తాడు. 'నా కల ముగిసింది, భయంకరమైన జుగుప్స నా హృదయాన్ని నింపింది' అని అతడు ఒప్పుకుంటాడు. ఇది అతడి పతనానికి నిదర్శనం. జీవి మాత్రం శాస్త్రీయ పరిశీలకుడిలా తన అభివృద్ధిని గమనిస్తుంది. అనుభూతి, అనుకరణ, సాహిత్యం ద్వారా నేర్చుకుంటుంది. ప్లూటార్క్, గోథే వెర్తర్, మిల్టన్ ప్యారడైస్ లాస్ట్ తదితర రచనలు చదువుతుంది. ఇది అప్పటి శరీర శాస్త్ర, విద్యా సిద్ధాంతాలకు ప్రతిరూపం. శాస్త్రీయ శ్రద్ధ నైతిక సామర్థ్యానికి దారి తీస్తుందని షెల్లీ సూచిస్తుంది. ఈ విషయంలో జీవి విజయం సాధిస్తుంది, విక్టర్ విఫలమవుతాడు.

షెల్లీ జీవిని పూర్తిగా మానవుడిగా చూపిస్తుంది. సహజంగా మంచివాడు, రహస్యంగా మంచి పనులు చేస్తాడు, కోపాన్ని నియంత్రిస్తాడు. మొదటి మానవ సంపర్కం కూడా తర్కం, కరుణ గెలుస్తాయని ఆశతోనే ప్రయత్నిస్తాడు. కానీ నిరంతర తిరస్కారం, హింసే అతడిని ప్రతీకారానికి నడిపిస్తుంది. ఆడ సహచరి కోసం చేసిన విజ్ఞప్తి సహజ న్యాయం, సామాజికత, పరస్పర ప్రేమపై హక్కుగా నిలుస్తుంది. విక్టర్ ఆస్త్రీని నాశనం చేయడం జీవిని సంపూర్ణ ఒంటరితనానికి నెట్టే ఘట్టం. నవల నిర్మాణం కూడా ఈ విమర్శను బలపరుస్తుంది. ఎలిజబెత్ హత్య తర్వాత పాత్రలు మారుతాయి. విక్టర్ వేటగాడు అవుతాడు, జీవి వేటాడబడినవాడిగా మారుతుంది. చివరి వెంబడింపు ఆర్కిటిక్‌లో జరగడం యాదృచ్ఛికం కాదు. అది రాజకీయ స్తబ్ధత, సంరక్షణవాదానికి సంకేతం. వాల్టన్ ఈ సమాజానికి ప్రతినిధి. చివరి మాటల దగ్గర జీవికే స్థానం దక్కుతుంది. పశ్చాత్తాపం, స్వీయ ఉపసంహరణ ప్రకటిస్తుంది. విక్టర్ మాత్రం ఆత్మవిమర్శ లేకుండా చనిపోతాడు. నిర్లక్ష్యం, ఒంటరితనం, బాధ్యత తిరస్కారం అత్యుత్తమ నైతిక ఆరంభాలనూ నాశనం చేస్తాయని ఈ నవల చెబుతుంది. రాక్షసత్వం జీవి జన్మలో కాదు, 'ఫ్రాంకెన్‌స్టైన్' బాధ్యతల విస్మరణలో ఉందని స్పష్టం చేస్తుంది. 'ది మోడర్న్ ప్రొమెథెయస్' అన్న ఉపశీర్షిక ఇదే రాజకీయ సమస్యను పురాణ స్థాయిలో వ్యక్తపరుస్తుంది. 'నన్ను సృష్టించమని నేను అడిగానా?' అనే ఉపోద్ఘాత వాక్యం మిల్టన్ ప్యారడైస్ లాస్ట్ నుంచి తీసుకున్నారు. ఈ వాక్యం సృష్టికర్త అధికారాన్ని కాకుండా బాధ్యతను ప్రశ్నిస్తుంది. న్యాయానికి, సమానత్వానికి చేసిన విప్లవాత్మక డిమాండ్‌గా ఈ వాక్యాన్ని పేర్కోవచ్చు. ఈ నవల సామ్రాజ్యవాద విస్తరణ ఆశయాలను కూడా ప్రశ్నిస్తుంది. క్లెర్వల్ భారతదేశాన్ని ఉద్ధరించాలన్న ఆలోచన, వాల్టన్ ఉత్తర ధ్రువ యాత్ర వంటి రచనలు ప్రకృతిపై, ప్రపంచంపై అధిపత్య ఆకాంక్షలకు ప్రతీకలు. విక్టర్ ఈ దృష్టికోణం ప్రమాదాలను చూపిస్తాడు. జీవి మాత్రం నియమశీలత, ఆత్మపరిశీలన, నైతిక నియంత్రణను అలవర్చుకుంటాడు. సమాజమే అతడిని హింసాత్మకుడిగా మారుస్తుంది. ఈ జీవి ప్రతిస్పందన ముప్పై ఏళ్ల తర్వాత ఎమిలీ బ్రాంటే వుదరింగ్ హైట్స్‌లోని హీత్‌క్లిఫ్‌ను ముందుగానే సూచిస్తుంది. ఇద్దరూ సమాజపు ద్వంద్వత్వాన్ని బహిర్గతం చేస్తారు. ఈ మహిళా రచయితలు బ్రిటిష్ బూర్జువా సమాజానికి తీవ్రమైన సవాలు విసిరారు. అందుకే 'ఫ్రాంకెన్‌స్టైన్' రాక్షస కథ కాదు. అది అధికారం–బాధ్యత మధ్య ఉన్న ప్రమాదకరమైన విభజనపై రాసిన రాజకీయ, నైతిక, సాహిత్య ఘనకృతి. ఈ రోజున మళ్లీ చదవాల్సిన నవల.

– సత్యశ్రీ

## చదవాల్సిన పుస్తకం

# మట్టి విలువను ఆవిష్కరించిన 'మట్టిమనిషి'



ఆధునిక తెలుగు నవలల్లో గ్రామజీవితం, భూమి–మనిషి సంబంధం, తరాల మార్పులు వంటి అంశాలను సమగ్రంగా ఆవిష్కరించిన రచనల్లో 'మట్టి మనిషి' ఒక విశిష్ట స్థానం పొందింది. డా. వాసిరెడ్డి సీతాదేవి ఈ నవల ద్వారా రైతు జీవితాన్ని కేవలం ఆర్థిక వృత్తిగా కాకుండా, ఒక అస్తిత్వ స్థితిగా చిత్రించారు. భూమి రైతుకు జీవనాధారం. అది అతని గౌరవం. అతని స్వీయ గుర్తింపు. అతని శ్రమకు ప్రతీక. ఈ రచన రైతు జీవితాన్ని మూడు తరాల గమనంలో ఆవిష్కరిస్తూ, భూస్వామ్య వ్యవస్థలోని అసమానతలను, కుటుంబ విలువల మార్పును, సమాజ నిర్మాణంలోని విరోధాలను విశ్లేషిస్తుంది. భూమితో రైతుకు ఉండే అనుబంధం చుట్టూ కథ నడుస్తుంది. కథానాయకుడు సాంబయ్య మట్టితో ఏకమై జీవించే వ్యక్తి. అతని తండ్రి వెంకయ్య పాలేరుగా పని చేసి, కష్టపడి కొంత భూమి సంపాదించి కుటుంబాన్ని నిలబెట్టినవాడు. ఆ శ్రమపరంపరను సాంబయ్య మరింత విస్తరించాడు. చిన్ననాటి నుంచే పొలంలో పెరిగిన అతను, చెమటను మూలధనంగా మార్చుకుంటూ తన భూమిని పెంచుకున్నాడు. భూమి అతనికి కేవలం ఆస్తి కాదు.. అది జీవితం. ఈ మమకారం అతని బలం... అతని బలహీనత కూడా. సాంబయ్య జీవితంలో ఒక కీలక మలుపు అతని భార్య దుర్గమ్మ మృతి. ప్రసవానంతర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను పట్టణానికి తీసుకెళ్లి వైద్యం చేయించడానికి వెనుకాడటం, ఖర్చుపై భయం, చివరకు ఆమె మరణం. ఈ సంఘటన రైతు జీవితంలోని ఆర్థిక సంకుచితతను బహిర్గతం చేస్తుంది. సాంబయ్య క్రూరుడు కాదు...కానీ అతని విలువల క్రమంలో భూమి, ఆర్థిక స్థిరత్వం ముందుంటాయి. కుటుంబ ప్రేమ, వ్యవసాయ దృఢత్వం మధ్య అతను చేసిన ఎంపిక అతని జీవితాన్ని శాశ్వతంగా మార్చుతుంది. తన కుమారుడు వెంకటపతిని చదివించకుండా, నాగలి పట్టించే ప్రయత్నం చేయడం ద్వారా సాంబయ్య భూమి వారసత్వాన్ని కొనసాగించాలని ఆశించాడు. అతని దృష్టిలో చదువు పట్టణ ఆకర్షణకు దారి తీస్తుంది. పట్టణం అంటేనే వ్యవసాయ భూమికి చాలా దూరం. తరాల మార్పు ఇక్కడ స్పష్టమవుతుంది. వెంకటపతి అంతర్గతంగా తండ్రి విలువలను పూర్తిగా స్వీకరించలేదు. వరూధిని అనే యువతి అతని జీవితంలోకి వచ్చిన తర్వాత, ఈ విభేదం బహిర్గతమవుతుంది. వరూధిని గ్రామజీవితాన్ని పరిమితంగా చూస్తుంది. ఆమెకు నగరం స్వేచ్ఛ, విలాసం, అవకాశాల ప్రతీక. శ్రమ కన్నా లాభం, భూమి కన్నా డబ్బు... ఇవి ఆమె దృక్పథం. ఈ విలువల భేదం కుటుంబంలో విరోధానికి దారి తీస్తుంది. వెంకటపతి–వరూధిని జంట సాంబయ్య సంపాదించిన ఆస్తిని నగదు రూపంలోకి మార్చి, పట్టణ జీవనాన్ని ఆశ్రయిస్తారు. మద్యపానం, ఆర్థిక అసంఘటితత్వం, అజాగ్రత్త వంటి కారణాలతో ఆస్తి హరించుకుపోతుంది.




కుటుంబం విచ్ఛిన్నమవుతుంది. వరూధిని ఆత్మహత్య చేసుకుంటుంది. వెంకటపతి జీవితం పతనమవుతుంది. ఇవి వ్యక్తిగత వైఫల్యాల మాదిరిగానే కాకుండా, మారుతున్న సామాజిక నిర్మాణాల సూచనల కోణంలోనూ చూడాలి. ఈ నేపథ్యంలో రవి పాత్ర నవలలో కీలకంగా మారుతుంది. తల్లి దండ్రుల నిర్లక్ష్యంతో దిక్కులేని స్థితిలో ఉన్న బాలుడు, తాత సాంబయ్య వద్దకు చేరుకుంటాడు. సాంబయ్యకు అతను తన వారసత్వానికి చివరి ఆశ. ఆస్తి కోల్పోయిన వృద్ధ రైతు, మనవడిలో తన భవిష్యత్తును చూస్తాడు. ఈ సంబంధంలో రచయిత్రి భావోద్వేగ గాఢతను, మానసిక పరిణామాన్ని సున్నితంగా నిర్మించారు. రవి విద్యావంతుడైనా, పరిస్థితులు అతన్ని మళ్లీ భూమి వైపు నెడతాయి. తాతతో కలిసి బంజరు భూమిని దున్ని పంట పండించడం ప్రారంభిస్తాడు. ఇది వ్యవస్థకు వ్యతిరేకంగా నిలిచే ప్రయత్నం. ఇక్కడ, భూమి దున్నేవాడిదా? లేక పట్టా ఉన్న వాడిదా? అనే ముఖ్యమైన ప్రశ్న ఉద్భవిస్తుంది. కనకయ్య వంటి మధ్యవర్తులు, గ్రామాధికార నిర్మాణాలు, చట్టపరమైన పట్టాలు కలిసి, మూకుమ్మడిగా శ్రమించిన వాడి హక్కును నిరాకరిస్తాయి. పంట పండించిన తర్వాత, అది తమది కాదని తెలిసినప్పుడు, సాంబయ్య గుండె విరిగిపోతుంది. అతని మరణం వ్యక్తిగత విషాదం. ఈ సంఘటన పాఠకుడిలో ఆగ్రహం, బాధ రెండింటినీ కలిగిస్తుంది. రవి చివరికి ప్రతిఘటన దిశగా అడుగులు వేస్తాడు. అతని అరెస్టు, అతని అంతర్గత ఆవేశం గ్రామీణ అసంతృప్తి రాజకీయ రూపం దాల్చే క్షణాలు. రచయిత్రి స్పష్టంగా ఉద్యమాన్ని సూచించకపోయినప్పటికీ, వ్యవస్థపరమైన అన్యాయం ఎలా తీవ్రతకు దారి తీస్తుందో సూచిస్తారు. ఈ విధంగా నవల వ్యక్తిగత కథనాన్ని సామాజిక విశ్లేషణగా విస్తరింపజేస్తుంది. పాత్ర చిత్రణలో సమతుల్యత ఈ రచన బలం. సాంబయ్యను మహోన్నతుడిగా గానీ, వరూధినిని పూర్తిగా దుష్టురాలిగా గానీ చిత్రించలేదు. ప్రతి పాత్ర తన పరిస్థితుల ఉత్పత్తి. సాంబయ్య కట్టుదిట్టత అతని శ్రమదీక్షకు మూలం. అదే కుటుంబ విరోధానికి కారణం. వెంకటపతి బలహీనత అతని వ్యక్తిగత లోపం. విలువల మార్పు ప్రభావం కూడా. వరూధిని ఆశలు ఆధునికత ఆకాంక్షల ప్రతిబింబం. కానీ ఆర్థిక వాస్తవికతను అర్థం చేసుకోలేకపోవడం ఆమె వైఫల్యం. శైలిలో సరళత్వం, ప్రాంతీయ భాష ప్రయోగం నవలకు సహజత్వం ఇస్తాయి. స్థూలంగా చెప్పాలంటే, మట్టి మనిషి రైతు జీవనగాథ... అదే సమయంలో ఒక సామాజిక పత్రిక. భూమి–మనిషి సంబంధాన్ని అస్తిత్వ స్థాయికి తీసుకెళ్లిన రచన. సాంబయ్య జీవితం ద్వారా శ్రమ గౌరవాన్ని, రవి ద్వారా ప్రతిఘటన విత్తనాన్ని, వెంకటపతి–వరూధిని ద్వారా విలువల మార్పు సంక్లిష్టతను రచయిత్రి ప్రతిపాదించారు. నేటి సందర్భంలో కూడా రైతు సమస్యలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ నవల సమకాలీనతను కోల్పోలేదు. శ్రమించిన వాడికి హక్కు ఉండాలనే మౌలిక సూత్రాన్ని ఈ రచన స్పష్టంగా ఉంచుతుంది.

**పుస్తకం పేరు**

**'మట్టిమనిషి'**

రచయిత : డా.వాసిరెడ్డి సీతాదేవి,

వెల: రూ. 400

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

# అక్షర రాగాల కోకిల సరోజిని

'భారత కవికోకిక' సరోజినీ నాయుడు (13 ఫిబ్రవరి,1879– 2 మార్చి,1949) భారతీయ ఆంగ్ల సాహిత్యంలో తిరుగులేని స్థానాన్ని సంపాదించింది. ఆమె రచనలు భావపూర్వకంగా ఉంటాయి. పాటపాడుతున్న రీతిలో, సంగీతపు ఝరి ఆమె పదాల్లో కనిపిస్తుంది. స్పష్టమైన చిత్రణ, భారతీయ సాంస్కృతిక గాఢ అనుబంధంతో సరోజిని ప్రతి రచనా ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఆమె రచనలు పాశ్చాత్య రొమాంటిక్ సంప్రదాయాలను భారతీయ భావాలతో సమన్వయపరచే ప్రయత్నంలో ప్రత్యేకత కలిగిస్తాయి. సరోజిని కవిత్వం 'శ్రావ్యమైన గీతిమయత, భావప్రభావవంతమైన వ్యక్తీకరణ, లోతైన థీమాటిక్ ప్రతిధ్వని'తో ప్రత్యేకంగా ఉంటుంది. ఆమె ప్రధానంగా ప్రకృతి, ప్రేమ, జాతీయత వంటి అంశాలను అవలోకనం చేసింది. శైలి, సాంకేతికతలలో ఆమె కవిత్వం గీతిమయ, సంగీతాత్మక, దృశ్యపూర్ణ చిత్రాలతో సమృద్ధిగా ఉంటుంది. సారళ్యం, ప్రత్యక్ష భాష వాడకం ద్వారా భారతీయ జీవితం స్పష్టంగా కనిపించేలా చేస్తుంది. ఆమె రచనలు బెంగాలీయులను పలకరిస్తాయి. పల్లకీలను స్పృశిస్తాయి. బజార్లలో షికార్లు చేస్తాయి. దైనందిన జీవితంలోని ప్రతి అంశాన్నీ ఆమె భావగర్భితంగా, అందంగా మలచే విధానం అనన్యసామాన్యం. ప్రారంభంలో జాన్ కీట్స్, పిబి షెల్లీ, లార్డ్ టెన్నిసన్ వంటి ఆంగ్ల రొమాంటిక్ కవుల ప్రభావం కనిపించినప్పటికీ, ఎడ్మండ్ గాస్ ప్రోత్సాహంతో సరోజిని భారతీయ అంశాలపై దృష్టి కేంద్రీకరించింది. ఆమె స్వంత కవిత్వ శబ్దాన్ని సృష్టించుకుంది. 'ది గోల్డెన్ త్రెషోల్డ్' (1905) భారతీయ జీవిత సౌందర్యం, భావోద్వేగాలను ప్రతిబింబిస్తుంది. 'ది బర్డ్ ఆఫ్ టైమ్' (1912) రొమాంటిక్, జాతీయ భావనతో కూడిన కవితల సమాహారం. 'ది బ్రోకెన్ వింగ్' (1917) ప్రేమ, జీవితం, స్వాతంత్ర్య పోరాటం అంశాలపై కవితలు. సరోజిని రచనల్లో భారతీయ సాంస్కృతిక లోతైన అవగాహన కనిపిస్తుంది. ఆమె కవిత్వం భారతీయ సమాజంలోని సామాన్య ప్రజలు, అమ్మకాల వాణిజ్యాలు, పండుగలు, సంప్రదాయాల ప్రతిబింబంగా ఉంటుంది. భిన్నత్వంలో ఉన్న ఏకత్వాన్ని ఆమె రచనలు స్పష్టం చేస్తాయి. ప్రత్యేకించి హిందూ–ముస్లింల మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని ఆమె అక్షరాలు ప్రతిబింబిస్తాయి. 'ది బ్యాంగిల్ సెల్లర్స్', 'ఇన్ ది బజార్స్ ఆఫ్ హైదరాబాద్', 'ది పలాన్‌క్విన్ బేరర్స్' వంటి కవితలు రోజువారీ జీవితం, సంప్రదాయాల ప్రాణం, ఊరాజీవితం ఆహ్లాదాన్ని ప్రతిబింబిస్తాయి. ఆమె కవిత్వంలో భారతీయ మహిళా జీవితంపై ప్రత్యేక దృష్టి ఉంది. 'ది పర్దా నహీ' వంటి రచనలలో సాంప్రదాయ, స్వతంత్ర, దేశపరిచయం కలిగిన మహిళా వ్యక్తులను చూపడం ద్వారా, పురాతన సిద్ధాంతాలను ఆధునిక స్వాతంత్ర్య ఉద్యమంతో అనుసంధానం చేస్తుంది. సరోజిని యొక్క వ్యక్తిగత దృష్టికోణం, సాంఘిక, సాంస్కృతిక, జాతీయ అంశాలను ఒకే గాఢ ప్రేమ, అభిమానం, ఐడియలిస్టిక్ పద్ధతిలో ప్రదర్శించడం ద్వారా భారతీయ సాంస్కృతిక అందాన్ని ప్రపంచానికి చూపించడానికి, స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణ ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సరోజిని కవిత్వం లిరికల్ శైలి, భారతీయ సాంస్కృతిక లోతు, ప్రేమ, జాతీయతకు గాఢమైన అనుబంధంతో ప్రత్యేకతను కలిగి ఉంది. ఆమె రచనలు భారతీయ జీవనశైలి, సంప్రదాయాల, మహిళా సాధికారత, స్వాతంత్ర్య భావనలతో భవ్యంగా నిండి ఉంటాయి. ఆమె కవిత్వం భారతీయతను సంగీతాత్మక, చిత్రాత్మక, భావపూర్వకంగా ప్రపంచానికి పరిచయం చేస్తుంది. సరోజిని రచనలు రొమాంటిక్ రియలిజం, ఫోక్, పండుగల, మానవీయ అనుభవాలను కలిగి ఉంటాయి. ఆమె సాంప్రదాయ భారతీయ విలువలను ఆధునిక భావాలతో సమన్వయం చేస్తూ, కవిత్వంలో ఒక శాశ్వతమైన భారతీయతను ప్రతిబింబిస్తుంది. ఆమె కవిత్వం భావప్రధానంగా ఉండి, భారతీయ జీవనానికి, ఊరాజీవితానికి, సాంప్రదాయాలకి గీతిమయతను అందిస్తుంది. ఇలాంటి విశ్లేషణతో, సరోజినీ నాయుడు కవిత్వాన్ని 20వ శతాబ్దంలోని భారతీయ ఆంగ్ల సాహిత్యంలో ఒక అమూల్యమైన, శాశ్వత ప్రాథమిక స్థానం ఉంది.



నేడు వర్ధంతి

# మీడియా.. సాహిత్యం.. సమాజం..

సమాజ నిర్మాణంలో మీడియా, సాహిత్యం అనేవి విడదీయరాని రెండు శక్తులుగా నిలుస్తాయి. అవి స్వరూపంలో భిన్నమైనప్పటికీ, మనుషుల ఆలోచనలను ప్రభావితం చేయడం.. భావాలను వ్యక్తీకరించడం... సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం వంటి లక్ష్యాలు మాత్రం ఒకటే. వీటిలో ఒకటి వేగంగా స్పందించే వ్యవస్థ అయితే, మరొకటి లోతుగా స్పందించే సృజనాత్మక ప్రక్రియ. నేటి కాలంలో మీడియా అనే పదం విస్తృత అర్థాన్ని సంతరించుకుంది. సోషల్ మీడియా, టెలివిజన్, వార్తా సంస్థలు, ఇంటర్నెట్ వేదికలు ఏకమొత్తంగా సమాచార ప్రసారం చేసే సమగ్ర వ్యవస్థగా మారాయి. ఒకప్పుడు మాథ్యూ ఆర్నాల్డ్ మీడియాను హడావిడిలో సాహిత్యంగా పేర్కొన్నాడు. కానీ ఆధునిక కాలంలో పరిస్థితి మారింది. ఇప్పుడు సాహిత్యం కూడా మీడియా ప్రభావంతో వేగంగా ప్రజల్లోకి ప్రవేశిస్తోంది. ఈరోజు ప్రజలు ఎలా ఆలోచిస్తున్నారు, ఏమి అనుభూతి చెందుతున్నారు, ఏ విషయంపై స్పందిస్తున్నారు అనే దానికి మీడియా ప్రధాన ఆధారంగా మారింది. అదే సమయంలో ప్రజల భావోద్వేగాలు, అభిప్రాయాలు, సామాజిక ప్రతిచర్యలను ప్రతిబింబించడం కూడా మీడియా బాధ్యతగా నిలుస్తోంది. రాజకీయాలు, సంస్కృతి, విద్య, వినోదం వంటి ఏ రంగమైనా మీడియా పరిధి వెలుపల లేదు. సమకాలీనత మీడియా ప్రధాన లక్షణం. అందువల్ల సమాజంలో తక్షణ మార్పులను తీసుకురావడంలో దాని ప్రభావం విశేషం. ఒక వార్త, ఒక వీడియో లేదా ఒక సామాజిక ప్రచారం కొన్ని గంటల్లోనే ప్రజల దృష్టిని మార్చగలదు. ఇక సాహిత్యం విషయానికి వస్తే, అది నెమ్మదిగా పనిచేసినా దీర్ఘకాలిక ప్రభావాన్ని కలిగిస్తుంది. కవిత, కథ, నవల లేదా వ్యాసం ద్వారా మనిషి అంతర్మనసును స్పృశించి విలువల మార్పును కలిగించే శక్తి సాహిత్యానికి ఉంది. అయితే నేటి డిజిటల్ యుగంలో సాహిత్యాన్ని చాలామంది యాంత్రిక ఉత్పత్తిలా చూడడం ప్రారంభించారు. సోషల్ మీడియా వేదికల్లో రచనలు వేగంగా పుట్టి వేగంగా మరచిపోతున్నాయి. అయినప్పటికీ నిజమైన సాహిత్యం తన లోతు, భావప్రాప్తి, మానవ అనుభూతులను నిలబెట్టే సామర్థ్యంతో ఎప్పటికీ ప్రత్యేక స్థానం కలిగి ఉంటుంది. మీడియా వేగాన్ని అందిస్తే, సాహిత్యం ఆలోచనకు స్థిరత్వాన్ని అందిస్తుంది. ఈ రెండింటి సమన్వయమే సమాజ అభివృద్ధికి కీలకం.



ఈ వారం కవితలు

## రంగుల పండుగ హోళి



రంగు రంగుల పండుగ హోళి
రంగుల హోళి జీవన కేళి
ప్రాచీనమైన పండుగ హోళి
పాటల పండుగ హోళి
ఆనందాల పండుగ హోళి!!

మోదుగు పూలచే రంగులతో ఆటపాట
పిల్లల పాటల హోళి
పొద్దంతా పాటల పండుగ
రంగుల హరివిల్లు హోళి!!
తెలంగాణ యాసలో పాటల హోళి

వసంత ఋతువు రాకతో వచ్చే పండుగ
పాటలతో మొదలయ్యే పండుగ
పది రోజుల పాటల పండుగ

మగవారు కొలలతో ఆట ఆడే పండుగ
స్త్రీల చప్పట్లతో పాటల పండుగ
ప్రకృతితో ముడిపడిన పండుగ హోలీ
పల్లె పల్లె నా పాటల పండుగ!!

దేవులపల్లి రమేశ్,
9963701294

## ఓ సాహితీ సామ్రాజ్ఞి!

కళ్ళముందుకు వస్తావు,చూపులు పట్టేస్తావు,
దృశ్యాన్ని చూపుతావు,
అందాల బొమ్మను చేయిస్తావు.

తలలోకి దూరతావు,
ఆలోచనలు పారిస్తావు,
భావాన్ని పుట్టిస్తావు,
చక్కని రూపాన్ని ఇప్పిస్తావు.

తెల్ల కాగితాన్ని ఇస్తావు,
కలాన్ని చేత పట్టిస్తావు,
నల్లని అక్షరాల్ని గీయిస్తావు,
కమ్మని కవితను కూర్పిస్తావు.

మట్టి ప్రమిదను అందిస్తావు,
నూనెను నిండుగా నింపిస్తావు,
చిరు దివ్వెను వెలిగిస్తావు,
కాంతి కిరణాల్ని వెదజల్లిస్తావు.

అంధకారమై ఆవరిస్తావు,
జాబిలిని పొడిపిస్తావు,
వెన్నెలను కురిపిస్తావు,
మదులను మురిపింపజేస్తావు.
అసంపూర్ణ వాక్యానివై వస్తావు,
ప్రాసలు చేర్చమంటావు,
అలంకారాలు వాడమంటావు,
అద్భుత కవనాన్ని అల్లిస్తావు.

తేనెచుక్కలు చల్లుతావు,
పెదాలను తెరిపిస్తావు,
స్వరాలను పలికిస్తావు,
మోహన రాగాలు పాడిస్తావు.

హరివిల్లును పొడిపిస్తావు,
ఏడు రంగులను చూపిస్తావు,
కుంచెను చేతబట్టమంటావు,
విచిత్ర చిత్రాన్ని తయారుచేయిస్తావు.

నల్లరాయిని విసురుతావు,
ఉలిని పట్టుకోమంటావు,
బండను చెక్కమంటావు,
సుందర శిల్పాన్ని చేయిస్తావు.

సముద్రానివై వస్తావు,
నదిలా పారమంటావు,
జీవిత పయనం సాగించమంటావు,
నీలో చివరకు కలుపుకుంటావు.

నిశ్శబ్దాన్నై కూర్చుంటే,
నాలో మాటలు మేల్కొలుపుతావు,
నిరాశలోనూ దీపమవుతావు,
జీవితనౌకకు దారిచూపే దిక్సూచివవుతావు.

సాహితీ సామ్రాజ్ఞివై వస్తావు,
సృష్టికి సింహాసనం వేస్తావు,
నా శ్వాసలో శబ్దమవుతావు,
నన్నే నీ కవిగా మార్చుకుంటావు.

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

## శివారు కాలనీలకు డ్రైనేజీ సమస్యలు పరిష్కారం చూపాలి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** బియన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో శివారు కాలనీలకు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మకుటం సదాశివుడు అన్నారు. ఆదివారం హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్ డీజీఎం నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి కాలనీల సమస్యలను వారికి వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, బృందావన్ మెడోస్ కాలనీ అధ్యక్షులు పోనుగుపాటి శశికాంత్, కార్యదర్శి వేణు తదితరులు ఉన్నారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే వారికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా రూరల్ ప్రబారి సామ రంగారెడ్డి అన్నారు. ఆదివారం నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## 'కుమ్మెర' బాధ్యులను శిక్షించాలి

**ప్రజాపక్షం/యాచారం :** కుమ్మెర జాతరలో మొక్కు తీర్చుకొవడానికి పోతే రెండు నెలల పసి కందును బలి తీసుకున్న అగ్రకుల పెత్తందారులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని మాల మహనాడు మండల అధ్యక్షులు మండలి గొపాల్ డిమాండ్ చెశారు. ఆదివారం మండల కేంద్రంలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## కెటిఆర్‌ను కలిసిన అనం శశిధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** కొండాపూర్ డివిజన్ బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అనం శశిధర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లో అనం శశిధర్‌రెడ్డి, ఆయన కుమారుడు అరూష్ రెడ్డి పుట్టినరోజు కూడ ఒకటే రోజు కావడంతో ఇద్దరి జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం అనం శశిధర్‌రెడ్డి తమ కుటుంబంతో వెళ్ళి కెటిఆర్‌ను కలసి ఆయన ఆశీర్వాదాలను తీసుకున్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** సమస్యల పరిష్కరించాలని ఆదిభట్ల సర్కిల్15 తుర్కయంజాల్ డివిజన్ పరిధి శ్రీనివాస సిలికాన్ సిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిరుగుల్ల బ్రహ్మయ్య కాలనీ వాసులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి కాలనీ సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి టి.రమేష్, అధ్యక్షుడు వెంకటేష్, మాజీఅధ్యక్షుడు సుధాకర్‌రావు, రవీందర్‌రెడ్డి, బాపిరెడ్డి, భూపతిరెడ్డి, అర్జున్ రావు, శంకర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## శారదా పీఠానికి కాంగ్రెస్ నేతలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ నియోజకవర్గం పరిధిలోని కోకాపేటలో విశాఖ శారదా పీఠానికి కేటాయించిన భూములను కొనసాగిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం పంపిన సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజుతో కలిసి ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామికి అందజేశారు. జలమండలికి కేటాయించిన శారదాపీఠం భూములను తిరిగి ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆదివారం కె ఎల్ఆర్, గిడుగు రుద్రరాజు శారదాపీఠానికి వెళ్ళి వివాదానికి తెరదించారు.

## వ్యాపారరంగాల్లో రాణిస్తేనే భవిష్యత్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తేనే భవిష్యత్ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పరిగి రోడ్డులో మాజీ సర్పంచ్ సాయిప్రసాద్ యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ స్టోర్‌ను అంజయ్య యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఈట గణేష్, వంకాయల నారాయణరెడ్డి, వేణు గోపాల్, లక్ష్మణ్‌నాయక్, లక్ష్మీ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, ఎస్పీ శివ, యాదయ్య, చెర్క శివ, వినోద, రామస్వామి పాల్గొన్నారు.

### టిజిఎస్‌పిడిసిఎల్ నూతన విధానాలతో

# వినియోగదారుల ఆందోళన

కేటగిరీ-8 కష్టాలు

నాలుగు లక్షలకుపైగా బాధితులు

స్పందించని టిజిఎస్‌పి డిసిఎల్

సోషల్‌మీడియా వేదికగా నిరసన బాట

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** నూతన విద్యుత్ మీటర్ల కోసం ఏకంగా నాలుగు లక్షల మందికి పైగా వినియోగదారులు గ్రేటర్ పరిధిలో ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా కేటగిరి–8 నిబంధనలతో నూతన మీటర్ల విషయంలో నెలకొన్న సమస్యపై 'విద్యుత్ ప్రాథమిక హక్కు.. భారం కాదు' అనే నినాదంతో సోషల్ మీడియా వేదికగా పోరాటం జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది. టిజిఎస్‌పి డిసిఎల్ విధానాలు, నూతన నిబంధనల అమలు పట్ల వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కేటగిరి'8 పేరుతో గృహ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా మాత్రమే ఇవ్వడం, అధిక చార్జీలు, జీటీసీఎస్ నిబంధనలకు విరుద్ధంగా అవసరం లేని డాక్యుమెంట్లు అడగడం, మీటర్ల ఆలస్యం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇంటి నిర్మాణం పూర్తయినా శాశ్వత కనెక్షన్ లేక 'నో మీటర్ నో కనెక్షన్' పరిస్థితి ఏర్పడుతోందని గృహ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా లేక ఇండ్లు అమ్ముడుపోవడం లేదని, నిర్మాణాలు నిలిచిపోతున్నాయని.. ఫలితంగా నిర్మాణ సంబంధిత పనులు చేసే వారు ఉపాధి కోల్పోతున్నారని నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాధారణ గృహ కనెక్షన్ పొందడం, మీటర్ కాలిపోతే తిరిగి అమర్చడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా నూతన ఎండీ జితేష్ వి పాటిల్ కేటగిరి–8పై సమీక్ష చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికారంలోకి వస్తే..విద్యా కమిషన్

## నివేదిక చెత్తబుట్టలో వేస్తాం

బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన సిఫార్సుల నివేదికను మళ్లీ బిఆర్‌ఎస్ అధికారంలోనికి వస్తే చెత్తబుట్టలో వేస్తామని బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు లోప భూయిష్ఠమైన విధానమన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా కమిషన్ నివేదిక ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేవిధంగా ఉందన్నారు. ఆకునూరి మురళి తన ఒళ్ళంతా విషం నింపుకుని నివేదికను రూపొందించారని ఆరోపించారు. ఏ మాత్రం సమీక్షించకుండానే పదేళ్ల కెసిఆర్ పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందని మురళి ఎలా అంటారని ప్రశ్నించారు. విద్యాకమిషన్ రిపోర్ట్ తో కెసిఆర్ ప్రతిష్టను దెబ్బ తీసేందుకు కుట్రకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యా వ్యవస్థలో ఖర్చును ఎలా తగ్గించాలనే ఈ నివేదిను ఇచ్చినట్టుగా ఉన్నదని, మురళికి అప్పగించిన బాధ్యత ఏమిటీ ?, ఆయన చేసింది ఏమిటని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** ఎల్‌బినగర్ నియోజకవర్గం నాగోల్ డివిజన్ పరిధిలోని అనంతుల జంగారెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా,నాగోల్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, నాగోల్ సిఐ మక్బూల్ జానీ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి కాలనీ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి,మాజీ అధ్యక్షులు భాస్కర్,ఉపాధ్యక్షులు రంగారెడ్డి, జనరల్ సెక్రటరీ వెంకటేష్ గౌడ్,జాయింట్ సెక్రటరీ డా.చందు, ఇతర నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి సంఘం సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గంలోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ అమలుతో ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మీకు ఎలాంటి సమస్యలు ఉన్న మా దృష్టికి వస్తే, పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాగోల్ డివిజన్ అధ్యక్షురాలు మంజులా రెడ్డి,చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి,మెగావత్ గణేష్ నాయక్,ఆలయ ధర్మకర్తలు తోకటి కిరణ్,శ్రీనివాస్,నాయకులు సోలిపురం వెంకట్రామ్ రెడ్డి,గాంధీ నాయక్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా జిల్లెల్లగూడలో నిర్వహించిన కీర్తిశేషులు చల్లా పాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాయత్రి బాల్ బాడ్మింటన్ క్లబ్ వారు నిర్వహించిన టోర్నమెంట్‌కు చల్లా నర్సింహారెడ్డి ముఖ్యతిథిగా హాజరై మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కవితబాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్, భాస్కర్, విజయ్ వర్ధన్ రెడ్డి, భాస్కర్, క్లబ్ ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రావు, సభ అధ్యక్షులు మల్లికార్జున, కుమార్, ఆంజనేయులు, నాగేశ్వర్ రావు, జనరల్ సెక్రటరీ ప్రభాకర్, టెంపుల్ డైరెక్టర్ సంతోష్, శేఖర్ రెడ్డి, మురళి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## జెఎన్‌జెఎంఎసిహెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్‌గా కగినికార్ శ్రీకాంత్‌రావు ఎన్నిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యుచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సోసైటీ లిమిటెడ్ (జెఎన్‌జెఎంఎసిహెచ్‌ఎస్‌ఎల్ ) డైరెక్టర్‌గా కగినికార్ శ్రీకాంత్ రావు ఎన్నికయ్యారు. గత నెలలో ఖాళీ ఏర్పడిన జెఎన్‌జెఎంఎసిహెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్ పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో 265 ఓట్లతో కగినికార్ శ్రీకాంత్‌రావు విజయం సాధించారు. ఎన్నికలో 648 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా, ఇందులో మూడుఓట్లు చెల్లుబాటు కాలేదు. పోలైన ఓట్లలో కగినికార్ శ్రీకాంత్ రావు 265 ఓట్లు, కె.మంజులారెడ్డికి 190 ఓట్లు, ఎం.సాగర్ కుమార్‌కు 193 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపు అనంతరం కగినికార్ శ్రీకాంత్‌రావు గెలిచినట్టు ఎన్నికల అధికారి ఎ.వెంకట్‌రెడ్డి ప్రకటించారు.

## ముస్లింల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ముస్లింల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం మున్సిపాలిటి పరిధిలో మిలినియం టౌన్‌షిఫ్‌లో ముస్లిం యువ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్‌లు హాజరయ్యారు. ముస్లింలు ఉపవాస దీక్షలు విరమించిన తరువాత వారికి పండ్లు తినిపంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ముస్లింలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందన్నారు. సమాజంలో సౌభ్రాతృత్వం, సామరస్యం పెంపొంధించడంలో ఇఫ్తార్ విందులు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు జమ్మదఖాన్, మహ్మద్ ఇబ్రహీం, సాదిక్, కబీర్‌లు పాల్గొన్నారు.



## ఆదర్శ మున్సిపాలిటీగా షాద్‌నగర్ అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆదర్శ మున్సిపాలిటీగా షాద్‌నగర్‌ను అభివృద్ధి చేసేందుకు అన్ని విధాల కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అన్నారు. ఆదివారం మున్సిపల్ పాలకవర్గానికి చెందిన గౌడ సోదరులు చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లు రిజ్వాన ముబారక్ అలీఖాన్, జమాల్‌పూర్ సంతోషిబాయ్ చందులాల్, చాకలి పెంటయ్య, రాజునాయక్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మెన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అంధించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. మున్సిపాలిటి పరిధిలోని 28వార్డులకు చెందిన కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వార్డుల్లో మురుగు కాలువలు, సిసి రోడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు చేయడంతోపాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సిలర్లు కృషి చేయాలని ఆకాంక్షించారు. వీధుల్లో ఉన్న రోడ్లను శుభ్రం చేయించి సీజనల్ వ్యాధులు రాకుండా నూతన పాలకవర్గం సభ్యులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలేపల్లి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. కాలనీల్లో ఇప్పటికే దోమల బెడద ఎక్కువగా ఉందని, నియంత్రించేందుకు సాయంత్రం సమయాల్లో ఫాగింగ్ మిషన్‌లో పిచికారి చేయించాలని కోరారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉందని అన్నారు. వార్డుల్లో ఉన్న వృద్దులకు, దివ్యాంగులకు కొత్త పెంచన్లు మంజూరు చేసేందుకు కృషి చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని గౌడ సంఘం నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సోదరులు శ్రీనివాస్ గౌడ్, జి.శ్రీనివాస్ గౌడ్, రవీందర్ గౌడ్, మల్లేష్ గౌడ్, జగన్ గౌడ్, శేఖర్ గౌడ్‌తోపాటు బీసి జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్పలు పాల్గొన్నారు.

## వంగవీటి మోహన్‌రంగా కాంస్య విగ్రహావిష్కరణ



పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వంగవీటి మోహన్‌రంగా ఆశయ సాధనకు కృషి చేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, ఎల్‌బినగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్ లోని కాపు సంఘం భవనం ఆవరణంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా కాంస్య విగ్రహ విష్కరణను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యల కోసం వారు చేసిన కృషిని వారు కోనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు కటికరెడ్డి అరవిందర్‌రెడ్డి, ముద్ద పవన్, సుమంత్, కాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల మరమ్మతుతోనే భూగర్భ జలాల పెంపు



**ప్రజాపక్షం/కొందుర్గు:** చెరువుల మరమ్మతులతోనే భూగర్భ జలాల పెంపు సాధ్యమవుతుందని కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ అన్నారు. ఆదివారం కొందుర్గు గ్రామ పంచాయతీ పరిధిలోని దళితవాడలో ఉన్న మాలకుంట చెరువులో పెరిగిన పిచ్చిమొక్కలను జెసిబి సహాయంలో తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ మాట్లాడుతూ చెరువులో ఒండ్రు మట్టి పెరుకుపోయిందని, దాంతో వర్షపునీరు నిల్వ తక్కువగా ఉంటుందని, మిగిలిన నీరు వృధాగా పోతుందని తెలిపారు. చెరువు లోతు పెంచితే నీటి నిల్వ ఎక్కువగా ఉండి, భూగర్భ జలాలు పెరిగిందుకు అస్కారం ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ నిధులతోనే చెరువులో పెరిగిన పిచ్చి మొక్కలను జెసిబి సహాయంతో తొలగించడంతో దళితవాడ ప్రజలు సర్పంచుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొందుర్గు ఉప సర్పంచ్ చంద్రశేఖర్, వార్డు సభ్యులు వాసూరి, పోమాల సంజీవ, చంద్రశేఖర్, జిల్లెల రమేష్, కూచురి అనంతయ్య, మన్మారి నరసయ్య, పోమల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైద్యంతో వ్యాధులు నయం

**ప్రజాపక్షం/యాచారం:** ప్రకృతి వైద్యంలో అనేక వ్యాధులను తగ్గించుకోవచ్చని సిధార్థ యోగ విధ్యాలయం వైద్యులు,లివింగ్ చార్కు బిరుదాంకితులు డాక్టర్ రామచంద్ర అన్నారు. ఆదివారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో జ్ఞాన సరస్వతీ అలయం ఆధ్వర్యంలో సేవా భారతి ,నేలకొండపల్లి సహకారంతో నిరంతర ఉచిత సేవల కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ఈసంధర్భంగా డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ నేడు సమాజంలో పకృతి వైధ్యానికి ఎంతో ప్రత్యేకత ఉందని తెలిపారు. కాళ్ళలో అనలు, తిమ్మిర్లు, తగించేందుకు కొబ్బరినూనె వినియోగం గురించి వివరించారు. మధుమేహ నియంత్రణకు తిప్పతీగ వినియోగం విధానం గురించి వివరించారు. సాధరణ వ్యాధులకు సహజ చికిత్సలు చేయడం జరగుతుందని తెలిపారు. అందరి వ్యాధులను తెలుసుకోని వారి వివరాలను సెకరించి ప్రతినెల ఒకటి లేదా రెండు పర్యాయాలు ఆలయం ద్వారా ఉచిత సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అలయ వైద్యవిబాగం సమన్వయ కర్తలు ఐలపురం జలంధర్, కొండూరి అంజయ్య, సామ సంతోష్, కొండపురం లక్ష్మణ్, జయేంధర్‌రెడ్డి, వెంకటేశ్, సాయి, శీవాజి, మూడేడ్ల వెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



### డ్రంక్ అండ్ డ్రైవ్..

## 281 మందిపై కేసులు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ఒకటవ ట్రాఫిక్ డిసిపి రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 281 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.224 ద్విచక్ర వాహనదారులు,08 ఆటోలు,42 కార్లు, 07 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే 246మంది 36 ఎం జి /100 ఎంఎల్ నుంచి 200 ఎం జి /100 ఎంఎల్ మధ్య,19 మంది 201 ఎం జి /100 ఎంఎల్ నుంచి 300 ఎం జి /100 ఎంఎల్ మధ్య,16 మంది 301 ఎం జి /100 ఎంఎల్ నుంచి 550 ఎం జి /100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు.మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. గత వారం (23.02.202628.02.2026) లో మొత్తం 218 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో13 మందికి జరిమానా, జైలు శిక్ష,05 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,200 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# డ్రంకన్‌డ్రైవ్‌లో వందల మంది దొరికారు!

## హైదరాబాద్‌లో 506, సైబరాబాద్‌లో 281 కేసులు నమోదు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు భద్రతే లక్ష్యంగా హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వారాంతంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భారీ సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. గత నెల 27, 28 తేదీల్లో చేపట్టిన ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మొత్తం 787 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 506 మంది పట్టుబడగా.. ఇందులో అత్యధికంగా 401 మంది ద్విచక్ర వాహనదారులే ఉండటం గమనార్హం. అలాగే 47 మంది ఆటో డ్రైవర్లు, 57 మంది కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ దొరికిపోయారు. వీరిలో బ్లెడ్ ఆల్కహాల్ గాఢత (బిఎసి) స్థాయి 300 పాయింట్లు దాటిన వారు కూడా 10 మంది ఉన్నారని పోలీసులు తెలిపారు. మరోవైపు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 281 మంది పట్టుబడ్డారు. ఇక్కడ కూడా 224 మంది బైక్ రైడర్లే ఉన్నారు. గత వారం (ఫిబ్రవరి 2328) కోర్టుల్లో హాజరు పరిచిన వారిలో 13 మందికి జైలు శిక్ష పడగా, 5 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ శిక్ష విధించారు. మిగిలిన 200 మందికి జరిమానాలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జీరో టోలరెన్స్ ఉంటుందని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డేవిస్ స్పష్టం చేశారు. ఎవరైనా మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే.. కొత్త చట్టం ప్రకారం భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 105 కింద పదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని సైబరాబాద్ పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## విద్యార్థులు సైన్స్ రంగంలో రాణించాలి



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** విద్యార్థులు సైన్స్ రంగంలో రాణించడం వల్ల జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని శ్రీ శౌర్య పాఠశాల కరస్పాండెంట్ కారుపోతుల వెంకన్న హేమలత అన్నారు. శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు బోడుప్పల్ సర్కిల్ గౌతమ్ నగర్ లోని శ్రీ శౌర్య పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నైపుణ్యాలతో వివిధ రంగాలలోని దాదాపు 70 రకాల సైన్స్ పరికరాలను తయారు చేసి పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. ఇందులో భాగంగా 10వ తరగతి చెందిన కోమల్ రూపొందించిన ఫార్మన్ ప్రొజెక్టర్, 3డి సినిమా, సౌండ్ లైట్స్, దొంగలను గుర్తించే అలారం మొదలైనవి చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కరస్పాండ్ వెంకన్న హేమలత మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసే ప్రయత్నంలోని భాగమే ఈ సైన్స్ ఫయిర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి నీతు కుమారి, సాయినాథ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన క్రియాశీలక ఉద్యమి సభ్యత్వ నమోదు



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని గాయత్రి నగర్ డివిజన్ పనవ్‌నాయుడు, బండారు ప్రసన్న ఆంజనీయులు ఆధ్వర్యంలో జరిగిన జనసేన పార్టీ క్రియాశీలక ఉద్యమి సభ్యత్వ నమోదు శిబిరానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ కార్పొరేషన్ కో ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ జనసైనికులు, వీర మహిళలు బాధ్యతగా గాయత్రి నగర్ డివిజన్ లోని ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించి పార్టీలోకి ఆహ్వానించి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలి దయాకర్, కొల్లా శంకర్, వేముల మహేష్, ప్రభు చైతన్య, రణదీప్, గాయత్రి నగర్ డివిజన్ జనసైనికులు జాలరవి, రామారావు, వీరబాబు, వీర మహిళలు లక్ష్మి, ప్రమీల, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో సైన్స్ దినోత్సవం




**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ఉప్పల్ 2 శాంతి నగర్ బ్రాంచ్ శ్రీ చైతన్య స్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ జియాలజీ విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫసర్ డా॥ సి.హెచ్.వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ ప్రతిభ కనబరచి ప్రతి రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తయారు చేసిన వర్కింగ్ మోడల్స్‌ను ప్రశంసిస్తూ, సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం స్కూల్ ఏజీఎం వెంకట్ రెడ్డి, ఆర్ఐ రవితేజలు విచ్చేసి విద్యార్థులను అభినందించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ విభాగాలకు చెందిన ప్రాజెక్టులు అద్భుతంగా ప్రదర్శించబడ్డాయి. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాధిక మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాస్త్ర సాంకేతిక రంగంలో నైపుణ్యం సాధించేలా వారిని తీర్చిదిద్దడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ యోగి, డీన్ రాజు, ఫ్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్రీజ, ప్రైమరీ ఇంచార్జ్ విష్ణుప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రాములగుట్ట నూతన అధ్యక్షుడిగా చిత్తయ్యగౌడ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్ లోని అతిపురాతణమైన శ్రీ రాములగుట్ట నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా చిత్తయ్యగౌడ్, ఉపాధ్యక్షుడుగా మాడబోయిన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సింగం పవన్‌కుమార్ పటేల్, కోశాధికారిగా లగిశెట్టి అరున్‌పటేల్, సంయుక్త కార్యదర్శిగా తోట ప్రవీన్ పటేల్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వాహకులుగా శివాలయం పూజారి తమ్మలి నాగరాజు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కమిటిని గ్రామపెద్దలు, యువకులు అభినందనలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిపి సింగం సత్యనారయణ పటేల్, మాజి సర్పంచ్ సింగం అంజనేయులు పటేల్, మాజి ఎంపిటిసి పారుపల్లి నాగరాజు, మాజి ఉపసర్పంచ్‌లు కటికెల వైద్యనాద్ ముదిరాజ్, మాడమైన రామకృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా అలియబాద్‌ను అభివృద్ధి చేద్దాం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పార్టీలకతీతంగా అలియాబాద్ మున్సిపాలిటిని అభివృద్ధి చేద్దామని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం అలియాబాద్ మున్సిపల్‌కు నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అలియాబాద్ చైర్‌పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాదవరెడ్డి, ఇతర కౌన్సిలర్లను ఈటలను పూలబొకే, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. రాజకీయాలకు. పార్టీలకతీతంగా అలియాబాద్ మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచుటకు కృషి చేద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు కైర గణేష్, మౌనిక బాబు, జశ్వంత్‌రెడ్డి, మాజి సర్పంచ్ కమఠం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత

కాసోజు నాగజ్యోతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవల 2 నెలల శిశువు పై జరిగిన దారుణ ఘటనను తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కాసోజు నాగ జ్యోతి తీవ్రంగా ఖండించారు. మహిళల పై జరుగుతున్న ఇలాంటి దౌర్జన్యాలు సమాజంలో భద్రతా లోపాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారినికఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయ , ప్రభావశీలుల ఒత్తిళ్లు లేకుండా న్యాయం జరగాలని, బాధితురాలికి సంపూర్ణ రక్షణ, ఉచిత న్యాయ సహాయం, తక్షణ ఆర్థిక మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రతను కల్పించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు చేపడతాం అని మహిళల గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర గర్ల్స్‌కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## రోగులకు మెరుగైన సేవలందించాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. బిజెఆర్ నగర్‌లోని బస్తీ దవాఖానాను ఆదివారం ఉదయం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానాలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కలెక్టర్‌కు జ్వరం, జలుబు ఉండడంతో వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ ఆమెకు మందులు అందచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీ దవాఖానాలకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. వారికి వైద్యం పట్ల నమ్మకం కలిగించాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వైద్యాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. కేంద్రంలోని అన్ని రిజిస్టర్‌లను పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులను పలకరించి అందుతున్న వైద్యసేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ పరీక్షల కోసం పంపిస్తున్న నమూనాలు, స్టోర్‌లో ఉన్న ఔషధ నిల్వలను పరిశీలించారు. దవాఖానా ప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బంధికి సూచించారు. ఈ తనిఖీలో వైద్యారోగ్యశాఖాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి రూ.50లక్షల విరాళం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పటాన్‌చెరువు, ముత్తంగిలోని కర్ధనూర్ గ్రామంలో వందల ఏళ్ళ చరిత్ర కలిగి 'శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయ' అభివృద్ధికి రాజ్ కుమార్ ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్ కుమార్ రూ. 50 లక్ష ల విరాళాన్ని అందజేశారు. వందల ఏళ్ళ చరిత్ర కలిగిన సిద్ధి వినాయక స్వామి ఆల యం శిథిలావస్థకు చేరుకున్నదని, ఆలయ అభివృద్ధికి విరాళం ఇవ్వాలని గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పలువురిని కోరారు. అయితే ఈ గ్రామంలోనే యుకెజి నుంచి 9 వ తరగతి వరకు చదువుకున్న రాజ్‌కుమార్ ఆలయ అభివృద్ధికి ముందుకొచ్చారు. ఈ గ్రామం తనకు సొంత గ్రామం లాటిందని, అందుకే ఆలయ అభివృద్ధికి రూ 50లక్షల విరాళాన్ని ప్రకటించారు. తక్షణమే ఆలయ పనులు మొదలు పెట్టాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. దీనికి సంబంధించిన విరాళాన్ని కూడా అందజేశారు.

## కూకట్‌పల్లిలో సైన్స్ ఎక్స్‌పో

ఆకట్టుకున్న విద్యార్థుల వినూత్న నమూనాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కూకట్‌పల్లిలోని శ్రీ చైతన్య సిబిఎస్‌సి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు రూపొందించిన వివిధ వర్కింగ్ మోడల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనన్య వైద్యశాల చైర్మన్, వ్యవస్థాపకులు డా. ఆనంద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది సైన్స్ దినోత్సవ థీమ్ 'విజ్ఞాన శాస్త్రంలో మహిళలు ఉత్ప్రేరక విక్షిత్ భారత్' ప్రాధాన్యాన్ని వివరించారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకొని, ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే విజయం సాధించగలడని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించిన ఆయన, వారి సృజనాత్మకతను ప్రశంసిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మజ, వైస్ ప్రిన్సిపల్ కాంతి, ఇన్‌చార్జ్‌లు హర్షిణి, అనితతో పాటు ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



## లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం /పరిగి :** పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి మహోత్సవంలో దేవస్థానం 39వ వార్షిక మహోత్సవంలో స్వామి వారి కల్యాణమహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి , ఆయన సతీమణి ఉమా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి అశీస్సులు పొందారు. నిత్య అన్నదన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయత్రం శ్రీవెంకటేశ్వర స్వామి ఉరేగింపు పరిగి పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ఎంతో వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, మున్సిపల్ చైర్మన్ రజిత, వైస్ చైర్మన్ హనుమంతు, గనేమోని శ్రీనివాస్ ,శశికళ తదితరులు పాల్గొన్నారు.



## ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులకు సిపిఐ ఖండన



**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** ఇరాన్ పై ఇజ్రాయిల్, అమెరికా చేపట్టిన దాడులను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండిస్తోందని జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నరు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మధ్యప్రాచ్య ప్రాంతంలో శాంతి భద్రతలను భంగం కలిగించే విధంగా సామ్రాజ్యవాద శక్తు లు వ్యవహరించడం ప్రపంచ శాంతికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని అన్నారు. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్, అమెరికా దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని అన్నారు. ఈ దాడుల వల్ల అమాయక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, సమస్యలను సైనిక దాడుల ద్వారా కాకుండా దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉం దన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న అమెరికా, ఇజ్రాయిల్ చర్యలను ఐక్యరాజ్య సమితి తక్షణమే జోక్యం చేసుకుని ఖండించాలన్నారు. భారత ప్రభుత్వం కూ డా స్పష్టమైన వైఖరి తీసుకుని శాంతి పరిరక్షణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. శాంతి, సౌహార్ధం, ప్రజల జీవన హక్కుల కోసం పో రాడే శక్తులన్నీ ఈ దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలవాలని పిలుపునిస్తున్నామన్నారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నీరాజాబాల్‌రెడ్డి నేడు బాధ్యతలు



**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజాబాల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించున్నారు. గత నెల 26న తాండూరు మున్సిపల్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డి చైర్‌పర్సన్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. మున్సిపల్ చైపర్స్‌గా ఎన్నికైనప్పటికు బాధ్యతలు మాత్రం స్వీకరించ లేదు. సోమవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించున్నారు. అందుకు గాను అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కార్యాలయాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి స్థానిక ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరు కానున్నారు. అధికారులు తెలిపారు.

## మాదిగ అమరవీరుల దినోత్సవం



**ప్రజాపక్షం/దుండిగల్ :** సూరారం మెయిన్ రోడ్డు ఎంఆర్‌పిఎస్ జెండా ఆవరణలో మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ఎంఎస్‌పి పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు రాస మల్ల యాదగిరి మాదిగ ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మాదిగ అమరవీరులు ప్రాణత్యాగం వృధా కాలేదనీ వారి ఆశయ సాధనలో 30 ఏళ్ల సుదీర్ఘ అలుపెరగని పోరాటం వల్ల మందకృష్ణ మాదిగ ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ సాధించి పెట్టడం జరిగిందనీ అలాగే ఎలాంటి ప్రజా సమస్యలు ఉన్న ముందుండే మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంఘీ మహేష్ మాదిగ, కనుమూరి కుర్మయ్య మాదిగ, గడ్డం కురుమయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## గంగా చారిటబుల్ ట్రస్ట్ అన్నదానం




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రతి వారం నిర్వహిస్తున్న మాదిరిగా నేరేడ్‌మెట్ చౌరాస్తా బస్టాప్‌లో శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దీంతో పాటు చలివేంద్ర గోశాల దుప్పట్ల పంపిణీ, నిత్యావసర వస్తువులను సైతం అందచేస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ బాల మల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌కు చెందిన అనిల్, లక్ష్మి , సురేష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ మంటపం గ్రౌండ్ ఫ్లోర్ ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వినాయకనగర్ డివిజన్‌లోని సమతానగర్‌లో సాయిబాబా ఆలయ కమిటి నూతనంగా నిర్మించిన మూడంతస్తుల కళ్యాణ మండపం గ్రౌండ్ ఫ్లోర్‌ను మాజీ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, దాతలు, బిజెపి నాయకులు ఓం ప్రకాష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతమ జీవితం

అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైస

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 367వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మాదిగ వర్గీకరణలో అమరులైన ఎమ్మార్పీఎస్ నాయకులకు అంబేద్కర్ ఆశయ సాధన సంఘం తరపున నివాళులర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధికంగా యువత గల దేశం మన భారతదేశం. కాబట్టి యువత మెరుగైన విద్యను అభ్యసించినప్పుడే ఆయా రంగాలలో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసి, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం మెరుగైన వసతులు కల్పించినప్పుడు, దళిత బహుజన, గిరిజన, విద్యార్థులు ఉన్నతమైన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. విదేశాలలో విద్యావ్యవస్థ ఆదర్శంగా తీసుకుని భారత దేశంలో విద్యా వ్యవస్థను మెరుగుపరచాలని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, గరుగుల యాకయ్య, వై.శ్రీనివాస్, జి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** బోయిన్‌పల్లి డివిజన్‌కు చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.శివానంద్ ఆదివారం వందలాది బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జీ బండి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గత కొంత కాలంగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల్లో నమ్మకం కోల్పోవడం అలాగే ఆ పార్టీలో అంతర్గత కలహాలు పెరిగి అనిశ్చితి నెలకొనడంతో సరైన నాయకత్వం లేకపోవడం వల్ల నాయకులకు, కార్యకర్తలకు రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం వల్ల దిక్కుతోచని పరిస్థితితో ఉన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ బలపడుతుండడం, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల హృదయాలను గెలుచుకోవడం అలాగే జరుగుతున్న ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుండడం చూసి పార్టీకి ఆకర్షితులై భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల కోసం అహర్నిశలు పని చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ, నిరంతరం ప్రజా సంక్షేమం కోసమే పని చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజల కోసం మరిన్ని అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని, ఇప్పటికే దేశంలోనే తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు పరచడంలో మొదటి స్థానంలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, నాగిరెడ్డి, దండుగల యాదగిరి, శేరి సతీష్‌రెడ్డి, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, రమేష్, రాజేందర్, అస్లాం, అశోక్, మల్లికార్జున, శ్రీరాములు, లక్ష్మయ్య, రమేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సెమీస్‌కు దూసుకెళ్లిన భారత్



చావోరేవో పోరులో భారత జట్టు పంజా విసిరింది. జింబాబ్వేపై విజయంతో సెమీస్ రేసులో నిలిచిన టీమిండియా.. ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌ను చిత్తుచేసింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో సంజూ శాంసన్(97 నాటౌట్) అర్ధ శతకంతో విరుచుకుపడగా విండీస్ ఆశలు ఆడియాశలయ్యాయి. ఆఖరిలో పాండ్యా(17) ఔటౌనా.. శివం దూబే(8 నాటౌట్) అండగా సంజూ లాంఛనం ముగించాడు. దాంతో.. గ్రూప్‘ఏ’ నుంచి టీమిండియా రెండో బెర్తు ఖరారు చేసుకోగా, రెండుసార్లు ఛాంపియన్ వెస్టిండీస్ ఉసూరుమంటూ టోర్నీ నుంచి నిష్క్రమించింది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు ఆ ట్యాగ్‌ను నిలబెట్టుకుంటూ సెమీస్‌కు దూసుకెళ్లింది. సూపర్–8లో దక్షిణాఫ్రికా చేతిలో అనూహ్య ఓటమితో బ్యాటింగ్ కూర్పును మార్చుకున్న టీమిండియా.. వరుసగా రెండు విజయాలతో ముందంజ వేసింది. ఈడెన్ గార్డెన్స్లో వెస్టిండీస్ నిర్దేశించిన 196 పరుగుల ఛేదనలో ఓపెనర్ సంజూ శాంసన్(97 నాటౌట్) అర్ధ శతకంతో చెలరేగగా లక్ష్యాన్ని ఉఫ్మనిపించింది. పొట్టి కప్ చరిత్రలో రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన భారత్.. 5 వికెట్లతో కరీబియన్ జట్టును ఓడించి ఇంటికి పంపింది.

**అభిషేక్, ఇషాన్ విఫలమైనా..** వెస్టిండీస్ నిర్దేశించిన భారీ ఛేదనలో భారత పవర్ ప్లేలోనే రెండు బిగ్ వికెట్లు కోల్పోయింది. ఫామ్లోకి వచ్చినట్టే అనిపించిన అభిషేక్‌శర్మ(10) పేలవ షాట్‌తో పెవిలియన్ చేరాడు. అకీల్ హొసేన్ వేసిన తొలి ఓవర్లో ఏమాత్రం తొందరపడని అభిషేక్.. చివరకు అతడి ఉచ్చులో పడ్డాడు. అంతకు ముందు సంజూ శాంసన్(97 నాటౌట్) లెగ్ సైడ్ రెండు భారీ సిక్సర్లు సంధించాడు. అభిషేక్ సైతం పెద్ద షాట్‌కు యత్నించి.. ఫ్మార్ చేతికి దొరికాడు. ఆ తర్వాత వస్తూనే రెండు ఫోర్లతో అలరించిన ఇషాన్ కిషన్(10)ను హోల్డర్ బోల్తా కొట్టించాడు. సంజూకి జతగా కెప్టెన సూర్యకుమార్ యాదవ్(18) నిలబడగా.. పవర్ ప్లే చివరి ఓవర్లో శాంసన్ బౌండరీతో స్కోర్ 50 దాటింది. 6 ఓవర్లు పూర్తయ్యే సరికి స్కోర్ 35 బంతుల్లోనే 48 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని షమర్ జోసెఫ్ విడదీశాడు. రూథర్‌ఫోర్డ్ డైవ్ చేస్తూ చక్కని క్యాచ్ అందుకున్నాడు. షమర్కు చుక్కలు చూపిస్తూ సంజూ స్ట్రెయిట్ బౌండరీ బాదగా.. తిలక్ వర్మ(27) వరుసగా మూడు ఫోర్లు రాబట్టాడు. హోల్డర్ ఓవర్లో బౌండరీ బాదిన తిలక్.. అదే ఊపులో షాట్ ఆడి ఫ్మార్ స్టన్నింగ్ క్యాచ్కు వెనుదిరిగాడు. అప్పటికీ 32 బంతుల్లో 55 రన్స్ కావాలి. దూకుడ పెంచిన హార్దిక్ పాండ్యా (17)ను షమర్ వెనక్కి పంపిన తర్వాత వచ్చిన శివం దూబే(8 నాటౌట్) రెండు ఫోర్లతో.. భారత్ విజయానికి చేరువైంది. రొయారియో షెపర్డ్ వేసిన తొలి బంతిని సంజూ లెగ్ సైడ్‌లో సిక్సర్‌గా మలిచాడు. అంతే.. స్కోర్లు సమం అయ్యాయి. తర్వాతి బంతిని బౌండరీకి పంపిన శాంసన్ భారత్‌ను 5 వికెట్ల తేడాతో గెలిపించాడు.

**ఛేజ్, హోల్డర్ మెరుపులు...** చావోరేవో పోరులో వెస్టిండీస్ సమిష్టి కృషితో భారత్‌కు భారీ స్కోర్‌తో సవాల్ విసిరింది. ఓపెనర్ రోస్టన్ ఛేజ్(40) శుభారంభమిచ్చినా.. జస్‌ప్రీత్ బుమ్రా(236) విజృంభణతో ఒకే ఓవర్లో రెండు బిగ్ కోల్పోయిన విండీస్.. రొవ్మన్ పావెల్(34 నాటౌట్), జేసన్ హోల్డర్(37 నాటౌట్)ల విధ్వంసంతో కోలుకుంది. అర్ష్‌దీప్ సింగ్ ఓవర్లో 24 రన్స్ పిండుకోగా.. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో బుమ్రా 14 పరుగులే ఇవ్వడంతో విండీస్ 195కే పరిమితమైంది.

# జింబాబ్వేపై విజయం.. సెమీస్‌కు దక్షిణాఫ్రికా



పొట్టి ప్రపంచకప్‌లో ఆధిపత్యం కొనసాగిస్తున్న దక్షిణాఫ్రికా అజేయంగా సెమీస్‌కు దూసుకెళ్లింది. నాకౌట్ దశలో బలమైన భారత్, వెస్టిండీస్‌లను చిత్తు చేసిన సఫారీ టీమ్.. ఆదివారం చివరి మ్యాచ్‌లోనూ పంజా విసిరింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జింబాబ్వేను వణికిస్తూ.. 5 వికెట్లతో జయభేరి మోగించింది. స్వల్ప ఛేదనలో డెవాల్ బ్రెవిస్(41) రెచ్చిపోగా.. జార్జ్ లిండే (30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో విజయతీరాలకు చేర్చారు. రెండేళ్ల క్రితం బార్బడోస్‌లో చేజారిన ప్రపంచకప్‌ను పట్టేసేందుకు దక్షిణాఫ్రికా ఒక్కో అడుగు బలంగా వేస్తోంది. లీగ్ దశను అజేయంగా.. అపై నాకౌట్లోనూ వరుస విజయాలతో గ్రూప్–ఎ నుంచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన ఆ జట్టు చివరి మ్యాచ్‌లోనూ గర్జించింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జింబాబ్వేను ఉతికేసింది. తొలుత ప్రత్యర్థిని 153కే కట్టడి చేసిన సఫారీలు.. ఆపై ధనాధన్ ఆటతో లక్ష్యాన్ని కరిగించారు. డెవాల్ బ్రెవిస్(0 తన స్టయిల్ విధ్వంసంతో విరుచుకపడి జింబాబ్వేను ఒత్తిడిలో పడేశాడు. సికిందర్ రజా(329) విజృంభణతో టాపార్డర్ కుప్పకూలినా.. జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో ప్రొటీస్ విజయాన్ని పరిపూర్ణం చేశారు. దాంతో.. 5 వికెట్ల తేడాతో గెలుపొందిన మర్క్రమ్ సేన ఏడు విజయాలతో సెమీస్ సమరానికి సై అంటోంది.

**18కే మూడు వికెట్లు...** ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ క్వింటన్ డికాక్(0)ను వెనక్కి పంపిన సికిందర్ రజా(329) వికెట్ల వేట కొనసాగిస్తున్నాడు. స్లో డెలివరీతో ఎడెన్ మర్క్రమ్(4)ను బౌల్ చేసిన జింబాబ్వే సారథి.. సఫారీ హిట్టర్లను నిలువరిస్తున్నాడు. 18కే మూడు వికెట్లు పడినా.. డెవిడ్ మిల్లర్(22), డెవాల్ బ్రెవిస్(41)లు దూకుడైన ఆటతో జింబాబ్వే బౌలర్లను హడలెత్తించారు. మిల్లర్ను ముజరబని బోల్తా కొట్టించగా.. సిక్సర్లతో చెలరేగుతున్న బ్రెవిస్ను రజా పెవిలియన్ చేర్చాడు. దాంతో.. 101 వద్ద దక్షిణాఫ్రికా ఐదో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత జార్జ్ లిండే(30 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్(21 నాటౌట్)లు ఆచితూచి ఆడారు. మరో వికెట్ పడకుండా చూసుకుంటూనే.. 50 ప్లస్ భాగస్వామ్యంతో 17.5 ఓవర్లలోనే మ్యాచ్ను ముగించారు. లీగ్ ఆసాంతం.. ఆపై.. నాకౌట్ తొలి రెండు మ్యాచుల్లో శుభారంభాలు ఇచ్చిన బంగ్లాదేశ్ ఓపెనర్లు దక్షిణాఫ్రికాపై మాత్రం తేలిపోయారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(15), మరుమని(7)లు విఫలమవ్వడంతో జట్టును ఆదుకునే బాధ్యత తీసుకున్నాడు కెప్టెన్ సికిందర్ రజా74). సఫారీ పేస్, స్పిన్ దళాన్నిదీటుగా ఎదుర్కొన్న అతడు.. జట్టు స్కోర్ 120 దాటించి వెనుదిరిగాడు. ఆఖర్లో మెరుపులతో జింబాబ్వే ప్రత్యర్థి ముందు 154 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది.

# ఆరోగ్యం

# ఎండలతో జాగ్రత్త!

ఏడాది మన దేశంలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలతో కూడిన వేసవి తప్పదని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరిస్తున్నది. తాజా ప్రకటనను అనుసరించి, ఈ ఏడాది మార్చి నుంచి మే వరకూ దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ హీట్‌వేవ్ రోజులు నమోదయ్యే అవకాశం ఉంది. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, బిహార్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు తీవ్ర ఉష్ణ ప్రభావానికి గురయ్యే అవకాశముంది. ఈ పరిస్థితి కేవలం వాతావరణ మార్పు అంశంగా మాత్రమే కాకుండా ప్రజారోగ్యం, నీటి వనరులు, విద్యుత్ వినియోగం, పట్టణ జీవన విధానంపై ప్రత్యక్ష ప్రభావం చూపే సామాజిక సమస్యగా మారుతోంది. ప్రధానంగా ఆరోగ్య సమస్యలపై అంతర్జాతీయ సమాజం దృష్టి కేంద్రీకరించింది. ప్రజలంతా ఇబ్బందులు ఎదుర్కొంటారని, ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, బయట పనిచేసే కార్మికులపై ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరిస్తున్నది. నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు వంటి అసంఘటిత రంగానికి చెందిన వారు అధిక వేడి కారణంగా ఆరోగ్య సమస్యలతో పాటు ఆదాయ నష్టాన్ని కూడా ఎదుర్కొంటున్నారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యుఎన్ఇపి) వాతావరణ మార్పు విభాగం డైరెక్టర్ మార్టిన్ క్రౌజ్ పేర్కొన్నట్లుగా, చల్లదనం పొందే సౌకర్యం ధనికుల ప్రత్యేక హక్కు కాకూడదు. అది ఆరోగ్యం, గౌరవానికి సంబంధించిన ప్రాథమిక అవసరం. అధిక ఉష్ణోగ్రతల సమయంలో శరీర శక్తి తగ్గిపోవడం వల్ల పనితీరు పడిపోతుంది, దీని ప్రభావం కుటుంబాల ఆర్థిక స్థితిపై కూడా పడుతుంది. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా ‘బీట్ ద హీట్’ అనే కార్యక్రమం ప్రారంభమైంది. నగరాల్లో ఉష్ణ ప్రభావాన్ని తగ్గించే స్థిరమైన పరిష్కారాలను అమలు చేయడం దీని ప్రధాన లక్ష్యం. ఇప్పటికే ప్రపంచంలోని 40కిపైగా దేశాల్లో 230కి పైగా నగరాలు ఈ కార్యక్రమంలో భాగమయ్యాయి. భారతదేశం నుంచి కూడా అనేక నగరాలు చేరడం గమనార్హం. ఈ కార్యక్రమం కింద సూచిస్తున్న పరిష్కారాలు సాంకేతికంగా క్లిష్టమైనవేమీ కావు. కానీ సమర్థవంతమైనవి. ప్రతిఫలించే పదార్థాలతో పైకప్పులు నిర్మించడం, గాలి ప్రవాహం మెరుగుపరచడం, కిటికీలకు నీడ ఏర్పాట్లు చేయడం, నగరాల్లో చెట్లు పెంచడం వంటి సహజ శీతలీకరణ విధానాలు గదుల ఉష్ణోగ్రతను సుమారు మూడు డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గించగలవని




నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎయిర్ కండీషనర్లపై ఆధారపడకుండా ఈ మార్పులు సాధ్యమవుతాయి, తద్వారా విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా తగ్గుతుంది. భవన నిర్మాణ దశలోనే ఈ విధానాలను అమలు చేస్తే ఖర్చు కేవలం మూడు నుంచి నాలుగు శాతం మాత్రమే పెరుగుతుందని, కానీ దీర్ఘకాలంలో విద్యుత్ ఖర్చులు తగ్గడం వల్ల ఆ పెట్టుబడి తిరిగి లాభంగా మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

## వేసవిలో ఆరోగ్య సంరక్షణ..



ఈసారి దేశంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యం లో, ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలి. అలాంటి వాటిలో ప్రధానమైనది నీరు తాగడం. వేసవి కాలంలో శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అత్యంత ప్రాథమికమైన, శాస్త్రీయంగా నిరూపితమైనది హైడ్రేషన్. అధిక ఉష్ణోగ్రతల సమయంలో మన శరీరం చెమట రూపంలో నీరు, ముఖ్యమైన లవణాలను కోల్పోతుంది. దాహం అనిపించడం అనేది ఇప్పటికే శరీరం నీటి కొరతను అనుభవిస్తున్న సంకేతం. అందుకే దాహం కోసం ఎదురుచూడకుండా రోజుకు కనీసం 2–3 లీటర్ల నీటిని తరచుగా తాగడం అవసరం. నీటితో పాటు సహజ శీతల పానీయాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణం వంటి పానీయాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను నిలుపుతూ అలసటను తగ్గిస్తాయి. ముఖ్యంగా బయట పని చేసే వారు, పిల్లలు, వృద్ధులు ఇవి తప్పనిసరిగా తీసుకోవాలి. పుచ్చకాయ, కర్బూజా, ద్రాక్ష, అనాస, దోసకాయ వంటి పండ్లు శరీర ఉష్ణోగ్రతను సహజంగా తగ్గించడంలో సహాయపడతాయి. సరైన హైడ్రేషన్ వల్ల రక్త ప్రసరణ సమతుల్యం అవుతుంది, తలనొప్పి, అలసట, మైకం వంటి సమస్యలు తగ్గుతాయి. ఇది హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్ వంటి తీవ్రమైన పరిస్థితులను నివారించడంలో మొదటి రక్షణ రేఖగా పనిచేస్తుంది.

## వేడి ప్రభావం నుంచి శరీరాన్ని రక్షించుకోవడం




తీవ్ర వేసవిలో బయట గడిపే సమయం ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ముఖ్యం గా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సూర్యరశ్మి అత్యధికంగా ఉంటుం ది. ఈ సమయంలో బయటకు వెళ్లడం సాధ్యమైనంతవరకు నివారించడం ఉత్తమం. అవసరమైతే మాత్రమే బయటకు వెళ్లాలి. బయటికి వెళ్లేటప్పుడు ధరించే దుస్తులు కూడా శరీర ఉష్ణ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. పలుచని, లేత రంగుల, విస్తారంగా ఉండే పత్తి బట్టలు చెమట ఆవిరైపోయేందుకు సహాయపడతాయి, తద్వారా శరీరం చల్లబడుతుంది. తలపై నేరుగా పడే సూర్యకిరణాలు శరీర ఉష్ణోగ్రతను వేగంగా పెంచుతాయి. అందుకే గొడుగు, టోపీ లేదా దుపట్టా ఉపయోగించడం అవసరం. చర్మాన్ని సూర్యకిరణాల నుంచి రక్షించడానికి ఎస్‌పిఎఫ్ 30 లేదా అంతకంటే ఎక్కువ స్థాయి సన్‌స్క్రీన్ ఉపయోగించడం మంచిది. అలాగే చెప్పులు లేకుండా వేడి నేలపై నడవడం ప్రమాదకరం. వేడి ఉపరితలాలు శరీరంలో వేడి నిల్వను పెంచుతాయి. ఒక్కోసారి కాలిన గాయాలు కూడా ఏర్పడతాయి. తరచుగా నీరు తాగుతూ నీడలో విశ్రాంతి తీసుకోవడం, శారీరక శ్రమను తగ్గించడం ద్వారా వేడి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఈ చిన్న జాగ్రత్తలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించడంలో కీలకంగా పనిచేస్తాయి.

## ప్రజా పోరాటాలు కొనసాగిస్తాం

సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గం, మండల కార్యదర్శుల సమావేశం ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ రాబోయే కాలంలో ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని, జిల్లావ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అనునిత్యం వారికి అండగా ఉంటూ పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. జిల్లాలో రైతాంగం, వ్యవసాయ కూలీలు, కార్మికులు, విద్యార్థులు ఉద్యోగుల కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. రాబోయే ఎంపిటిసి. జడ్‌పిటిసి ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**సిపిఐ కౌన్సిలర్లకు ఘన సన్మానం..** సమావేశంలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో 33వ వార్డులో బి.అజయ్ సారథిరెడ్డి, 18వ వార్డులో రేశపల్లి నవీన్, 25వ వార్డులో నర్రా సంధ్యా శ్రావణ్ ఘన విజయం సాధించడంతో వారిని సిపిఐ జిల్లా పార్టీ పక్షాన శాలువాలు కప్పి బొకేలుతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, నెల్లూరి నాగేశ్వరరావు, తండా సందీప్, బైస స్వామి, జంపాల వెంకన్న, సారిక శ్రీనివాస్, బందు మహేందర్, మారగాని బాలకృష్ణ, జంపాల వెంకన్న పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులు హరిస్తున్న నూతన లేబర్ కోడ్‌లు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తొలగించి పాలకులు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు ఆరోపించారు. కార్మిక చట్టాల రద్దు, లేబర్ కోడ్స్ కారణంగా శ్రమ దోపిడీ పెరగడంతో పాటు పని భద్రత కరువైందన్నారు. ఎఐటియుసి జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశంలో శింగు నర్సింహారావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల కారణంగా సమ్మె హక్కును, సంఘాన్ని స్థాపించే హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే కనీసం న్యాయస్థానానికి వెళ్లే అవకాశం లేకుండా లేబర్ కోడ్‌లను రూపొందించారని ఆయన తెలిపారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పిట్టల మల్లయ్య, జాకీరుద్దీన్, పేరబోయిన మోహన్‌రావు, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయాన్ని దెబ్బతీసే భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ ఆరోపణ



**ప్రజాపక్షం/వికారాబాద్ :** మన దేశ వ్యవసాయాన్ని దెబ్బ తీసే భారత్–అమెరికా వాణిజ్య ఒప్పద్దంపై సంతకం పెట్టొద్దని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రుణమాఫీ చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, పంటలకు బీమా పథకాన్ని అమలు చేయాలన్న డిమాండ్లపై ప్రచారం కార్యక్రమాన్ని ఆదివారం వికారాబాద్ జిల్లాకేంద్రంలోని మార్కెట్ యార్డులో బహిరంగ సభ నిర్వహించారు. వికారాబాద్ మండల పరిధిలోని సిద్దులూర్, జైదుపల్లి, కేరెల్లి గ్రామాలలో సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం– అమెరిక వాణిజ్య ఒప్పందంతో పాటు ఇతర కీలక సమస్యలపై విజయం సాధించే వరకు దేశవ్యాప్తంగా ఐక్యపోరాటాలకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు వికారాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రలంలోని గ్రామాలలో పాదయాత్ర నిర్వహించారు. భారత–అమెరిక వాణిజ్య ఒప్పదంపై సంతకం చేయొద్దని, విద్యుత్ బిల్లును తిరస్కరించాలని, విత్తన బిల్లు, నాలుగు కార్మిక కోడ్‌లు, వీబీజీ రామ్‌జీ చట్టం రద్దు, ఎంఎస్‌పి సి 2+50శాతం కోసం చట్టపరమైన హామీ, రుణమాఫీ. భూసేకరణచట్టం 2013 అమలు వంటి ప్రధాన డిమాండ్లు సాధించేవరకు స్వతంత్ర పోరాటాలను, అలాగే కార్మిక సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలను తీవ్రతరం చేయాలని కోరారు. రాష్టపతికి బహిరంగ లేఖలను పంపడానికి రైతులు పోస్టాఫీసులకు ఊరేగింపులు నిర్వహించాలన్నారు. సోయాబీన్, పత్తి, మొక్కజోన్న వంటి ప్రభావిత పంటలను పండించే గ్రామాల్లో ప్రచారాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రాల ముఖ్యమంత్రిలకు, ప్రతిపక్షనేతలకు కిషన్ మోర్చా నాయకులు కలిసి రైతాంగం డిమాండ్లపై మద్దతు ఇవ్వాలని కోరతామన్నారు. గ్రామగ్రామాన కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృతంగా ప్రచారం చేసి రైతాంగాన్ని చైతన్యవంతం చేయడంతోనే రైతు వ్యతిరేక విధానాలను ఓడించగలుగుతామన్నారు. ఈ ఒప్పదంతో దేశ రైతాంగానికి జరగబోయే ప్రమాదం గురించి వివరించాలన్నారు. రాష్టపతికి వినతిపత్రాలపై సంతకాలు, కేంద్రపాలకుల రైతు వ్యతిరేక విధానాలను ఓడించటానికి జరిగే కార్యక్రమంలో రైతులు పాల్గొనాలని కోరారు. మార్చి 9న కార్మిక, రైతు పార్లమెంట్, మార్చి నుంచి ఏప్రిల్ 13వరకు దేశవ్యాప్తంగా మహపంచాయత్‌లు నిర్వహించాని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ కమిటీ కార్యదర్శి టి.సాగర్ కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, పట్లోళ్ల నాగిరెడ్డి, విజయలక్ష్మి పండిట్, ప్రభులింగం మాట్లాడగా, నాయకులు సురేష్ కుమార్, మైహిపాల్, గీత, మహేందర్, వెంకన్న, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఉద్యమించాల్సిందే



డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్ల అమలు, భూ, విద్యా హక్కుల కోసం దేశ వ్యాప్తంగా సామాజిక ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని, దీని కోసం కదలి రావాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపిచ్చారు. దళితులపై అన్యాయాలు, అణచివేతలను అరికడుతూ సామాజిక న్యాయం కల్పించటంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇసిఐఎల్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం చిలుముల మల్లేశం అధ్యక్షతన జరిగిన డిహెచ్‌పిఎస్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం లభించి ఏడు దశాబ్దాలు పైబడుతున్నా భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కలలు గన్న సమానత్వ సమాజం నేటికీ దక్కక పోవటం శోచనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దళితుల జీవన స్థితిగతులు దయనీయంగా ఉన్నాయన్నారు. కేంద్ర బడ్జెట్‌లో దళితుల కోసం కేటాయింపపులు సరైన స్థాయిలో లేవని, విద్య, ఉపాధి, భూమి పంపిణీ, గృహ నిర్మాణం, ఆరోగ్య సేవల వంటి కీలక రంగాల్లో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక లోపించిందని విమర్శించారు. ఏప్రిల్ 17,18 తేదీల్లో వరంగల్ నగరంలో డిహెచ్‌పిఎస్ రెండవ రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ దళితులపై దాడులు, అగ్రకుల పెత్తందార్ల దౌర్జన్యాలు నానాటికి పెరిగిపోతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం సమర్థవంతంగా అమలు కావటం లేదని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వేగవంతం కావటం వల్ల రిజర్వేషన్ల అవకాశాలు తగ్గిపోతున్నాయని, దీని ప్రభావం దళిత యువతపై తీవ్రంగా ఉంటుందన్నారు. సమావేశంలో డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి దండు రమేష్, దర్శన్ యాదగిరి, ఉపాధ్యక్షులు బాబు, సీనియర్ నేత లక్ష్మినారాయణ, రాములు, అశోక్, ఆనంద్, విజయ, జయమ్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పంటలకు సరైన మద్దతు ధర లభించే వరకు పోరాటం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

సిపిఐలోకి బిఆర్‌ఎస్ వార్డు మెంబర్

**ప్రజాపక్షం/మునుగోడు :** నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని ఊకోండి గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ వార్డు మెంబర్ జాల పరమేశం మరికొంతమంది యువకులతో కలిసి సిపిఐలో చేరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ కార్యకర్తలు మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన పత్తి, వరి ధాన్యం పంటలకు సరైన మద్దతు ధర లభించే వరకు సిపిఐ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా ఆన్‌లైన్ యాప్ వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ యాప్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటల కనీస మద్దతు ధరను పెంచాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజా రామచంద్రం,తీర్పారి వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్, యువజన సంఘం నాయకులు బండారు శంకర్, అటుకురి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.






## ఉచిత వైద్య సేవలు అభినందనీయం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** గ్రామీణ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.ఆదివారం నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో గ్రామపం చాయతీ, లైన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ (గెలాక్సీ) సంయుక్త ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సౌజన్యంతో, నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు ఉచిత వైద్య శిబి రాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి, ఉప సర్పంచ్ ఓర్సు మంజుల శ్రీను,నల్లగొండ లయన్స్ క్లబ్ గవర్నర్ మదన్ మోహన్ రేపాల, లయన్స్ క్లబ్ గెలాక్సీ అధ్యక్షుడు జూలకంటి మల్లారెడ్డి సెక్రటరీ వెంకట్ రెడ్డిపాల్గొన్నారు.

## భర్తను సుత్తితో కొట్టి చంపిన భార్య



**ప్రజాపక్షం/గుండాల :** భర్తను సుత్తితో కొట్టి కిరాతకంగా హతమార్చిన సంఘటన శనివారం అర్ధరాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గుండాల మండల కేంద్రానికి చెందిన మారదబోయిన బిక్షం (64) భార్య ఉప్పలమ్మ ఇద్దరు కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారిద్దరు తరుచూ కొడవ పడేవారని అదే క్రమంలో శనివారం అర్ధరాత్రి ఇద్దరి మధ్య గొడవ ముదరడంతో ఆవేశానికి లోనైన భార్య ఉప్పలమ్మ పక్కనే ఉన్న సుత్తితో బిక్షం తలపై బలంగా కొట్టడంతో బిక్షం అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా యాదాద్రి డిఎస్పి శ్రీనివాస్ నాయుడు, సిఐ శంకర్‌గౌడ్, ఎస్ఐ తేజం రెడ్డిలు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కస్తూర్బా పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంటశాలను పరిశీలించారు.తనిఖీ అనంతరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులతో కలిసి గణిత శాస్త్రంపై చర్చించారు. వారికి ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకొని, కొన్ని అంశాలను స్వయంగా బోధించారు. విద్యార్థులతో సాన్నిహిత్యంగా మాట్లాడి చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో సమావేశమై కష్టపడి చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రోత్సహించారు. సమయపాలన, క్రమశిక్షణ పాటిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచనలు ఇచ్చారు.ఈకార్యక్రమంలో చందూర్ ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో యుగంధర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/మాడుగులపల్లి :** మండలంలోని చర్లగూడెం గ్రామంలో అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు గడ్డం మారయ్య,సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ మీసాల రమేష్ , దాతల సహకారంతో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం కలగడం తనకు గొప్ప గౌరవమని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, సామాజికవేత్త అంబేద్కర్ వాది డాక్టర్ జాడీ రాజు, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు మాదుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రతీ న్యాయవాదికి చట్టాలపై అవగాహన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** న్యాయవాదులు తమ విధులను కోర్టులో, సమాజంలో బాధ్యతాయుతంగా నిర్వంచాలని న్యాయవాద పరిషత్ జాతీయ అధ్యక్షులు కే. శ్రీనివాస మూర్తి సూచించారు.ఆదివారం పట్టణం లోని షాలిని రెసిడెన్సీ లో న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధి గా శ్రీనివాస మూర్తి హాజరై మాట్లాడుతూ న్యాయవాదులు తమ విధులను కోర్టులో, సమాజంలో బాధ్యతాయుతంగా నిర్వహించి యువ న్యాయవాదులు నిరంతరం కేసులను చదువుతూ సీనియర్ న్యాయవాదుల సలహాలు సూచనలతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతీ న్యాయవాది చట్టాల మీద పూర్తి అవగాహన తో ఉండాలని అంతేగాక జాతీయ భావం, పేద ప్రజల పట్ల సేవాభావం కూడా కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి సునీల్, కేంద్ర కమిటీ సభ్యులు మేరెడ్డి నర్సింహా రెడ్డి, కవిత, గౌరీష్ జి, సోమంచి వెంకటేశ్వర్లు ,రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి చొక్కాల నాగరాజు పాల్గొన్నారు.




# మునుగోడులో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు దేశానికి ఆదర్శమని వెల్లడి



**ప్రజాపక్షం/మునుగోడు:** తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు.ఆదివారం మండల కేంద్రంలోని లక్ష్మీదేవిగూడెం సమీప దుబ్బకాలువ రోడ్డులో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి తగిన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన, నైపుణ్యాధారిత విద్య అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడులో 2,500 మంది విద్యార్థుల కోసం సమగ్ర సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం శుభపరిణామమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 79 పాఠశాలలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతోందని, మునుగోడుకు పాఠశాల కేటాయించినందుకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.తన చిన్ననాట అన్ని కులాలు, మతాలకు చెందిన విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకున్న రోజుల్ని గుర్తు చేస్తూ, అదే భావనతో అన్ని వర్గాల నిరుపేద కుటుంబాల పిల్లలు ఒకే తాటిపై చదువుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో ఇతర రా ష్ట్రాలు చేపట్టని విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతి రెడ్డి చండూరు ఆర్డిఓ శ్రీదేవి, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో యుగంధర్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, కాంగ్రెస్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.



## యూరియా యాప్‌ను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి సరిపడా ఎరువు అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరెల్లి వెంకటేశ్వర్లు, మహిళా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల డిమాండ్ చేశారు. ఆదివారం నకిరేకల్ లోని ఎన్.ఆర్. భవన్‌లో రైతు సంఘం మండల మహాసభ నిర్వహించారు. యూరియా పంపిణీపై సరైన ప్రణాళిక లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రైతులను ఇబ్బందులకుగురిచేస్తున్నాయని వారు విమర్శించారు. పంటలు పొట్టదశలో ఉండటంతో యూరియా అత్యవసరమని తెలిపారు. యాప్‌లో దరఖాస్తు చేయగానే స్టాక్ లేదని చూపుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. వెంకటయ్య, ఆకుల భాస్కర్, గింజల లక్ష్మి, వెంకటేశ్వర్లు, కృష్ణ, పరమేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులపై చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులు ఉద్యోగులపై చిత్తశుద్ధితో ఉందని వారి ప్రతి సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఆత్మకూర్ మండలం ఏవికె తండ పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో అత్యధిక మంది ఉపాధ్యాయులు ఉద్యోగులు కాంగ్రెస్ అభిమానులు ఉన్నారని ఇటీవల జరిగిన ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపులో వారంతా భాగస్వాములయ్యారన్నారు. ప్రభుత్వంతో, ఉన్నతాధికారులతో మాట్లాడి సూర్యాపేట జిల్లా కేంద్రంలో పిఆర్‌టియు భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తాను అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని అన్నారు. గత 26 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన తంగెళ్ల పద్మ పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. తాను పని చేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉత్తమ విద్య అందించేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, నాయకులు తంగెళ్ల వాసుదేవ రెడ్డి, నంద్యాల చౌదరి రెడ్డి పాల్గొన్నారు.

# మార్కెట్‌లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను దళారులచే మోసపోకుండా మార్కెట్ యార్డ్‌లోనే అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఈనామ్ 2.0 రైతు రిజిస్ట్రేషన్ నమోదు కేంద్రాన్ని మార్కెట్ కార్యదర్శి ఫసీయుద్దీన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమలు అవుతున్న ఈనామ్ 1.0 పాత విధానంను నవీకరించి ఈనామ్ 2.0 నూతన విధానంను భారత ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందని వివరించారు. పాత విధానంలో రైతులు వారి యొక్క సరుకులు అమ్ముకునేందుకు మార్కెట్ యార్డుకు వచ్చిన సమయంలో గేట్ ఎంట్రీ నందు రైతు పేరు, ఊరి పేరు, సరుకు వివరములు, బస్తాల సంఖ్య, వాహనం వివరాలు, కమీషన్‌దారుపేరు చెప్పవలసి ఉండేదన్నారు. ఇప్పుడు అమలులోకి వచ్చిన ఈనామ్ కొత్త విధానం నందు కూడా అట్టి వివరములతో పాటు రైతు యొక్క ఫోన్ నంబర్, పుట్టిన తేదీ కొరకు ఆధార్ కార్డు సమర్పించవల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇట్టి విధానం నందు ఒక్కసారి రైతులు వారి యొక్క పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్న యెడల వారు మళ్లీ మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు కనీస వసతులలో భాగంగా ఉదయం ఉచిత అల్పాహారం, మధ్యాహ్నం రూ.5కే భోజనం అందించడం జరుగుతుందన్నారు. మార్కెట్ అభివృద్ధిలో భాగంగా రూ.3కోట్ల 75లక్షలతో షెడ్డు నిర్మాణం, ప్రస్తుతం ఉన్న టాయిలెట్ బ్లాక్‌కు అదనంగా స్త్రీ, పురుషులకు వేరువేరుగా టాయిలెట్ బ్లాక్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులకు నిరంతరం మంచినీరు, విశ్రాంతి గదులు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డులో అమ్ముకోవాలని కోరారు.

# బుద్ధవనం చేరుకున్న దమ్మ పాదయాత్ర

ఎమ్మెల్యే జైవీర్‌తో కలిసి ఘనంగా స్వాగతం పలికిన మల్లేపల్లి లక్ష్మయ్య



**ప్రజాపక్షం/నందికొండ:** గౌతమ బుద్ధుని శాంతి సందేశంతో ప్రజలను మేల్కొల్పుతూ సాగిన మూడవ దమ్మయాత్ర ఆదివారం సాయంత్రానికి బుద్ధవనం చేరుకుంది. దమ్మయాత్ర బుద్ధవనం చేరుకున్న సందర్భముగా స్థానిక శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మానస స్వర్ణ లతో కలిసి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య దమ్మయాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. బంజారా నృత్యాలతో, కోలాటాలతో, ఒగ్గు కళాకారుల నృత్యాలతో, స్థానికులు, బౌద్ధ అభిమానులు అధిక సంఖ్యలో దమ్మయాత్ర బృందానికి అడుగు అడుగున పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 403 కిలోమీటర్లు పాదయాత్ర తో వచ్చిన థాయిలాండ్, భారతీయ బౌద్ధ భిక్షువులుకు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో బుద్ధవనములోని అశోక ధర్మ చక్రం వద్ద బౌద్ధ భిక్షువుల పాదాలను కడిగారు. థాయిలాండ్ నుండి బౌద్ధ దమ్మయాత్ర ద్వారా తీసుకురాబడిన బుద్ధ ధాతువులను బుద్ధ వనం ప్రధాన ద్వారం నుండి స్థానిక శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మానస స్వర్ణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షులు గగన్ మాలిక్, సిద్ధార్థ లతో కలిసి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య బుద్ధ ధాతువులను ఊరేగింపుగా తీసుకువచ్చి మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో సందర్శకుల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిలను వెలిగించిన అనంతరం ధ్యానం చేశారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ సంఘ థాయిలాండ్ అధ్యక్షులు పర సంగ్ సక్ కోవిడో ప్రధాన బౌద్ధ భిక్కు ఆధ్వర్యంలో థాయిలాండ్ భిక్షువులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భిక్షులతో సుమారు 403 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి బుద్ధవనం చేరుకున్నారన్నారు. థాయిలాండ్ రాజకుటుంబం నుండి మహా థాయ్ ఈ దమ్మయాత్రకు సహకారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధ వనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్‌రావు, బుద్ధ వనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, స్థానిక సీఐ శ్రీను నాయక్, ఎస్సై ముత్తయ్య, బౌద్ధాభిమానులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి

బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆ శ్రీరాముడిని ప్రార్థించినట్లు రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం మండలలోని రాములబండ గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై గ్రామస్తులతో కలిసి స్వామివారి రథాన్ని స్వయంగాలాగి ప్రారంభించారు.గ్రామంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల సందడి మధ్య భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్తులంతా ఏకమై ప్రతీ ఏడాది బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సత్సంబంధాలను పెంపొందిస్తాయని తెలిపారు.అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి,తహసిల్దార్ పరుశురాం నల్గొండ మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, స్థానిక సర్పంచ్ చామకూరి శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

## రాజకీయంగా ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత ఇవ్వని వారిని తిరస్కరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆర్యవైశ్యులు ఆత్మ విమర్శ చేసుకోవాలని రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వని వారిని తిరస్కరించాలని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వాసవీభవన్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాజీ మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన ఆర్యవైశ్య అభ్యర్థులకు సన్మాన సభలో అఖిల భారత ఆర్యవైశ్య మహిళా నాయకురాలు రాయపూడి భవాని, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు తెడ్ల జవహర్‌బాబు, పందిరి రవీందర్, చిట్యాల మున్సిపల్ ఛైర్మన్ పందిరి గీతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులకు అన్ని రాజకీయ పార్టీల నుంచి సరైన ప్రాధాన్యత లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు సాధించిన ఆర్యవైశ్య అభ్యర్థులు పందిరి గీత, గుడిపాటి క్రాంతిన వీన్, మిట్టపల్లి శ్రీదేవికృష్ణయ్యలను ఆర్యవైశ్య సంఘం అసోసియేషన్, వాసవీ క్లబ్ ప్రతినిధులతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్రనాయకులు కర్నాటి రమేష్, పట్టణ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భువనగిరి మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:** శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర శర్మ ఆశీర్వాదంతో ఆలయ ప్రధాన అర్చకులు నరేందర్ శర్మ నూతనంగా ఎన్నుకోబడిన భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పొత్తంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు మిగతా 33 మంది కౌన్సిలర్లకు వేద ఆశీర్వచనము మేమంటో శాలువా దండతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి దిండిసత్యం, ట్రెజరర్ శ్యాంసుందర్, ఘటాని ప్రోగ్రాం చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అమెరికా యుద్ధోన్మాద చర్యలను భారత ప్రభుత్వం కూడా ఖండించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుల వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత తనకు తోచిన విధంగా, నచ్చిన విధంగానిర్ణయాలను తీసుకుంటూ ప్రపంచ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఇటీవల టారీఫ్‌లతో పేరుతో తనకు గిట్టని దేశాలను భయపెడుతూ తన దారికి తీసుకవస్తున్నాడని,ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తూ తన మాట వినని దేశాన్ని ఆ దేశం వల్ల ప్రపంచానికి ప్రమాదం ఉందనే సాకును చూపుతూ ఇరాన్‌లాంటి స్వతంత్ర్య దేశాలపై దాడులను చేసి, ఆదే శ అధ్యక్షులనే చంపడం దారుణమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం తన మాట వినని, వెనిజులా అధ్యక్షుడని ఆ దేశంపై దాడిచేసి, తన దేశంలోనే తనను కిడ్నాప్ చేసి, అమెరికాకు తీసుకవచ్చి అమెరికా చట్టాల ప్రకారం విచారణ చేసి శిక్ష విధించాలనుకోవడం ప్రజాస్వామ్యానికి నిదర్శనం అని అన్నారు.

## వేసవికి ముందే అడుగంటుతున్న నాగార్జున సాగర్ రిజర్వాయర్

డెడ్ స్టోరేజ్ వైపు పరుగెడుతున్న నీటిమట్టం



**ప్రజాపక్షం/నందికొండ:** రాష్ట్రానికి జీవనాడిగా భావించే నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీటిమట్టం ఆందోళనకరంగా పడిపోతోంది. వేసవి పూర్తిగా ప్రారంభం కాకముందే నిల్వలు గణనీయంగా తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగిస్తోంది.కుడి,ఎడమ కాలువల ద్వారా సాగునీటి అవసరాల కోసం నీటి విడుదల నిరంతరం కొనసాగుతుండటంతో రిజర్వాయర్‌లోని నిల్వలు రోజురోజుకు క్షీణిస్తున్నాయి.ఇప్పటికే ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆవిరీభవనం కూడా నీటి తగ్గుదలపై ప్రభావం చూపుతోంది.ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే, మే నెల రాకముందే రిజర్వాయర్ నీటిమట్టం డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని నీటి రంగ నిపుణులు అంచనా వేస్తున్నాయి.డెడ్ స్టోరేజ్‌కు చేరుకుంటే సాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.తాగునీటి అవసరాలను ప్రాధాన్యంగా తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.సాగర్ పరివాహక ప్రాంతాల్లో రైతులు పంటల సాగు,వేసవి పంటల ప్రణాళికలపై అనిశ్చితి నెలకొనే విధంగా ఉందని ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నీటి వినియోగంపై నియంత్రణ,ప్రాధాన్యతల ఆధారంగా విడుదల,ప్రత్యామ్నాయ జలవనరుల వినియోగం వంటి చర్యలు అత్యవసరమని అధికారులు భావిస్తున్నారు.ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో నీటి పంపిణీపై కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఇక వర్షాకాలం ప్రారంభం వరకు సాగర్ నీటిమట్టం ఎలా ఉండబోతుందన్నదే అందరిలో ఆసక్తి,ఆందోళన కలిగిస్తున్న అంశంగా మారింది.

**రిజర్వాయర్ సమాచారం :** నాగార్జున సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులకు గురువారం సాయంత్రానికి 538.30 అడుగులుగా ఉండి నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు 184.8035 టీఎంసీలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 2000క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు,ఎస్ఎల్‌బిసి ఏఎంఆర్‌పి ద్వారా 2000క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతూ ఉంది ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి జరగటం లేదు రిజర్వాయర్ కు 19411 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదలవుతుంది.



## సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజవవర్గంలోని హన్వాడ మండలం ఎనిమిది తాండాలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి, లబ్ధిదారుల ఆనందంలో భాగస్వామ్యమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు భద్రమైన నివాసం కల్పించడం ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని ఆయన చెప్పారు. ఇది సామాజిక సమానత్వానికి నాంది అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీమిబాయి లింగమ్ నాయక్, ఉప సర్పంచ్ ఎన్. నరేష్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, కార్య నిర్వహక అధ్యక్షులు చెన్నయ్య, కార్పొరేటర్లు ఎం. ప్రవీణ్ కుమార్, ఎస్ శేఖర్, యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సంజీవ రెడ్డి, ఎస్. విజయ్ కుమార్, మండల తహశీల్దార్ కిష్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి : సలీం

**ప్రజాపక్షం/అమరచింత :** వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సలీం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండు చేశారు. ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఎఐపికెఎంఎస్ మండల రెండవ మహాసభకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఇట్టి మహాసభకు సలీం హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. వ్యవసాయ కార్మికుల సామాజిక భద్రత కోసం కార్మికులందరూ ఐక్యమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సలీం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి హనుమంతు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రాజన్న, టియూసిఐ రాష్ట్ర నాయకులు పి.అరుణ్ కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చింతలన్న, తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ మాసం - సహనం, దాతృత్వానికి ప్రతీక

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** ఇస్లాం మతస్థుల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమవడంతో ముస్లిం సోదరులు శక్తి, నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ఈ మాసాన్ని ఆత్మశుద్ధి, సహనం, దయ, దాతృత్వానికి ప్రతీకగా భావిస్తారు. చంద్ర దర్శనంతో ప్రారంభమైన రంజాన్ నెలలో భక్తులు ప్రతిరోజూ ఉదయం సూర్యదయానికి ముందు సహరీ భోజనం చేసి, సాయంత్రం సూర్యాస్తమయం అనంతరం ఇఫ్తార్‌తో ఉపవాస విరమణ చేస్తారు. పవిత్ర ఖురాన్ ఈ మాసంలోనే అవతరించిన విశ్వసిస్తారు. అందువల్ల ఖురాన్ పఠనం ఎక్కువగా చేస్తారు. రంజాన్ మాసంలో ముఖ్యమైన ఆచారమైన రోజా (ఉపవాసం) ద్వారా మనస్సు, శరీరాన్ని నియంత్రించుకోవడం, పాపాలను దూరం పెట్టడం లక్ష్యంగా భావిస్తారు. ఉపవాస సమయంలో చెడు ఆలోచనలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఎక్కువ సమయం ప్రార్థనలు, ఖురాన్ పఠనం, దైవస్మరణలో గడుపుతారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు పాటిస్తున్నారు. తరావీహ్ నమాజ్ ప్రతి రాత్రి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలైన తరావీహ్ నమాజ్ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నమాజ్‌లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు మసీదులకు చేరుకుంటున్నారు. రాత్రివేళ మసీదులు ప్రార్థనలతో కళకళలాడుతున్నాయి. జకాత్ రంజాన్ మాసంలో దానధర్మాలకు విశేష ప్రాధాన్యం ఉంటుంది. ఆర్థికంగా స్తోమత ఉన్నవారు జకాత్ రూపంలో తమ సంపాదనలో ఒక భాగాన్ని పేదలకు అందిస్తున్నారు. ఇది ఇస్లాం మతంలోని ముఖ్య కర్తవ్యాలలో ఒకటిగా భావించబడుతుంది.

## మోడల్ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రంలోని మోడల్ బాలికల హాస్టల్‌ను స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మవెంకటయ్యగౌడ్‌లు అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను నాణ్యమైన భోజనం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం స్నాక్స్ తదితర విషయాలపై విద్యార్థులను ఆరా తీశారు. పోటీ పరీక్షల్లో వంద శాతం మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నా విద్యార్థినీ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముదికొండ కవితరమేష్, సిబ్బంది మంజుల,యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు మట్ట భరత్ విద్యార్థులు తదితరులున్నారు.



# సీడ్ పత్తి రైతుపై కంపెనీల ధరపోటు

గతంలో రూ.750, ఇప్పుడు రూ.400 ఇదేం న్యాయం?



**ప్రజాపక్షం/గద్వాల్ :** నడిగడ్డ ప్రాంతంలో విత్తన పత్తి (సీడ్ కాటన్) సాగుచేస్తున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకవైపు పెట్టుబడులు రెట్టింపవుతుంటే, మరోవైపు విత్తన కంపెనీలు చెల్లించే ధరను సగానికి తగ్గించేయడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గతంలో గౌరవప్రదమైన ధర లభించేదని, ఇప్పుడు కంపెనీల కుట్రలతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నామని రైతులు వాపోతున్నారు. ధరల్లో భారీ కోత రైతు గుండె కోత విత్తన కంపెనీలు ధరల నిర్ణయంలో అనుసరిస్తున్న మొండి వైఖరి రైతు పాలిట శాపంగా మారింది. గతంలో ఉన్న ధర గత సీజన్లలో విత్తన పత్తి ప్యాకెట్‌కు కంపెనీలు రూ.700 నుంచి రూ.750 వరకు చెల్లించేవి. ఈ ధర రైతులకు కొంత ఊరటనిచ్చేది. కానీ ఇప్పుడు అదే కంపెనీలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ కేవలం రూ.400 నుండి రూ.500 మాత్రమే చెల్లిస్తున్నాయి.

**భారీ నష్టం :** ప్యాకెట్‌కు దాదాపు రూ.250 నుండి రూ.300 వరకు ధర తగ్గించడం వల్ల, ఎకరాకు రైతుకు వేల రూపాయల నష్టం వాటిల్లుతోంది. కూలీల ఖర్చుతో రెట్టింపు భారం ధరలు తగ్గుతున్న తరుణంలో సాగు ఖర్చులు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి. ఒక్కో కూలికి రూ.500 ఇప్పుడు ఏ గ్రామంలో చూసినా కూలీకి 500 రూపాయలు కంటే తక్కువ ఇస్తే ఎవరూ పనికి రావడం లేదు.

విత్తన పత్తి సాగులో కలుపు, క్రాసింగ్ పనుల కోసం ప్రతిరోజు కనీసం 4 నుండి 5 మంది కూలీలు అవసరమవుతున్నారు. అంటే, రోజుకు రూ.2500 కేవలం కూలీలకే అవుతోంది. ఈ లెక్కన కంపెనీలు ఇచ్చే రూ.500 600 ధర మనుషులు కూలీలకు కూడా సరిపోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆర్గనైజర్‌ల కనుసన్నల్లో దోపిడీ :** ఈ ధర తగ్గింపు వెనుక విత్తన కంపెనీలు , సీడ్ ఆర్గనైజర్ల హస్తం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. కంపెనీల నుంచి వచ్చే లాభాలను పంచుకుంటున్న ఆర్గనైజర్లు, క్షేత్రస్థాయిలో రైతు పడుతున్న కష్టాన్ని పట్టించుకోవడం లేదు. అప్పులు తెచ్చి సాగు చేసిన రైతుకు పాత బకాయిలు (సుమారు రూ.1,50,000 ప్రతి రైతుకు) పాత బకాయిలు సీడు ఆర్గనైజర్లకు ఉన్నందు వలన సీడ్ కొత్త ధర గిట్టుబాటు కాక ఆత్మహత్యలే శరణం అనే స్థితికి చేరుకున్నారు. గతంలో లాగే ప్యాకెట్‌కు కనీసం రూ.750 చెల్లించాలి. పెరిగిన కూలీల ఖర్చు రోజుకు 500) 600 రూపాయలు వరకు అంటే ఎకరానికి రోజుకి సాగుకు సుమారు ఒకలక్ష పన్నెండు వేల రూపాయలు దాదాపు ఒక్క ఎకరాకు ఖర్చు అవుతుంది. కూలీల భారం మరియు పడిపోయిన దిగుబడిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే విత్తన కంపెనీలతో చర్చలు జరపాలి. ఆర్గనైజర్ల అక్రమ జోక్యాన్ని అరికట్టి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కోకన్వీనర్‌గా

# మొహమ్మద్ హఫీజ్ రెహమాన్ నియామకం

ఘనంగా సన్మానించిన
మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ గా మహ్మద్ హఫీజ్ రెహమాన్ నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాసులు నియామక పత్రాన్ని ఇచ్చినట్లు రాష్ట్ర కో కన్వీనర్ మొహ్మద్ హఫీజ్ ఉర్ రెహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా జడ్చర్ల పట్టణ కేంద్రంలోని రాష్ట్ర మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి నివాసంలో ఆదివారం ఉద్యమకారుల ఫోరం కో కన్వీనర్‌గా నియామకమైన మహమ్మద్ హఫీజ్ ఉర్ రెహమాన్ ను రాష్ట్ర మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగామాజీ మంత్రి శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు తరపు పోరాడి వారి హక్కుల సాధనకై కృషి చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి సూచించారు. హఫీజ్ ఉర్ రెహమాన్ మాట్లాడుతూ 14 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్ర సాధనకై ఎందరో ప్రాణత్యాలు కాదు చేశారని అనంతరం కేసుల్లో కొందరు ఇప్పటికీ కూడా కోర్టులో తిరుగుతున్నారని పేర్కొన్నారు. కావున ఉద్యమకారుల తరపున తన వంతు పోరాటం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పిట్టల మురళి, కౌన్సిలర్ దేవా, ప్రశాంత్‌రెడ్డి, నంద కిషోర్ గౌడ్, సతీష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీశైలం యాదవ్, రాంమోహన్, నరసింహులు, శ్రీనివాస్ యాదవ్, పెద్ది వెంకటేశ్, మచ్చల శ్రీను, నవీన్ చంద్ రెడ్డి, అంజిబాబు, ప్రదీప్, సత్యం, రమేష్, మతిన్, సోహెల్, నిజాముద్దీన్, బాబా, నిరంజన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానం

వనపర్తి 11వ వార్డులో
సిసి కెమెరాల ఏర్పాటు
మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్
స్వాతి హరిబాబు



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** నేరాల అదుపులో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని, ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానమని వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.ఎస్.రత్నం అన్నారు. వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దే లక్ష్యంతో, వార్డు కౌన్సిలర్ స్వాతి హరిబాబు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ స్వాతి హరిబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో వార్డు ప్రజలకు ఇచ్చిన హామీని మాట తప్పకుండా మడమ తిప్పకుండా నెరవేర్చినట్లు తెలిపారు. జీ.ఆర్ ఫౌండేషన్ అధినేత జి.రఘు ఆలోచనలు, ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. రాజకీయాల్లో గెలిచిన తర్వాత హామీలను విస్మరించే వారు ఉంటారని, కానీ తాము ప్రజల భద్రతకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మిగిలిన వార్డులకు స్ఫూర్తి పట్టణంలోని మిగిలిన 33 వార్డుల కౌన్సిలర్లు కూడా ఇదే విధంగా ముందుకు వచ్చి తమ వార్డుల్లో సీసీ కెమెరాలు, ఏర్పాటు చేయాలని, ప్రజలకు శాంతి భద్రతల విషయంలో పూర్తి రక్షణ కల్పించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి టౌన్ ఎస్ఐ హరిప్రసాద్, జీ.ఆర్.ఫౌండేషన్ అధినేత జి.రఘు, న్యాయవాది ఉత్తరయ్య, అచ్యుతాపురం సర్పంచు శాంతయ్య, నిరంజన్ గౌడ్, శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి, నరేష్ రెడ్డి, రఘు, బంగాలి , తిరుపతయ్య, జేమ్స్, జ్ఞానేశ్వర్ , వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కౌన్సిలర్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమాల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. 1వనపర్తి4ఎ,

## జడ్చర్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను పరిశుభ్రంగా ఉంచుకొని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇలాంటి రోగాలు లేకుండా సరిచూసుకోవాలని కలెక్టర్ మున్సిపాలిటీ అధికారులు ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని వివిధ వార్డులలో ఆయన పర్యటించి మున్సిపాలిటీ సిబ్బందితో మాట్లాడారు. మురికి కాలువలు, రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పరిశుభ్రత గురించి వివరించి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మున్సిపాలిటీ సిబ్బందిదని ఆయన సూచించారు. తడి చెత్త, పొడి చెత్త గురించి ప్రజలకు వివరించి లాభనష్టాలను తెలిపే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రతివార్డులో మురికి కాలువలు, రోడ్లు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ, అవసరమైన ప్రాంతాలలో దోమలు సంబంధించిన పొగను పిచికారి చేస్తూ చూసుకోవాల్సిన బాధ్యత మున్సిపాలిటీ సిబ్బందిపైన ఉందని ఆయన పేర్కొన్నారు.

## మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలు : ఎస్‌పి జానకి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా మార్చి 1వ తేదీన ఉదయం 6 గంటల నుండి 31 వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నెల రోజుల పాటు 30,30 (ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఈ విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తుల పై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## బిఆర్ఎస్‌లో భారీ చేరికలు

బిజెపి నుంచి 20 మంది నాయకులు గులాబీ గూటికి

**ప్రజాపక్షం/చిన్నంబావి :** చిన్నంబావి మండలం కొప్పునూర్ గ్రామంలో రాజకీయంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ పార్టీకి చెందిన కొప్పునూర్ గ్రామ నాయకులు 20 మంది, అలాగే వెల్లటూరు గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు భారత రాష్ట్ర సమితిలో చేరారు. ఈ కార్యక్రమం కోల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు అభిలాష్ రావు సమక్షంలో జరిఇంది. చేరికైన నాయకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని తెలిపారు యువతకు పెద్దపీట వేసే పార్టీ బీఆర్ఎస్ అని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. అభిలాష్ రావు కూడా మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలకు అండగా నిలిచే పార్టీ బిఆర్ఎస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎస్ఐ శ్రీనివాసులు చొరవతో గుంతల పూడ్చివేత

వాహనదారులకు తప్పిన తిప్పలు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల :** కర్నూల్‌కి వెళ్ళే దారిలో చాలా కాలం నుంచి పెద్దవాగు బ్రిడ్జి, దర్గా దగ్గర ఉన్న బ్రిడ్జి, పోలోని వాగు బ్రిడ్జి తదితర ప్రాంతాలలో రోడ్డుపై ఏర్పడ్డ గుంటలను అయిజ పట్టణ ఎస్సై శ్రీనివాసులు మట్టి వేయించి జెసిబితో గుంతులను పూడ్చి తన వంతుగా మానవత్వం చాటుకుంటున్నారు. ప్రజల సమస్యల పట్ల ఎన్నిసార్లు సోషల్ మీడియాలో పెట్టినా ఆర్ అండ్ బి అధికారులు మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో అసలు ఆర్ అండ్ బి అధికారులు ఉన్నారా..? ఉంటే ఘాడ నిద్రలో ఉన్నారా..? అర్థం కానీ పరిస్థితి అయిజ మండలంలో ఎక్కడ చూసిన రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉన్నాయి.

ఎన్నోసార్లు ప్రమాదాలు జరిగిన కూడా అధికారులకు మాత్రం చీమ కుట్టినట్టు అనిపించడం లేదు. ఇప్పటికైనా దీనికి సంబంధిత అధికారులు వచ్చే వర్షా కాలంలోపు బ్రిడ్జి పనులు, రోడ్ల రూపురేఖలు మార్చాలని వాహన దారులు ప్రజలు కోరుకుంటున్నారు.

## శ్రీనివాస్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

మాజీ ఎంపిపి సూర్య ప్రతాప్‌గౌడ్

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని మాజీ ఎంపిపి సూర్య ప్రతాప్ గౌడ్ అన్నారు.పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని పిఎంఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పదవి విరమణ కార్యక్రమంలో మాజీ ఎంపిపి స్యూప్రతాప్‌గౌడ్ పాల్గొన్నారు.శ్రీనివాస్‌రెడ్డి దంపతులను మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ శాలువా పూల మాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది బాల్య జీవితాలలో అక్షర జ్ఞానంతో వెలుగులు నింపి వారి జీవితాలను బంగారు బాటలు వేశారని శ్రీనివాస్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు.ఈ కార్యక్రమంలో జనుల బొగుడ సర్పంచ్ ఆది ధర్మేంధర్ నారాఓణపల్లి సర్పంచ్ భైరావరాములు,మాజీ సర్పంచ్‌లు సత్యం,కొండల్‌రావు,మాజీ ఎంపిటిసిలు రవికుమార్,తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులు

**ప్రజాపక్షం/కొత్తకోట :** విద్యార్థులకు బెల్టు సర్టిఫికెట్లు అందించిన ఎం.డి.ఫయాజ్ మహబూబ్‌నగర్ మా పట్టణంలోని పద్మావతి కాలనీలో ఆర్ఎఫ్ గ్రామర్ స్కూల్ ఆవరణలో గాడ్స్ అన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రీటింగ్ టెస్టులో దాదాపు 30 మంది విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు లో చక్కటి ప్రతిభ కనబరిచి బెల్ట్ సర్టిఫికెట్లు సాధించారు. విద్యార్థులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన స్కూల్ డైరెక్టర్ ఎం.డి.ఫయాజ్, పుష్పలత, విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి చేసిన అద్భుత విన్యాసాలు తిలకరించి విద్యార్థులను అభినందించడం జరిగిందని మహబూబ్‌నగర్ క్లబ్బు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ తెలిపారు. క్లబ్బు ఫౌండర్ అబ్దుల్ నబీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు రఫీ ఖాద్రి, సీనియర్ కరాటే మాస్టర్స్ పరమేష్, జాషర్ సాదిక్, జి.హరీష్ యాదవ్, విద్యార్థులను అభినందించారు.

## బీటి రోడ్డు నిర్మాణం చేపట్టండి

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని మర్రిగుంత తండాకు వెళ్లే దారిపై కంకర పరిచి నెలలు గడుస్తున్నా బీటీ వెయ్యడం అధికారులు మరిచారని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు సక్రునాయక్ అన్నారు. మర్రిగుంతతండా గ్రామపంచాయతీ పరిధిలోని మూడు నుంచి నాలుగు తండాలు ఉన్నాయని వారు వారి నిత్యవసర సరుకులకు, తమ పనుల నిమిత్తం వెళ్లేందుకు ప్రధాన రోడ్డు కావడంతో ప్రతి నిత్యం ఎవరో ఒక్కరూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు.సంబంధిత అధికారులు స్పందించి బీటి ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## స్నేహమేరా జీవితం .. స్నేహమేరా శాశ్వతం

**ప్రజాపక్షం/మల్దకల్ :** అనుకొని ప్రమాదం వల్ల పాము కాటుకు గురి అయ్యి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మిత్రునికి మేమున్నామంటూ భరోసా ఇచ్చిన మన స్నేహ బృందం కుర్తి రావులచెరువు గ్రామానికి చెందిన మన మిత్రుడు కే ప్రభాకర్ రెడ్డి పాముకాటుకు గురి అయ్యి చికిత్స పొందుతున్న తరుణంలో వరి ఆరోగ్యం కుదుటపడాలని, మళ్లీ ఎప్పటిలాగా సంతోషంగా ఉండాలని మన స్నేహితుల అందరి సహకారంతో వారికి మన వంతు బాధ్యతగా 50 వేల రూపాయలు అందించడం జరిగింది. ప్రభాకర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని మళ్లీ అందరితో సంతోషంగా గడపాలని మిత్రులందరు అభాలాసించారు. ఈ కార్యక్రమంలో మన మిత్రులు కుర్తి రావులచెరువు గ్రామ సర్పంచ్ భగవంతు, శివ, గోవర్ధన్ కేశన్న గౌడ్, ఈదన్న, రాజేష్. తిరుమలేష్, గాంగధర్ రెడ్డి తిమ్మ రాజు, లోకేష్ రెడ్డి ఫక్రుద్దీన్, ఓబులేష్, జయన్న, శంకర్ లు పాల్గొన్నారు. మిత్రునికి ఆపదలో మేమున్నామంటూ తోడ్పాటు అందించిన మిత్రులందరికీ మరొకసారి కృతజ్ఞతలు నేను సైతం అంటే మనకు భరోసానిస్తూ ఆర్థికంగా సహకారం అందించి ఆశీర్వదించిన గురువులు మక్బూల్ అహ్మద్ ప్రత్యేక కృతజ్ఞతలు ఇదే స్ఫూర్తి ఇక ముందు కూడా కొనసాగాలని మన బ్యాచ్ మిత్రుల అందరికి అన్నివేళలా అందుబాటులో ఉండే విధంగా సహకారం అందించాలని కోరుకుంటున్నాం.



## టైక్వాండో తూటాలు.. కిక్ కోడితే పతకాలు

**ప్రజాపక్షం/కొత్తకోట :** హైదరాబాద్‌లోని ఇటివాలా గచ్చిబౌళి బాలయోగి ఇండోర్ స్టేడియంతో జరిగిన సీఎం కప్ తైక్వాండో పోటీలకు వనపర్తి నుంచి 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సిఎం కప్‌లో మొత్తం 27 పార్టిసిపేట్ చేయగా, అందులో 2 సిల్వర్ మెడల్స్ 4 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. విజేతలను కోచ్‌లను కొత్తకోట మున్సిపల్ చైర్మన్ పి.అరుణ్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ పి.అరుణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ పి.పల్లవికృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ డా.పి.జె. బాబు, కౌన్సిలర్లు ఎన్.జె. బోయేజ, సలీమ్, సుధరాంహోమన్ రెడ్డి, చంద్రకాంత్, జె.అఖిలాసుభాష్, రవీంద్‌రెడ్డి, మురళియాదవ్, బాదం వెంకటేశ్వర్లు, వనపర్తి తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు నరేసునాయుడు, ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, సీనియర్ మాస్టర్ పి.నరేందర్‌రెడ్డి, డి.పెంటన్నలు కోచ్‌లు వి.పరుశురాములు, వి.శివశంకర్, ఎం.రవిలను అభినందించారు.

## అమరవీరులకు ఘన నివాళి

**ప్రజాపక్షం/వెల్దండ :** మాదిగ అమరవీరుల త్యాగాల వెలకట్టలేనివని బీఆర్ఎస్ పార్టీ నాయకులు యువ నాయకులు పోలే అశోక్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కొప్పు గెల్వయ్య అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో శ్రీశైలంహైదరాబాద్ రహదారిపై అంబేద్కర్ విగ్రహం ముందు ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరవీరులైన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ అమరవీరుల త్యాగం, మందకృష్ణమాదిగ 30 ఏళ్ల పోరాటం ద్వారా రిజర్వేషన్ వర్గీకరణ సాధించుకున్నామని, గత కొని సంవత్సరాలుగా రాని విద్యా, ఉద్యోగ అవకాశలు నేడు వరీకరణతో అధికంగా పోందుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో దూళ్ల చిన్న పెద్దయ్య, ఈదులపల్లి శ్రీనివాస్, వెంకటేష్, లక్ష్మణ్‌ప్రకాశ్, పకాడీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
సోమవారం
02-03-2026
www.prajapaksham.in

శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేష్'. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్‌లు హీరోయిన్స్. కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ నిర్మిస్తున్నారు. తాజాగా సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా మెన్షన్ హౌస్ మల్లేష్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు

రీల్

## క్లైమాక్స్ చిత్రీకరణలో సంబరాల ఏటిగట్టు



హీరో సాయి దుర్గా తేజ్ పాన్ ఇండియా సంబరాల ఏటి గట్టుతో సిద్ధమవుతున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వంలో పాన్ఇండియా బ్లాక్‌బాస్టర్ హనుమాన్ అందించిన ప్రైమ్షో ఎంటర్టైన్మెంట్ బ్యానర్పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం భారీ, హైఆక్టేన్ క్లైమాక్స్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. క్లైమాక్స్ కోసం ప్రత్యేకంగా 20 కోట్లకు పై గా కేటాయించారు. 35 రోజుల షెడ్యూల్ జరుగుతోంది, ఇందులో 18 భారీ యాక్షన్ బ్లాక్‌లు ఉన్నాయి, ప్రముఖ స్టంట్ డైరెక్టర్ కెవిన్ మా స్టర్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. యుద్ధభూమి ని తలపించేలా రూపొందించిన క్లైమాక్స్ మహాభారతంలోని కురుక్షేత్ర యుద్ధం గుర్తు చేసేలా ఉండబోతుంది. ప్రేక్షకులకు రా, ఇమర్సివ్, విజువల్‌గా గ్రాండియర్ అ నుభూతిని అందించేలా ఈ క్లైమాక్స్‌ను మలిచారు. సా యి దుర్గా తేజ్ ఈ చిత్రానికి పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఇంటెన్స్, ఫియర్స్ మేకోవర్‌తో పాటు ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాల కోసం హై రిస్క్ స్టంట్స్‌ను స్వయంగా చేస్తూ, తన కెరీర్‌లో ఇప్పటివరకు మోస్ట్ ఛాలెంజింగ్‌గా నిలిచిన పాత్రలో కనిపించబోతున్నారు. టాప్ టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేస్తోంది. సినిమాటోగ్రఫీని వెట్రివేల్ పళనిసామి అందిస్తుండగా, సంగీతాన్ని బి. అజనీష్ లోకనాథ్ సమకూరుస్తున్నారు. ఎడిటింగ్‌ను నవీన్ విజయ కృష్ణ నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైన్‌ను గాంధీ నడికుడికర్ రూపొందిస్తున్నారు. ప్రతి విభాగంలోనూ అత్యుత్తమ నైపుణ్యంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ పాన్ఇండియా విడుదలకు సిద్ధమవుతున్న సంబరాల ఏటిగట్టు ఈ సంవత్సరంలో బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్‌గా నిలుస్తోంది. సాయి దుర్గా తేజ్, ఐశ్వర్య లక్ష్మి, జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల నటిస్తున్నారు.




## 6 నుంచి 'గాంధీ టాక్స్' స్ట్రీమింగ్



థియేటర్‌లలో అద్భుతమైన స్పందన వచ్చిన తర్వాత 'గాంధీ టాక్స్' ఇప్పుడు మార్చి 6 నుండి జీ 5లో ప్రపంచ డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధంగా ఉంది. ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళంలో అందుబాటులోకి రానుంది. మూవీమిల్, క్యోరియస్‌తో కలిసి జీ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం థియేటర్‌లలో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. కిషోర్ పాండురంగ్ బెలేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గాంధీ టాక్స్'లో విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, అదితి రావు హైదరి, సిద్ధార్థ్ జాదవ్ వంటి అద్భుతమైన తారాగణం నటించింది. ఏఆర్ రెహమాన్ అందించిన మ్యూజిక్ అందించారు. 'గాంధీ టాక్స్' అనేది వ్యక్తిగత నష్టం, ఆర్థిక ఒడిదుడుకులు, నైతిక సందిగ్ధతలను ఎదుర్కొన్న కొందరి వ్యక్తుల ప్రయాణం. వారి మార్గాలు, ప్రయాణాలు ఎలా కలిశాయి.. ఆ తరువాత కలిగిన పర్యవసానాలు ఏంటి? అనే ఆసక్తికరమైన అంశాలతో కథ సాగుతుంది. ఎలాంటి డైలాగ్స్‌లేకపోయినా నటీనటుల పర్ఫామెన్స్, విజువల్స్, మ్యూజిక్‌తోనే కథను నడిపించిన తీరు అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులకు లోతుగా లీనమయ్యే, కనెక్ట్ చేసేలా ఓ సినిమాటిక్ ఎక్స్‌పిరియెన్స్‌ను 'గాంధీ టాక్స్' ఇస్తుంది. డిజిటల్ స్ట్రీమింగ్ సందర్భంగా విజయ్ సేతుపతి మాట్లాడుతూ గాంధీ టాక్స్' నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఎన్నో విషయాల్ని ఈ మూవీ కమ్యూనికేట్ చేస్తుంది. మన పర్ఫామెన్స్, ప్రజెన్స్‌తో పూర్తిగా భావోద్వేగాలను వ్యక్తపరచడం ఒక ప్రత్యేకమైన అనుభవం. థియేటర్‌లో మాకు అద్భుతమైన స్పందన రావడం ఆనందంగా ఉంది. ఇక ఇప్పుడు ఈ చిత్రం ఇప్పుడు ZEE5 ద్వారా అందరి ఇళ్లలోకి రాబోతోంది. ప్రేక్షకులు మా 'గాంధీ టాక్స్'తో, అందులోని సందేశంతో కనెక్ట్ అవుతారని, ఓ మంచి సినిమాటిక్ ఎక్స్‌పిరియెన్స్‌ను పొందుతారని ఆశిస్తున్నాను' అని అన్నారు.అదితి రావు హైదరి మాట్లాడుతూ ''గాంధీ టాక్స్' నన్ను ఎంతో ఆకర్షించింది. అందులోని నిశ్చలత, దృశ్యమానంతో కథ చెప్పడం గొప్ప విషయం. సినిమాలోని ప్రతి క్షణం, ప్రతీ పాత్రతో ఆడియెన్స్ కనెక్ట్ అవుతారు. మా మూవీకి థియేటర్‌లో మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం జీ5 ఈ చిత్రాన్ని అన్ని భాషలలో విస్తృత ప్రేక్షకులకు తీసుకువస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది మీ స్వంత మార్గంలో గమనించడానికి, ప్రతిబింబించడానికి, అర్థం చేసుకోవడానికి మిమ్మల్ని ఆహ్వానించే కథ' అని అన్నారు. దర్శకుడు కిషోర్ పాండురంగ్ బెలేకర్ మాట్లాడుతూ ''గాంధీ టాక్స్' నాకు చాలా వ్యక్తిగతమైన, ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్. మాటలు లేకుండా కథ చెప్పడం సాధారణ విషయం కాదు. పూర్తిగా విజువల్స్, ప్రదర్శనలు, సంగీతంపై ఆధారపడటం అనేది మమ్మల్ని సవాలు చేసింది. థియేటర్‌లలో ఈ చిత్రానికి లభించిన ప్రేమ, ప్రశంసలు చాలా ప్రోత్సాహకరంగా అనిపించాయి. జీ 5 ఈ చిత్రానికి ప్రతిచోటా ప్రేక్షకులను చేరుకోవడానికి ఒక వేదికను ఇస్తున్నందుకు నేను కృతజ్ఞుడను. దీని ద్వారా మరింత ఎక్కువ మంది ప్రేక్షకులు 'గాంధీ టాక్స్' భావోద్వేగ ప్రయాణాన్ని, ప్రత్యేకమైన కథను అనుభవించడానికి వీలు కల్పిస్తుంది' అని అన్నారు.

## శ్రీనివాస మంగాపురంలో విలన్‌గా మోహన్ బాబు



దర్శకుడు అజయ్ భూపతి ప్రస్తుతం చేస్తున్న తాజా చిత్రం' శ్రీనివాస మంగాపురం' చేస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. అగ్ర నిర్మాత అశ్విని దత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నిర్మాత పి కిరణ్ నిర్మిస్తున్న శ్రీనివాస మంగాపురంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. వెంకటప్పయ్య నాయుడుగా మోహన్ బాబు ఫెరోషస్ ఫస్ట్ లుక్ అదిరిపోయింది. పోస్టర్‌లో ఆయన ఇంటెన్స్‌గా నడుస్తూ, రా అథారిటీని ప్రజెంట్ చేశారు. సాల్ట్ అండ్ పెప్పర్ జుట్టు, మీసం ఆయన ఫియర్స్ వ్యక్తిత్వాన్ని మరింత హైలైట్ చేస్తుంటే, తెల్లటి కుర్తాధోతి ఆయనను శక్తివంతమైన గ్రామ పెద్దగా చూపిస్తోంది. మెడలో బంగారు గొలుసులు, చేతికి వాచ్, బ్రేస్లెట్ వింటేజ్ మాస్ టచ్‌ను అందిస్తున్నాయి. ఆయన వెనుక తుపాకులతో నిలిచిన మనుషుల సమూహం చూస్తుంటే భయాన్ని కూడా కలిగించే వ్యక్తి అర్థమౌతుంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. సంగీతాన్ని జివి ప్రకాశ్ కుమార్ సమకూరుస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ జయకృష్ణ , ఎడిటింగ్ బాధ్యతలను మాధవ్ కుమార్ గుల్లపాటి నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైనర్ సాహి సురేష్. హైఇంటెన్సిటీ యాక్షన్ సన్నివేశాలకు రియల్ సతీష్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాత: పి.కిరణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాకమూరి నారాయణ స్వామి ఫైట్స్: రియల్ సతీష్.

## లీక్ చేసి బ్లాక్ మెయిల్ చేశారు: శ్రీవిష్ణు

శ్రీ విష్ణు హీరోగా నటించిన విష్ణు విన్యాసం సినిమా ఫిబ్రవరి 27న విడుదలైంది. ఈ స ందర్భంగా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ విష్ణు విన్యాసం నిన్న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్‌లో రిలీజ్ చేశాం. నేనెప్పుడూ కూడా ఫ్యామిలీస్ యూత్‌ని నమ్ముకునే సినిమాలు చేస్తాను. వాళ్ల రెస్పాన్స్ ఫస్ట్ షో, సెకండ్ షో నుంచి చాలా బాగా కనిపించింది. సినిమా చూసి మమ్మల్ని అప్రిషియేట్ చేసిన అందరి కీ కూడా చాలా థాంక్స్. నవ్వించాలనే ప్రయత్నంతో చేసిన సినిమా ఇది.ఈ సిని మా ఫాస్ట్ గా రిలీజ్ చేయాలనే నిర్ణయానికి రావడానికి కారణం.. ఎలా జరిగిందో తెలియదు గానీ మా సినిమా అంతా డిసెంబర్ లో లీక్ అయిపోయింది. లీక్ చేసి మా నిర్మాతని బ్లాక్ మెయిల్ చేశారు. విడుదల ముందురోజు వరకూ ఇదంతా జరిగింది. టీమ్ అంతా సహకారం అందించారు. ఇర వై రోజుల పనిని ఏడు రోజుల్లో రాత్రి, పగ లూ విరామం లేకుండా చేయాల్సి వచ్చింది అన్నారు. హీరోయిన్ నయన్ సారిక మా ట్లాడుతూ.. అందరికి నమ స్కారం. థియేటర్‌లో ఆడియన్స్ తో కలిసి సినిమా చూ శాను. ఆడియన్స్ రియాక్షన్ అదిరిపోయిం ది. చాలా హ్యాపీగా అనిపించింది. బుక్ మై షో లో ట్రెండ్ అవుతున్నాయి. ఈ విషయ ంలో చాలా ఆనందంగా ఉందని చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ రథన్, ప్రొడ్యూసర్ సుమంత్ నాయుడు, సుబ్రహ్మణ్యం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కళ్యాణి నిర్మాణ సారథ్యంలో రవం

తారక్ ఫిలిం హౌస్ బ్యానర్ పై హీరో ప్రశాంత్ రాదారపు హీరోయిన్ అనుశ్రీ నటించిన చిత్రం రవం. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా మర్చి 6న ఆహాలో విడుదల కాబోతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ ను ప్రముఖ దర్శకుడు వివి.వినాయక్ విడుదల చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''మంచి కన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న రవం సినిమా విజయం సాధించి చిత్ర యూనిట్ సభ్యులందరికి మంచి పేరు రావాలని''అన్నారు డైరెక్టర్ శ్రీరామ్ మన్నార్ ఈ చిత్రాన్ని చాలా గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే తో తెరకెక్కించారు, ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యే అంశాలు ఈ సినిమాలో ఉండబోతున్నాయి. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కరాటే కళ్యాణి.



## 'పల్లెలోని సందల్లణన్నీ మీవే' పాట రిలీజ్



కోర్ట్ చిత్రంలో హర్ష్ రోషన్, శ్రీదేవీ తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. మళ్లీ ఇప్పుడు వీరిద్దరూ కలిసి 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కించారు. 'బ్యాండ్ మేళం' టీజర్, 'తిప్పు కుంటానవ్' అనే పాట ఎంతగా వైరల్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఇక ఇప్పుడు ఈ మూవీ నుంచి రెండో పాటను విడుదల చేశారు. 'పల్లెలోని సందల్లన్ని మీవే' అంటూ సాగే మెలోడీ పాటను రవితేజ సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. 'పల్లెలోని సందల్లన్ని మీవే' అంటూ సాగే ఈ బ్యూటీఫుల్ మెలోడీ పాటకు విజయ్ బుల్గానిన్ ఎంతో క్యాచీ ట్యూన్ను అందించారు. ఆస్కార్ అవార్డు గెలుచుకున్న గీత రచయిత చంద్రబోస్ సాహిత్యం ఎంతో అర్థవంతంగా ఉంది. ఈ పాటను శ్వేతా మోహన్ ఆలపించారు. లిరికల్ వీడియోని చూస్తుంటే.. గిరి, రాజిల స్కూల్, చైల్ మెమొరీస్కు సంబంధించినట్టుగా కనిపిస్తోంది. హర్ష్ రోషన్, శ్రీదేవి స్కూల్ యూనిఫాంలో కనిపించడం, స్కూల్లో చేసిన అల్లరి పనులు, కంపోజ్ చేసిన స్టెప్పులు, పాటను చిత్రీకరించిన తీరు అందరినీ మంత్రముగ్ధులను చేసేలా ఉంది. సునీల్ సున్నాపు, ఫాల్గుణి బంగేరా కంపోజ్ చేసిన హుక్ స్టెప్పులు నెట్టింట్లో వైరల్ అయ్యేలా కనిపిస్తున్నాయి.శివ రాజు ప్రణవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించారు. శివ ముప్పరాజు ఎడిటింగ్, స్క్రీన్ ప్లే బాధ్యతల్ని నిర్వర్తించారు. సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫర్గా పని చేశారు. ఇక ఈ మూవీలో సాయికుమార్ కీలక పాత్రను పోషించారు. ఈ సినిమాను మార్చి 13న భారీ ఎత్తున విడుదల చేయబోతోన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: శివరాజు ప్రణవ్, సంగీతం: విజయ్ బుల్గానిన్, స్క్రీన్‌ప్లే, ఎడిటింగ్: శివ ముప్పరాజు, డీఓపీ : సతీష్ ముత్యాల, గీత రచయిత: చంద్రబోస్, ఆర్ట్ డైరెక్టర్: నార్ని శ్రీనివాస్.

## వలసవాద ఎజెండాలకు రైతులను బలి చేయొద్దు: ఎఐకెఎస్

**న్యూఢిల్లీ:** సార్వభౌమ దేశమైన ఇరాన్‌పై దాడులు, ఆ దేశాధినేత ఆయాతుల్లా అలీ ఖామేనీ హత్యతో అంతర్జాతీయ చట్టాన్ని, ఐరాస చార్టర్‌ను అమెరికాఇజ్రాయిల్ ఘోరంగా ఉల్లంఘించాయని అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) వ్యాఖ్యానించింది. అమెరికాఇజ్రాయిల్ చర్యలను ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. యుద్ధాన్ని ఆపాలని, మానవాళిని కాపాడాలని నినాదమిచ్చింది. వలసవాద అజెండాలకు రైతులు బలి కాకూడదని తేల్చిచెప్పింది. ఇరాన్ ప్రజల రక్తాన్నిగానీ మన రైతుల చెమటనుగానీ అమెరికా యుద్ధ యంత్రానికి ఇంధనంగా మారనివ్వబోమని స్పష్టం చేసింది. మోదీ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల ద్వారా మోసం చేయడం నుంచి యుద్ధాలకు మద్దతిచ్చే స్థాయి వరకు వెళ్లిందని, అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహమైందని ఎఐకెఎస్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య విమర్శించారు. అమెరికాఇజ్రాయిల్ దురాక్రమణను ముక్తకంఠంతో ఖండించాలని, రైతు వ్యతిరేక వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలని, ఐరాస, అంతర్జాతీయ చట్టాన్ని కాపాడాలని, ఐ2యూ2, క్వాడ్ సహా అమెరికా నేతృత్వ యుద్ధాలతో భారత్‌ను ముడిపెట్టే అన్ని రకాల సైనికవ్యూహాత్మక కూటమల నుంచి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 'ముందు వాణిజ్య ఒప్పందం పేరుతో మన సార్వభౌమత్వం కోసం వచ్చారు... ఖరీదైన అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేసేలా బలవంతం చేస్తూ మన రైతాంగాన్ని నాశనం చేస్తున్నారు. ఇప్పుడు భారతదేశ దౌత్యాన్ని అడ్డుపెట్టుకొని ఓ దేశంపై బాంబు దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పుడు మనం మౌనంగా ఉంటే రేపు వ్యూహాత్మక భాగస్వామ్యం నెపంతో మన బిడ్డలను అమెరికా యుద్ధాల్లో చావడానికి పంపుతారు. కాబట్టి, శాంతి కోరే ప్రతి ఒక్కరు, కార్మికులు, విద్యార్థులు, రైతులు, యువత ఏకం కావాలి. ఈ సామ్రాజ్యవాద దుశ్చర్యలను ప్రతిఘటించాలి. ఫిబ్రవరి 12న చేసిన ఆందోళన ఇందుకు నాంది మాత్రమే. ప్రభుత్వం ఈ విధంగా యుద్ధం దిశగా అడుగులు వేస్తూ... వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తున్నట్లయితే భారతదేశ రైతులు పెద్దఎత్తున ఉద్యమం చేపడతారు. ఇరాన్ ప్రజల రక్తాన్నిగానీ మన రైతుల చెమటనుగానీ అమెరికా యుద్ధ యంత్రానికి ఇంధనంగా మారనివ్వబోం' అని క్షీరసాగర్, రావుల వెంకయ్య స్పష్టంచేశారు. ఆరంభంలోనే యుద్ధాన్ని ఆపేలా గళమెత్తాలంటూ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

## మరో ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు హైదరాబాద్ ఆతిథ్యం

ఈ నెల 8 నుండి మహిళల హాకీ
వరల్డ్ క్వాలిఫైయింగ్ టోర్నమెంట్
మెగా ఈవెంట్‌కు ఆదిత్యం ఇవ్వనున్న
గచ్చిబౌలి హాకీ స్టేడియం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2026కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. క్రీడారంగంలో దేశంలోనే అత్యంత చురుకైన నగరంగా పేరుగాంచిన హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా వేదికకు వేదిక కానుంది. ఫెడ రేషన్ ఇంటర్‌నేషనల్ డే హాకీ (ఎఫ్ఐహెచ్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2026 టోర్నమెంట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించబడింది. ఈ పోటీలు మార్చి 8 నుండి 14, 2026 వరకు హైదరాబాద్‌లోని నూతనంగా పునర్నిర్మించబడిన గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరుగనున్నాయి.

**ఈ క్వాలిఫయర్స్‌లో మొత్తం ఎనిమిది దేశాల జట్లు**

భారత్, ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ పాల్గొంటున్నాయి. ఈ టోర్నమెంట్ 2026 మహిళల హాకీ వరల్డ్ కప్‌కు అర్హత సాధించేందుకు కీలక పాత్ర పోషించనుంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఎటువంటి లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాల ఆస్ట్రో టర్ఫ్, ఆధునిక సదుపాయాలు, అత్యున్నత భద్రతా ఏర్పాట్లు, క్రీడాకారులు అధికారుల కోసం ప్రీమియం వసతి ఏర్పాటు చేశారు. అలాగే హెచ్ఐఎఫ్ ప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలోని పలు శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ఇప్పటికే భారత జట్టు, ఇంగ్లాండ స్కాట్లాండ్, ఉరుగ్వే జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. అన్ని జట్లకు అంతర్జాతీయ ప్రమాణాల వసతి, ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పించబడ్డాయి.

**తెలంగాణ సంస్కృతి పరిచయం**

ఈ టోర్నమెంట్ సందర్భంగా నగరానికి విచ్చేసే క్రీడాకారులు, అంతర్జాతీయ ప్రతినిధుల కోసం ప్రత్యేక వారసత్వ పర్యటనలు, వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని పరిచయం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు రూపొందించారు.

**క్రీడాభివృద్ధికి తెలంగాణ కట్టుబాటు**

రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యత వలన తెలంగాణలో అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2026 నిర్వహణతో హైదరాబాద్ మరోసారి ప్రపంచ క్రీడా పటంలో తన స్థానాన్ని మరింత బలపరుచుకోనుంది. సందర్భంగా అన్ని జట్లు, అధికారులు, అభిమానులను తెలంగాణ ప్రభుత్వం హృదయపూర్వకంగా స్వాగతిస్తోంది.

## అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆ దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు పాటించాలని సిఎం సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తెలుగు ప్రజలను సురక్షితంగా రప్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటుందని అన్నారు. ఇరాన్, ఇతర గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తున్నదని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. సంబంధిత దేశాల్లో ఉన్న భారత ఎంబసిలు, కాన్సులేట్‌తోనూ సంప్రదింపులు జరపాలని సిఎం ఆదేశించారు. తెలంగాణ ప్రజల భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## మావోయిస్టులు లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

హోం పోర్ట్‌ఫోలియోను నిర్వహిస్తున్న శర్మ అభివర్ణించారు. 'నేటి పునరావాసం చాలా ముఖ్యమైనది. బలంగిర్–బర్‌గఢ్–మహాసముంద్ డివిజన్ నుండి పదిహేను మంది నక్సలైట్లు లొంగిపోయారు. ఈ విభాగంలో ఇంకా 15 మంది సభ్యులు మాత్రమే మిగిలి ఉన్నారు. వారందరూ ఇప్పుడు ఆయుధాలు విడిచిపెట్టారు' అని ఆయన రాయ్‌పూర్‌లో విలేకరులతో అన్నారు. లొంగిపోయిన వారిలో స్పెషల్ జోనల్ కమిటీ స్థాయి సభ్యుడు వికాస్ కూడా ఉన్నారు. ఆయన మావోయిస్టు సంస్థ వెస్ట్ సబ్‌జోనల్ విభాగానికి కార్యదర్శిగా పనిచేస్తున్నారు. లొంగిపోయిన కార్యకర్తలలో ఆరుగురు పురుషులు, తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. వారు మూడు ఎకె47 రైఫిల్స్, రెండు సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్స్ (ఎస్ఎల్ఆర్‌లు), రెండు ఇన్సాస్ రైఫిల్స్, మూడు 303 రైఫిల్స్ వంటి ఆయుధాలతో లొంగిపోయారని శర్మ చెప్పారు. అధికారికంగా లొంగిపోయే ముందు బుధవారం రాత్రి ఈ బృందం భద్రతా దళాలతో సంబంధాలు ఏర్పరచుకున్నట్లు అధికారులు తెలిపారు. గత రెండు సంవత్సరాలలో ఛత్తీస్‌గఢ్‌లో 532 మంది మావోయిస్టులు తటస్థీకరించబడ్డారు. 2,700 మందికి పైగా లొంగిపోయారు. 2,000 మందిని అరెస్టు చేశారు.

## భారీ పేలుడు (మొదటి పేజీ తరువాయి)

ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) బృందాలు ఘటనా స్థలంలో ఉన్నాయని, యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఫడ్నవిస్ తెలిపారు. పేలుడు జరిగిన వెంటనే గాయపడిన వారిని నాగ్‌పూర్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా కలెక్టర్ విపిన్ ఇటాంకర్, పోలీసు సూపరింటెండెంట్ హర్ష్ పోదార్ సంఘటనా స్థలంలో పర్యవేక్షించారు. కంపెనీ డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో ఉదయం 7 గంటల నుండి ఉదయం 7.15 గంటల మధ్య ఈ సంఘటన జరిగిందని ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్ ప్రతినిధులు పిటిఐకి తెలిపారు. 'ఈ సంఘటన ప్లాంట్‌లోని ప్యాకింగ్ ప్రాంతంలో జరిగింది. ఆ సమయంలో అక్కడ ఎటువంటి క్రియాశీల తయారీ కార్యకలాపాలు జరగలేదు. ఘటనకు గల కచ్చితమైన కారణం దర్యాప్తు తరువాతే తెలుస్తుందని, సంబంధిత అధికారులతో పూర్తిగా సహకరిస్తున్నామని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్గత సమీక్షస్తున్నామని, దర్యాప్తు ఫలితాల ఆధారంగా తగిన దిద్దుబాటు, నివారణ చర్యలు తీసుకుంటామని పేర్కొంది. బాధిత ఉద్యోగులు, వారి కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించడం తమ తక్షణ ప్రాధాన్యత అని కంపెనీ తెలిపింది. కంపెనీ తక్షణ ఆర్థిక సహాయం అందిస్తోందని, గాయపడిన వారికి వైద్య చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చును భరిస్తోందని అది తెలిపింది.

## పెరిగిన విద్యుత్ డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అప్రమత్తంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. శనివారం (ఫిబ్రవరి 28న) 6057 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను అధిగమిస్తూ 6267 మెగావాట్లకు చేరుకోవడం ఎన్‌పిడిసిఎల్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. ఎన్‌పిడిసిఎల్ సంస్థ ముందస్తుగా తీసుకున్న ప్రణాళికాబద్ధమైన చర్యల ఫలితంగా ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. రోజురోజుకు ఎండలు పెరుగుతుండటంతో విద్యుత్ డిమాండ్ కూడా విపరీతంగా పెరుగుతోందని, అయినప్పటికీ, ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధిపై తాము ప్రత్యేక దృష్టి పెట్టామని, సిఎం రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క , ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ నిరంతర పర్యవేక్షణ, దిశానిర్దేశంతో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మట్టి తరలించిందెంత?

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నిస్తున్నారు.

**భూదాన్ భూ విస్తీర్ణం ఎంత...?**

వినోబాబావే భూదానోద్యమం సందర్భంగా వెలుగుమట్ల రెవెన్యూలో సేకరించిన భూమి ఎంత అన్న దానిపై ఇప్పుడు చర్చ సాగుతుంది. సర్వే నెం. 147, 148, 149లలో కలువల రాజారావుకు 60 ఎకరాల భూమి ఉంది. ఆయన 31.07 ఎకరాల భూమిని భూదాన్ ట్రస్ట్‌బోర్డుకు ఇచ్చారు. మిగిలిన 30 ఎకరాల భూమిని దుండేటి అప్పయ్య, మేకల అచ్చమ్మ, రావులపాటి నర్సమ్మ అనే వ్యక్తులకు విక్రయించారు. భూదాన్‌కు కేటాయించిన భూమి కూడా గొల్లగూడెం, రుద్రమ్మకోట, పుట్టకోట తదితర గ్రామాలకు చెందిన పేదలకు పంపిణీ చేశారు. అది మట్టి గుట్ట కావడంతో సాగుకు అనుకూలంగా లేకపోవడంతో భూ పంపిణీ చేసిన తర్వాత కూడా రైతులు ఆ వైపు చూడలేదు. వాస్తవానికి భూదానోద్యమం సందర్భంగా సేకరించిన భూమిని వెంటనే భూమి లేని పేదలకు పంపిణీ చేశారు అన్నది వాస్తవం. రైతులు సాగులోకి తీసుకురాకపోవడంతో 147,148, 149 లలో 31.07 ఎకరాలు భూదాన్ భూమి గానే కొనసాగుతుంది. 147లో రాష్ట్ర ప్రభుత్వం 10.20 ఎకరాలను 2008లో ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించింది. కొందరు జర్నలిస్టులకు కేటాయించడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో భూకేటాయింపు నిలిచిపోయింది. ఆ తర్వాత దానిని కస్తూర్బా విద్యాలయం, వీధి బాలల పాఠశాలకు కేటాయించారు. మిగిలిన 20ఎకరాల భూమి అలాగే ఉంది. 2014లో అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూదాన్ యజ్ఞ బోర్డును రద్దు చేసి భూదాన్ భూముల అనుభవదారులకు నోటీసులు ఇచ్చింది. ఖమ్మంలోని భూదాన్ భూమిలో ఎవరు అనుభవదారులు లేకపోవడంతో అది ప్రభుత్వ భూమిగా మారింది. ప్రభుత్వ సంస్థల కేటాయింపుకు పోను మిగిలిన భూమిలో వినోబానగర్ పేరుతో పేదలు ఆక్రమించింది ఎంత అన్న దానిపై ఎవరికి వారే లెక్కలు చెబుతున్నారు. సగానికి ఎక్కువ భూమి ఖాళీగా ఉంది. పేదలు ఆక్రమించింది ఆరు ఎకరాలకు అటు ఇటుగా ఉంటుంది తప్ప 20ఎకరాల భూమిలో పేదలు లేరన్నది సత్యం.

**మట్టి అమ్ముకున్న అక్రమార్కులు :**

ఒక పక్క పేదలు తలదాచుకునేందుకు నివాస స్థలాలను ఏర్పాటు చేసుకుంటే మరో పక్క అక్రమార్కులు మట్టి అమ్మకాల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించారు. ఇప్పుడు భూదాన్ భూమిగా చెప్పబడుతున్న దానిలో దాదాపు 100 అడుగుల మేర గుట్టను తవ్వి మట్టిని తరలించారు. మట్టిని తరలిస్తున్న సమయంలో ఏ అధికారి కూడా కన్నెత్తి చూడలేదు. మట్టి తరలింపుపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. పేదలు కష్టపడి గూడు నిర్మించుకుంటే ఆక్రమణల పేరుతో బయటకు నెట్టారు కానీ అక్రమార్కులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకో లేదు. అధికారుల నిర్లక్ష్యమే పేదలు తీవ్రంగా నష్టపోయేందుకు కారణమైంది. 2014 నుంచి క్రమేపి భూదాన్ భూ ఆక్రమణ జరుగుతూ వచ్చింది. తొలుత స్థానికులు ఆక్రమణకు ముందుకు రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొందరిని తెచ్చి భూ ఆక్రమణ చేశారు. అలా క్రమేపి భూ ఆక్రమణ విస్తరిస్తున్నప్పటికీ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. కొద్ది రోజులు గడిచిన తర్వాత అధికారులు పట్టించుకోరన్న దీమా మరో పక్క మనకు ఈ భూమిపై అధికారం వచ్చిందన్న కొందరి మాటలను నమ్మి స్థిర నివాసాలను ఏర్పరచుకు నేందుకు ప్రయత్నించారు. ఎవరి ఆర్థిక స్థితికి తగినట్లు వారు ఇండ్లను నిర్మించుకున్నారు. ఒక్కసారిగా ఇండ్లను యంత్రాలతో నేలమట్టం చేయడంతో పేదలు భారీగా నష్టపోయారు. పేదలను అక్కడే ఉంచి ప్రత్యామ్నాయం చూపి ఇండ్లను కూల్చివేసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ ప్రయత్నం చేయలేదు. స్థానికేతరులు భూ ఆక్రమణలో ఉంటే బయటకు పంపే అవకాశం ఉన్నప్పటికీ అది కూడా చేయలేదు. రకరకాల కారణాలతో తొలగింపు వాయిదా పడుతూ వచ్చింది. మొత్తంగా భూదాన్ భూముల ఆక్రమణ తొలగింపు నేపథ్యంలో నష్టపోయింది మాత్రం పేదలే.

## యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ముందుంటుందని, అవసరమైన ఆర్థిక అవసరాలను తీరుస్తామని డిప్యూటీ సిఎం భరోసా ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత మన ప్రాంత వాగ్గేయకారుల గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఇటువంటి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. చైతన్యానికి కళలే ఆయువుపట్టని అన్నారు. తెలంగాణ గ్రామాల్లోని ప్రతి సమస్యకు కళారూపాల ద్వారానే పరిష్కారాన్ని, చైతన్యాన్ని తీసుకువచ్చిన చరిత్ర మనదని డిప్యూటీ సిఎం గుర్తుచేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com